
గురువులు

జీవిత చరిత్ర

ఋషుల చరిత్రము


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in




అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఐవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ రస్తు

ఋషుల చరిత్రము

శ్రీ [illegible] అప్పయ్యశాస్త్రి

శ్రీ ర స్తు.

ఋషుల చరిత్రము

1. నారదమహర్షి.

సృష్టికర్త, కమలజునకు, సృష్ట్యాదిని సనక-సనందన-సనత్కుమార-సనత్సుజాతులను నలుగురు మానసపుత్త్రు లుదయించిరి. వారలు వేదశాస్త్రపారంగతు లగుచు, బ్రహ్మ సంతసిల్లుచు, వారలఁ జేరి, "వత్సలారా! సృష్టి యొనరించి సుఖముఁ బడయుఁడు. పొం"డని వారల నాదేశించెను; కాని, యామానసపుత్త్రులు నలుగురును ప్రవృత్తిమార్గావలంబనమునందు మనసుఁ జొరనీయక, నివృత్తిమార్గముఁ జేకొనిరి అంతఁ జతురాననుఁడు, మరల తనమనస్సువలన మరీచి-అత్త్రి-అంగిరః-పులస్త్య - పులహ - క్రతు - భృగు-వసిష్ఠ-కర్దమ-దక్ష-నారదులనువారలను పదునొకండుగురపుత్త్రుల నుత్పన్నులఁ గావించెను. కాలక్రమమున వారందఱు వేదశాస్త్రపారంగతులును, బహుళతపోధనసంపన్నులును నై, తండ్రిమనమున కామోద మొదవఁగూర్పఁజొచ్చిరి అంత బ్రహ్మ తనపుత్త్రులఁ గని సంతసిలుచు, జ్యేష్ఠానుక్రమముగఁ బదుగురపుత్త్రులఁ బరిణీతులఁ గావించి, "సంతానమును బడసి సృష్టిని వృద్ధి యొనర్పుఁ" డని యాదేశించి పనిచి, కనిష్ఠుఁడును, పదునొకండవవాఁడును నగు న్నారదునిఁ బరిణీతునిఁ గావింప నుద్యుక్తుఁడయ్యెను. నారదుఁడు

సాంసారికజీవనమునం దభిరుచి లేనివాఁడై, తండ్రిం జేరి, "కన్నతండ్రీ! సాంసారికజీవనము కష్టములకు గని, దుఃఖముల కాకరము, క్లేశములకు నిలయము. అజ్ఞానిని నామన మొల్లకున్నది. కాబట్టి ప్రవృత్తిమార్గము నాకేమాత్రమును రుచియించుట లేదు. విషయవాసనాజాలమునకు లోనైనవారలు పలువిధములగు దుఃఖములకుఁ బాలుకావలసినవార లగుదురు. నేనిదె ప్రార్థించుచున్నవాఁడను. నన్ను సంసారరూపకమగు భయదగహ్వరమునఁ ద్రోయ మదిఁ దలంపకుఁడు. నాయీతుచ్ఛజీవనమును భగవత్సేవాకైంకర్యమునకు లోనొనర్చి భవసాగరమును బార మొనరించుటకుఁ గృతనిశ్చయుండనైతిని. నన్ను మన్నింపుఁడు. నిశ్చలమును నిష్కామమును నగుభగవద్భక్తిని దయచేయుఁ"డని ప్రార్థించుచు, తనమనోనిశ్చయమును భక్తివినయములతో నిజజనకున కెఱుకపఱచెను నారదుని వైరాగ్యపుఁబలుకుల నాలించి చతుర్ముఖుఁడు కుపితుఁడై, "నామాట పాటింపక ప్రతికూలుఁడవై త్రోసిపుచ్చ నెంచితివి. కావున, గంధర్వవంశసంజాతుఁడవై, అర్ధశతసంఖ్యాకు లగుసుదతులకు దయితుఁడవై, యెడలేనివ్యామోహమున మనువాఁడవగుదువు గాత" మని యాతని శాపదగ్ధునిఁ గావించెను. జనకశాపానుసరణముగ నారదుఁడు శీఘ్రముగ గంధర్వకులమున జనియించి, ఉపబర్హణనామధారియై యథాసమయమునఁ జిత్రరథుఁడను గంధర్వుని కూఁతుల నేబదుగురను బరిణయమయ్యెను.

అనంతర మొకప్పుడు బ్రహ్మ దేవర్షిగణంబులతో పుష్కరతీర్థమున కరిగినపుడు ఉపబర్హణుని రావించి, "నాట్యకళాకౌశలమును, గానవిద్యానైపుణ్యమును బ్రదర్శింపు"మని యాతని

కాజ్ఞయొసంగెను. తదాజ్ఞానుసరణముగ నుపబర్హణుఁడు కృష్ణ లీలాకథాసంకీర్తనమును ప్రదర్శించెను. ఆసమయమం దాతఁడు జూపిన నాట్యనైపుణ్యమునకును, గానవిద్యావైశిష్ట్యమునకును, బ్రహ్మయు, దేవతలును,ఋషులును కడుంగడు ప్రసన్నులై, పలు విధముల నాతనిఁ బురస్కృతునిఁ గావించి తనివోంపక, పునః ప్రదర్శనమున కాజ్ఞయొసంగిరి. ఆజ్ఞమేరకు నుపబర్హణుఁడు, శ్రీకృష్ణునిబృందావనవిహారమును ప్రదర్శించుచు,గోపికావిరహ వర్ణనాసందర్భమున భక్తిపరవశుఁడై, యొడలెఱుంగక శాస్త్రభంగ మొనరించెను. అందుకు ద్రష్టలగు దేవతలును ఋషులును క్రుద్ధులై, యాతని రూపగుణముల నిందింపఁజొచ్చిరి. బ్రహ్మ యాతని దాసీపుత్రుఁడగునటుల శపియించెను. అంత నుపబర్హ ణుఁడు విగతధైర్యుఁడై, భయవిహ్వలుఁడై, వారలఁ బ్రసన్న చిత్తులుగఁజేయుట కుపాయాంతరమును గానక, యార్తజనశర ణ్యుఁడగు భగవంతుని తదేకచిత్తమున ధ్యానింపఁజొచ్చెను. భక్తవత్సలుఁడును, దీనజనదుఃఖభంజనుఁడును నగు కమలా మనోహరుఁడు ఉపబర్హణుని భక్తికెలరి యందావిర్భూతుఁడై యాతని కభయ మొసంగుచు,“వత్సా!నీకేమియు భయములేదు. నేనుశరణాగతవత్సలుఁడను, భక్తజనప్రియుఁడను.పరిశుద్ధాంతః కరణమున నన్నే స్మరించుచు, నన్నే శరణ్యునిగ నమ్మియున్న వ్యక్తులను విపత్తులు చుట్టుకొననేరవు. ఈదేవతలు విబుధు లును నిన్నేమియుఁ జేయఁజాలరు; కాని, ప్రజాపతి, బ్రహ్మ యొసంగినశాపము నీకవశ్యభోక్తవ్యము, అనుభవైకవేద్యము. ఆతనివాక్కమోఘము. ఈజన్మాంతమున దాసీగర్భజనితుఁడవై పంచవర్షవయస్కుఁడవగుఁడు నొకానొకబ్రహ్మవిద్యావరిష్ఠుని వలన మంత్రదీక్ష గ్రహియింపఁగలవాఁడవగుదువు. దీక్షాగ్రహ

ణానంతరము పదియేండ్లు గడచునంత శూద్రశరీరమును బరి
త్యజించి దేవఋషివై నాకు సహచరుఁడవుగాఁగలవు" అని పలు
కుచు నందుండి యంతర్ధానుఁడయ్యెను. అనంతరము సమయ
మాసన్నమగుఁడు, ఉపబర్హణుఁడు గంధర్వతనువును పరిత్య
జించి దాసీగర్భజనితుఁ డయ్యెను. ఆదాసి యొకానొక బ్రహ్మ
వాది యగుబ్రాహ్మణునకుఁ బరిచారిక.

ఒకప్పుడు పెక్కండ్రుమహర్షు లరుదెంచి, యాబ్రాహ్మణ
గృహమునందు చాతుర్మాస్యవ్రతదీక్షాపరతంత్రులై వసియింపఁ
జొచ్చిరి. ఆకాలమున వారలకు బాలుఁడగునారదుఁడు పరి
చర్య చేయఁదొడంగెను. ఆతఁ డొనర్చుపరిచర్యలకు ఋషులుఁ
బ్రసన్నులై భుక్తశేష మాతనిభుక్తి కొసంగుచుండెడివారు.
మహర్షు లొసంగుభుక్తశేషమును మహాప్రసాదముగ గ్రహి
యించి, యద్దానిని భక్తిపూర్వకముగ భుజియించుచుండినకత
మున నాతనిహృదయము విశుద్ధమైనదయ్యెను. అందువలన
నాతనికి భగవత్పాదారవిందములయందలి భక్తి యతిశయ
మయ్యెను. ఉక్తమహర్షులు హరిగుణగాన మొనర్చుసమయమున
నాబాలుఁడు నారదుఁడు స్థిరచిత్తుఁడై, భక్తిపరవశుఁడై
యాలించుచుండువాఁడు. ఆబాలుని నిశ్చలచిత్తమును, నిశ్చల
భక్తినిఁ బరికించి, యుక్తమహర్షులలో నొక రాతనిని శిష్యునిగ
గ్రహియించి, మంత్రదీక్షితునిగఁ గావించెను. ఈదీక్షవలన నార
దుని హృదయమున వైరాగ్య ముదయమయ్యెను. గురువులు
బ్రాహ్మణగృహమును వీడి చనినపిమ్మట నారదునకు గృహపరి
త్యాగమునం దిచ్ఛపొడమెను; కాని, తల్లి క్లేశవివశ యగునని
యట్లుసేయక, మాతృసేవయందు లగ్నమనస్కుఁడై గృహావాస
మును సలుపఁజొచ్చెను. అంత నొకనాటిరాత్రి యాతనిజనని

గోదోహనమున కరుగుచుండునెడఁ సర్పదష్టయై మృత్యు ముఖముఁ గనియెను. మాతృమరణానంతరము నారదుఁడు గృహవాసమును పరిత్యజించి యుత్తరదిశకరిగి, యందొక యరణ్యమున నివసించుచు, వంచలిపత్రోదకమున స్నానమాడుచు, వటవృక్షచ్ఛాయఁ గూర్చొని గురుదత్తమగుమంత్రమును జపించుచు, భగవచ్చింతనానురక్తి నలరారుచు నచిరకాలముననే భగవద్దర్శనమును బడసినవాఁడయ్యెను. అతఁడు తనకెట్టయెదుర సాక్షాత్కరించిన శ్రీహరిని దర్శించినంతనే భక్తిపరవశత్వమునఁ బులకితగాత్రుఁడయ్యెను ఆనందాశ్రుపూర్ణనయనుఁడయ్యెను. రుద్ధకంఠుఁడయ్యెను. అనఘుఁడు శ్రీమన్నారాయణుఁ డంతర్ధానుండయ్యెను. మరల శ్రీహరి సాక్షాత్కారమును బడయుటకు నారదుఁడు పలుయత్నములొనరించెను. కాని, కృతకృత్యుఁడు కాఁజాలనివాఁడయ్యె. అంత నాతఁడు వికలమనస్కుఁడు కాఁగా శ్రీహరి కరుణార్ద్రహృదయుఁడై యాకాశవాణీముఖమునఁ “నారదా! యీజన్మమున మరల నాదర్శనమును బడయఁజాలవు. నీకు నాయందుగలభక్తి నతిశయమొనరించుటకునై యొకపరి దర్శన మొసంగితిని. నాయందు నిశ్చలభక్తిఁ గలిగియుండువారలకు వారిమనోరథములు అపూర్ణములు కానేరవు. వారలను నాక్రమించుకొనియున్న కామక్రోధాదిశత్రువర్గము సమూలముగ నాశనమగును. కాఁబట్టి నన్ను భక్త్యనురాగములతో నిరంతరము భజియించుచుండుము అట్లు చేయుచుండుదువేని, శీఘ్రకాలములోనే యీశూద్రశరీరమును పరిత్యజించి దివ్యతనుధారివై, నాకు సహచరుఁడవై కృతార్థతఁ బడయఁగలవాఁడ వగుదువు’ అని యాతని కెఱుకపఱిచెను.”

ఆకాశవాణిముఖమున శ్రీహరి పలికినపలుకుల నాలించి నంతనే నారదునకు ధైర్యము అతిశయమయ్యెను. భక్తి స్పృహ తరమయ్యెను. కాలానుకరణని నారదుఁడు శూద్రశరీరమును త్యజియించెను. దివ్యదేహమును ధరియించెను. శ్రీహరికి సహచరుఁడయ్యెను. అనంతరము, ఈశ్వరునివలన భక్తివిషయమై యుపదేశమును బడసినవాఁడయ్యెను. ఈశ్వరునివలనఁ బడసిన భక్తితత్త్వోపదేశవిషయములను గ్రంథస్థమొనరించి, యాగ్రంథ రాజమునను 'నారదపంచరాత్ర'మని నామకరణముఁ జేసెను. నారదుఁడు వ్రాసినభక్తిసూత్రములపై, 'తదీయసర్వస్వ'మను వ్యాఖ్య యొండు వెలువడియెను

నారదుఁడు, భక్తచూడామణి యని పేరొందిన ప్రహ్లాదునకు తత్త్వోపదేశకుఁడు. దేవవిరోధి హిరణ్యకశిపుఁడు, మందరాద్రియందు బ్రహ్మఁ గూర్చి ఘోరతపము సలుపుచుండు తరుణమున, నాతనిభార్య గర్భవతియై యుండెను. ఆగర్భమునఁ బ్రహ్లాదుఁడు పెరుగుచుండెను. ఆతఁ డుదితుఁడైనఁ దనకు ప్రబలవిరోధి యగువాఁడగు ననువెఱపును మదిఁగొని, యాతనిఁ బుట్టిన వెనువెంటనే మడియింపఁ గృతనిశ్చయుఁడై హిరణ్యకశిపుఁ డింటలేనిసమయము సుసమయమని తలఁచి దేవరాజింద్రుఁడు, హిరణ్యకశిపుభార్యను అమరావతికిఁ జెఱఁగొనిపోవుచుండెను. ఆసమయమున దేవర్షి దేవరాజునకడ్డుపడి "ఈసాధ్వీగర్భజనితుఁడు పరమభాగవతోత్తముఁ డగుఁగాని, నీవనుకొనునట్లు నీకు శత్రుఁడు కాఁడు. ఈసుందరిఁ జెఱఁగొనుట నీకుఁ దగదు. విడిచిపుచ్చుము. ఈమెభర్త తపస్సునుండి మఱలివచ్చునంతదనుక నీమెను నాయాశ్రమమున నునిచికొని కన్నకూఁతుంబోలె సంరక్షించెద" ననిపలికి యామెఁ

విడిపించి తనయాశ్రమమునకుఁ గొనిపోయి రక్షించుచు, గర్భస్థుఁడగు ప్రహ్లాదునకు భక్తితత్త్వమును గఱపువాఁ డయ్యెను. అనంతరము హిరణ్యకశిపుఁడు తపస్సునుండి మఱలి వచ్చి తనభార్యను నారదాశ్రమమునుండి నిజగృహమునకుఁ గొనిపోయెను.

నారదుఁడు ధ్యానయోగమునఁ గని యుత్తానపాదునితనయుఁడు బాలుఁడు, ధ్రువుఁడు సాపత్నమాతృవాగ్బాణవిద్ధుఁడై మాతృయాజ్ఞచొప్పున శ్రీమన్నారాయణుని యవ్యాజకటాక్షముఁ బడయ నెంచి తపంబునకు మధువనమున కరుగుచున్నవాఁడని గ్రహించి, యాతనికడ కరుదెంచి, కరమున హస్తమిడి "వత్సా, నీ వేయుద్యమమున కగ్రేసరుఁడ వగుచుంటివో యయ్యది కష్టసాధ్యము. ఏమహనీయుని చరణకమలసందర్శనమును బడయనేరక మహర్షులైతము పరితపించుచున్నవారలము. నీకా మహనీయునిసందర్శనమును బాలుఁడవు కష్టముల కోర్వనేరనివాఁడవు నీ వెట్లు సఫలపఱచుకొన శక్తుఁడ వగుదువు? అయ్యది దుర్ఘటము. కావున నామాట పాటించి యింటికి మఱలి సుఖంబున నుండుము." అని పలికెను. నారదుని పలుకుల నాలించి ధ్రువుఁడు విగతధైర్యుఁడుగాక, "దేవా! నావంటిబాలురకు భగవచ్చరణారవిందసందర్శనసంప్రాప్తము దుస్తరమైనదైనను మీవంటిమహనీయులకృపాదృష్టికిఁ బాత్రులగువారల కది యొకఘనకార్యము గాదని నానిశ్చయము. నాయందు కృపఁజేసి నామనోరథ మీడేర ననువగుచుపాయ మారసి నాకు వివరింపుఁ" డని వినీతభావమున నారదునిఁ బ్రార్థింపఁజొచ్చెను. ధ్రువునిప్రార్థనమునకు నారదుఁడు ప్రహృష్టచిత్తుఁడై యాతనికి మంత్రోపదేశ మొసంగి తదుపాసనాక్రమ

మును వివరించి చెప్పెను. ధ్రువుఁడు నారదోపదేశానుసరణిని కఠోరతప మొనర్చి శ్రీహరిసందర్శనమును బడసి ప్రశాంత చిత్తుఁ డయ్యెను.

నారదుఁడు దక్షప్రజాపతిపుత్త్రిలను పలువురను మోక్షధర్మము నుపదేశించి విరాగులఁజేసి తపంబొనర్చుట కరణ్యమున కనిపియుండెను. అందువలన, దక్షప్రజాపతి పుత్త్ర శోకానలజ్వాలాసంతప్తమానసుఁడై నారదునిఁ జీరి, "అబోధ బాలకులగు నాపుత్త్రుల విరాగులఁజేసి సంసారదూరులుగఁజేసి లోకభ్రమణమునకుఁ బాలుగావించినవాఁడవు కావున, వారి వలె నీవును మూఁడులోకములయందును నిలువనీడఁగానక నిరంతరము పరిభ్రమణ మొనర్చువాఁడవగుదువుగాత" మని యాతని శాపదగ్ధునిఁ గావించెను.

ఒకప్పుడు, నారదుఁడు యక్షరాజపుత్త్రులు నలకూబర మణిగ్రీవులు నిరువురును, ఇరువురునుందరీమణులఁగూడి క్రీడా కౌతుకమున నొప్పియుండుస్థానమున కరుదెంచెను. అట్లరు దెంచిన నాఋషిసత్తమునిఁ జూచి యాసమణీమణులు సంకుచిత చిత్తులైరి. కాని, నలకూబరమణిగ్రీవులు ధనమదాంధులై, నారదాగమనమును సరకుఁగొనక యథాపూర్వముగ క్రీడా కౌతుకమున విరాజిలఁజొచ్చిరి. అట్లు యక్షరాజపుత్త్రులిరు వురు ననుచితవర్తనమునఁ బ్రవృత్తులై యొడలెఱుఁగక యున్న వారలను గని నారదుఁడు కినిసి "వ్రజధామమునందు మీరల లిరువురు నర్జునతరువులై నిలువుఁడు పొండు" అని పలుకుచు వారలను శాపోపహతులఁ గావించెను. అనంతరము శ్రీకృష్ణ చంద్రుఁడు వారలను శాపవిముక్తులఁజేసి యుద్ధరించెను.

శ్రేష్ఠ నారదుఁడు, ధర్మచారిణి గాంధారి యొక్కపెద్ద సుతుఁడు, ప్రజాయొక్క దుఃఖహేతువైన, దుష్టవాఁడు గర్వోన్మత్తమానస ములు తీర్థయాత్రాపర్యటన మొనర్చుచుండియు నయనియమము నకుఁ బాండవులను బట్టలఁ గాపించి వారలను కౌరవపాండవుల యొక్క విరోధమునకుఁ మూలకారణముఁ జేసి, భ్రాతృవాత్సల్యమును కోర వదనివాఁడుగ నొనర్చెను. కపటద్యూతమున యుధిష్ఠిరుని బరాజితునిఁ జేసి పాండవుల నవమానించెను. గాకుండ వారిసహ ధర్మిణిని, ద్రౌపదిని పరిభవించి, వారలను సపుత్రకముగ నరణ్య గామునకుఁ బంపించిన దుర్యోధనాదులగు సుతులకై, “నేఁడు మొదలుగ పదమూఁడుసంవత్సరములు గడచునంత, మీ రొనర్చిన యీఘోరాపరాధమునకు ప్రతిఫలముగ కౌరవకులము వినష్టమొందుఁగాక” యని కౌరవులకు శాప మొసఁగెను.

నారదుని జీవనచరిత్రమందు ఉల్లేఖనీయాంశములు పెక్కులు గలవు. ఆతఁడు లోకమున కొసంగిన మహత్త్వోప దేశరత్నములవలన పెక్కులు గ్రంథరాజములు వెలుఁగొందు చున్నవి. ఆతని యుపదేశముచొప్పున నే పరాశరనందనుఁడు వ్యాసుఁడు శ్రీమద్భాగవతరచనమునకుఁ దొడంగినవాఁ డాయెను.

నారదుఁడు భూలోకవార్తలను దేవలోకమునకును, దేవలోకవార్తలను భూలోకమునకును గొని చనుచు వార్తా వహుఁడని పేరొందినవాఁడు. ఆతనిగతి ముల్లోకనిర్నిరోధము. నారదుఁడు కలహభోజుఁడు. వారిరహస్యములను వీరికిని వీరి రహస్యములను వారికిని తెలియపఱచి వారికిని వీరికిని విరోధ మును కలిగించెడువాఁడని యాతనిపై దోషారోపణ మొందో

నర్పించుండిరి, కాని, యాతనిజీవనచరిత్రమును గూర్చి ధ్యాన పూర్వకముగ విచారణ మొనరించువారలు అతఁడు వినోద ప్రియత్వముతోఁబాటు లోకహితైషికత్వమునుగూడ గమనించి దూతకృత్యమును వహించి యున్నవాఁడను విషయమును గుర్తించనేరనివారలు కాఁజాలరు. అనేకసమయములలో నారదోపదేశమువలననే దేవతలు రాక్షసులను నాశన మొనరింపఁగలిగినవారలు కాఁగలిగిరి. స్వర్గమందుండినపాండురాజు యొక్క సందేశమును భూలోకమునకు గొనితెచ్చి ధర్మజుని కెఱుకపఱచి, యాతనిచే రాజసూయయాగమును జేయించెను. నారదుని పుణ్యశ్లోకవార్తావలితో మహాపురాణోపపురాణములన్నియు నిండియున్నవనుటకు సందియములేదు. నారదుఁడొక గానవిద్యాచార్యుఁడని సాంఖ్యపురాణము ప్రకటించుచున్నయది.

---

2. వశిష్ఠమహర్షి.

వశిష్ఠమహర్షి బ్రహ్మమానసపుత్త్రులలో నొకఁడు. బ్రహ్మవిదుఁడు. మహర్షిగణమునం దగ్రగణ్యతను బడసినవాఁడు. సప్తర్షిసంఘమునందుఁ బరిగణింపఁబడినవాఁడు. ఆసామ్, అయోధ్య, చీనాప్రాంతములయందలి యరణ్యములు వశిష్ఠుని తపోవనములని సుప్రసిద్ధిఁ గనియున్నవైనను, అతఁడు భరతఖండములోని భిన్నభిన్నప్రదేశములలో తపంబొనర్చి ఆయా ప్రదేశములను పవిత్రవంతములుగ నొనర్చియున్నవాఁడు. అతఁడు కర్దమప్రజాపతిపుత్త్రికయు, పతివ్రతాశిరోమణియు

నగు అరుంధతీదేవిని సహధర్మచారిణిగఁ గైకొనినవాఁడు. అరుంధతి పతిసేవాపరతంత్ర. పతిఁదక్క తపోదివ్యైనములను కలలోనైనఁ దలంచియెఱుఁగని పరమసాధ్వి సతులకు పతిసేవయే పరమధర్మమని పరిగణించిన నారీశిరోమణి. వశిష్ఠుఁడామె గర్భమువలన నూఱుగురుపుత్త్రుల బడసినవాఁడు అపుత్త్రులలో శక్తియనునతఁడు జ్యేష్ఠుఁడు. అతఁడు వేదవేదాంగవిదుఁడు షట్శాస్త్రపారంగతుఁడు. అదృశ్యంతి యనుకన్యారత్నమును బరిణయమైనవాఁడు. అదృశ్యంతి అసదృశరూపలావణ్య, సద్గుణసంపన్న, ధర్మపరాయణ.

ఒకప్పుడు, గాధిరాజునందనుఁడును, అయోధ్యాధిపుఁడును అగువిశ్వామిత్త్రుఁడు,మృగయావినోదియై,పరిభ్రమించుచు వశిష్ఠతపోవనంబున కరుదెంచెను. బ్రహ్మర్షివరిష్ఠుఁడగు వశిష్ఠుని కడ నందినియనుపేరుగల హోమధేను వొకండుగలదు. ఆయ్యది, బ్రహ్మర్షియాజ్ఞమేరకు ఆవశ్యకతానుసరణముగ పలువిధములగు అన్నపానీయములను స్వాదిష్టపదార్థములను ప్రదానమొనర్చుటయందు సర్వసామర్థ్యముఁ గలయది. ఆహోమధేనువుసహాయమున వశిష్ఠమహర్షి తనయాశ్రమమున కరుదెంచిన విశ్వామిత్త్రుని, నియమానుకరణిని, సైన్యయుతముగ నాతిథ్యమొసంగి సత్కరించి సంతుష్టాంతరంగునిఁ జేసెను. నందినియొక్క యాయద్భుతగుణసామర్థ్యములఁ బలకించి విశ్వామిత్త్రుఁడు సాశ్చర్యుఁడై లోభపరవశుఁడై యాధేనువును దనకిమ్మని వశిష్ఠుని సవినయముగఁ బ్రార్థించెను. అంత, వశిష్ఠుఁడు, "మహారాజా! గాధినందనా! విశ్వామిత్త్రా! ఈనందినికారణముగ నాధర్మసర్వస్వము నిర్విఘ్నముగ నిర్వహింపఁబడుచున్నది. భోజనభాజనములు వినాపరిశ్రమముగ లభ్యములగుచున్నవి. ఈవి

నెపఁబూనుదు నే నాధర్మాచరణమునకు, నాజీవననిర్వహణమునకు వజ్రాఘాత మాపాదితమగు. అంతియకాదు, ఈనందిని నన్ను వీడనేరదు. వీడునదియగునేని తనసామర్థ్యమును గోలుపోవు నదియగును. నందినివలన నేనును, నావలన నందినియును పరస్పరము సంరక్షణముఁబడయుచు సర్వశక్తిసంపన్నుల మగుచున్నవారము. కాఁబట్టి నేనిని నీకొసంగఁజాలను." అని విశ్వామిత్రునకు బదులొసంగెను. వశిష్ఠునిప్రత్యుత్తరము విశ్వామిత్రుని చెవులకు ములుకులవలె గాఢతమముగ నాఁటినవయ్యెను. అందువలన నాతఁడు క్రుద్ధుఁడై నిజపరిచారకులఁ రావించి "నందిని బంధించి కొనితెండు" అని వారల నాజ్ఞాబద్ధులఁగావించెను. విశ్వామిత్రునిదుర్వర్తనమును విలోకించి యెంతయుఁ బరితపించుచు, వశిష్ఠుఁ డశ్రుపూరితనయనుఁడై, నందినిఁ బరికించి, "కళ్యాణీ! ఈయుద్ధతక్షత్రియుఁడు మనలనిరువురను అవమానితులుగఁజేయ సమకట్టెడిని మనలనిరువురనెడబాపి దుఃఖనిమగ్నులఁగావింప నుంకించుచుండె. తరుణమాసన్నమయ్యెను. ఇఁక నీసామర్థ్యముఁ బ్రకటించుట కుద్యుక్తవగుము. అంతకన్న వేఱు శరణ్యమును గానము. ఈలోభచిత్తునిఁ దగుఫల మనుభవింపఁ జేయుము. దుర్జనులయెడ దయాదాక్షిణ్యములఁ జూపుటకు వలనుపడదు. అయ్యది లోకవినాశకము. పాపమూలకము." అని పలుకుచు నద్దానికి హెచ్చరికఁగలుగఁజేసెను. వశిష్ఠునియాజ్ఞకు ప్రతీక్షించుచున్న నందిని యాతనినోటినుండి మాటవెలువడుటయెతడవుగ, తనశరీరమునుండి యపారసేనావాహినిని వెలువరించి విశ్వామిత్రుని దర్పితపరివారమును ముంపఁజొచ్చెను. అంత పరిచారకులు బహుతరముగక్షతికిఁబాలై నిలుపోపనేరక పటాపంచలై పరుగిడఁజొచ్చిరి. అట్లు స్వప్రాణసంరక్షణాతుర

మున వసించియుండ నక్కఱిచారకులను మట్టుపెట్టనేరక విశ్వామి
త్రుఁడు క్రోధోన్మత్తుఁడై వసిష్ఠునిఁ బోరికొనఁ బిలిచి ప్రతాపా
క్రమముగా మొనర్చి యాతనిపై పలువిధములగు అస్త్రశస్త్రములను
ప్రయోగించెను వసిష్ఠుఁడు వానినన్నిటిని తనసమీపమునకును
రానీకుండ మార్గమధ్యముననే యాపుచుండెను. అంత విశ్వా
మిత్రుఁడు తాను ప్రయోగించిన ఘోరాస్త్రములన్నియు నిష్ఫ
లగుటఁ బరికించి విషణ్ణహృదయుఁడై నిర్వేదముఁ బొందఁజొచ్చె
ను. వసిష్ఠునకేవిధముగనైన నపకృతిఁ గావింపవలయునని తలం
చి తననిష్ఠాపరత్వమునఁ బొందుచుండెను అట్టి సిద్ధినొందుటకు పలు
విధములగు ప్రయత్నములు గావించెను; కాని సిద్ధసంకల్పుఁడు
కాఁజాలఁడయ్యె. అంతటితోనాతఁడు క్షత్రబలముకన్న బ్రాహ్మ
బలము ఉత్కృష్టమైనదని తలంచినవాఁడయ్యె. ఉత్కృష్టబల
సంపన్నుఁడగు వసిష్ఠుఁడు తనచేసాధితుఁడు కాఁడని నిశ్చయించిన
వాఁడయ్యె బ్రాహ్మబలసంపన్నుని సాధించుటకు దైవబలము
వలయుననుకొనుట యుక్తమని గ్రహియించి, [illegible]మృగ
శరణ్యమగు నరణ్యమునకరిగి తపంబొనర్చి యీశ్వరుని మెప్పించి,
యాతనివలన మహాస్త్రములఁ బడసి యవ్వానిని వసిష్ఠునిపైఁ
ప్రయోగించెను; కాని యాయీశ్వరదత్తాస్త్రములనుగూడ వసి
ష్ఠుఁడు నిర్వీర్యములుగఁ గావించెను. అయ్యెడఁగని విశ్వామిత్రుఁడు
బ్రాహ్మబలము దైవబలమునుగూడ తృణీకరింపఁగలదని గుర్తిం
చినవాఁడయ్యెను కాని, యాతని హృదయమును, వసిష్ఠునియెడ
నుదయమైన యీర్ష్యానలము ప్రజ్వలజ్వాలామండితమై యల
యించుచుండినకతన ప్రశాంతచేతస్కుఁడు కాఁజాలకుండెను.
ఆ కారణమున నాతఁడు గురుశాపదగ్ధుఁడై రాక్షసాకారమున
పరిభ్రమించుచున్న కాన్యకుబ్జదేశాధిపుఁడు కల్మాషపాదుని కడ

కేగి యాతని నుత్తేజితునిగఁ జేసి యాతనిచేత వశిష్ఠపుత్త్రులను నూఱుగురను మడియింపఁజేసెను. ఈఘోరకృత్యము నాలించి వశిష్ఠుఁడు పుత్త్రశోకానలతప్తచిత్తుఁ డయ్యెను. దుఃఖవిహ్వలుఁ డయ్యెను. కల్మాషపాదునిమూలముగ విశ్వామిత్త్రుఁడొనర్చిన ఘోరకృత్యమునకు ప్రతికృతియొనర్చుటకు కడుఁగడుసమర్థుఁడై యొప్పుచుండియును క్షమావతారుఁడు వశిష్ఠుఁడు, అట్లు సలుపక, తనభాగ్యమీవిధముగఁ బరిణమించినదిగదా యని పరితపింపఁజొచ్చెను. పుత్త్రశోకానలదందహ్యమానమానసుఁడు, వశిష్ఠుఁడధీరుఁడై ప్రాణపరిత్యాగోన్ముఖుఁడై పర్వతాగ్రమునుండి క్రిందకుఁబడియెను, గాని, యందువలన నాతఁడు ప్రాణములను విడుచుట లేదు సరియేగదా, క్షతశరీరుఁడును గూడఁ గాఁడయ్యెను. అనంతర మగ్నికుండములోని కుఱికెను. కుత్తుకకు బండలుకట్టుకొని సముద్రములోనికి దుమికెను. ప్రాణత్యాగమునకుఁ బలుయత్నము లొనరించెను; కాని మృత్యుముఖమును గననేరనివాఁడయ్యె. ఎన్ని పాట్లుపడినను, ఎన్ని యత్నములొనర్చినను మరణమొనఁగూడమికి మిక్కిలిగఁ జింతిలుచు, నిజాశ్రమమున కరుదెంచెను, గాని పుత్త్రశూన్యమగు నాయాశ్రమమును గనినంతనె శోకము ద్విగుణీకృతమగుడు, నందు నిలువనేరక మరల ప్రాణపరిత్యాగోద్యమమునందు ప్రవృత్తుఁడై బయలువెడలెను. కాలుసేతులను లతాపాశములతో బంధించుకొని తనశరీరమును వేగవంతముగఁ బ్రవహించునదీమధ్యమునఁ గూలఁద్రోచెను. అట్లు ప్రవాహమధ్యమునకు లోనైన బ్రహ్మర్షి ప్రాణహరణము బ్రహ్మహత్యాపాతకమునకు కారణమగునను వెఱపునుగొని యానది తనసునిశితలహరీలవిత్రములతో నాతనికాలుసేతులన మరియు లతాపాశబంధములను

క్షేపించి, యాతని సురక్షితునిగఁ జేసి తీరమునకుఁ జేర్చెను. అంత వశిష్ఠుఁ డావది తనపాశబంధములను విదళించినదగుకారణమున నద్దానికి 'విపాశ' యని పేరిడి యొండేని చనియెను. అనంతరము తిమింగిలములకు నిలయమగు మఱియొకనదీమధ్యమునఁ గూలఁబడియెను. ఆనది కూడ నాతని కపకృతి యొనరింపలేక పోవుటయే గాక, యాతని బ్రహ్మతేజమునకు నిలువఁజాలక శతధారలై యాతనివలన 'శతద్రు' వనునామమును బడసిన దయ్యెను. ఇట్లు మాటిమాటికిని ప్రాణపరిత్యాగప్రయత్నమున ప్రవృత్తుఁడై, సఫలతఁ బడయఁజాలక తుదకు హతాశుఁడై, ఉదాసచిత్తుఁడై నిజాశ్రమమునకు మరలవలసినవాఁడాయెను.

వశిష్ఠుఁడు ప్రాణపరిత్యాగోద్యమమునుండి విరమించి స్వాశ్రమమునకు మరలుచుండెను. ఆతనిఁ గని యాతని జ్యేష్ఠవధూరత్నము, అదృశ్యంతి సంతోషతరంగితాంతరంగయై యాతనివెనువెంట నడుచుచుండెను ఆసమయమున నామె యంతర్వత్నియై యొప్పుచుండెను. అట్లు అంతర్వత్నియైన యదృశ్యంతి వశిష్ఠుని వెనువగిలి చనుదెంచుచుండుసమయమున నాతనికి వేదశ్రుతి కర్ణగతము గాఁజొచ్చెను ఆవేదశ్రుతి యొందుండి యెవనివలన వినవచ్చుచుండెనో యెఱుఁగఁగోరి వెనుదిరిగి నలువైపులఁ బరికించిచూచి యెవరినిఁ గానక, నివ్వెఱఁగొని పుత్రవధువుఁ దిలకించి, "యీవిననగు వేదశ్రుతి యొందుండి యరుదెంచుచుండె"నని ప్రశ్నించెను. అందుల కామె, "యోపితా! నీపౌత్రుఁడొకఁడు నాగర్భమందు పండ్రెండుసంవత్సరములుగఁ బెరుగుచున్నవాఁడు ఆతఁడు చతుర్వేదములను, షట్శాస్త్రములను నభ్యసించినవాఁడు. గర్భస్థుఁడగు నర్భకునివలననే యీవేదశ్రుతి విననగుచుండెను" అని బదులొసంగెను. ఆపలుకుల

పాలించినంతనె వశిష్ఠమహర్షి తనవంశమునకు విచ్ఛేదము కలుగ లేదని సంతసిలుచు మరణేచ్ఛను హృదయమునుండి దూరగత మొనర్చి నిర్వికారముగ శేషజీవనమును నిర్వహణమొనరింప నిశ్చయించెను. అనంతరము మోహాసముద్రమును పారమొన రింప మనెంచి నిష్ఠురతపోనిరతుండై బ్రహ్మజ్ఞాన ఫలమందు కొనెను ఆతనికడ బ్రహ్మవిదునికడం జూపట్టవలయు లక్షణము లన్నియు సంపూర్ణముగ ప్రకటితములు గాందోపెంగెను. అంత మున నచ్యుతపదమును జూఱగొనియెను. ఆతండు వశిష్ఠ సంహిత యోగవాశిష్ఠరామాయణము లను గ్రంథములను రచి యించెను. ఆగ్రంథములు సర్వత్ర ఆదరదృష్టిం బరికింపంబడు చున్నవి.

వశిష్ఠుండు, ఇక్ష్వాకువంశీయరాజవర్యులకు పురోహితుం డుగనుండుచు ధర్మోపదేశమొనర్చుచుండుటయేగాక సమయా నుగుణముగ రాజనీతి సూక్ష్మతత్త్వమును బోధించుచు తద్రాజ వర్యులచే రాజ్యమభేద్యమై ధనధాన్యసమృద్ధిగని వర్ధిల్లుట కనువగుమార్గములను ప్రదర్శింపంజేయుచుండెను. ఆతండు శ్రీ రామచంద్రునకు జ్ఞానోపదేశకుండగుట కారణముగ నాతనికి గురువయ్యెను. దశరథరాముండు పితృవాక్యపరిపాలనాపర తంత్రుండై యరణ్యవాసమున కరిగినపుడు, భరతుని కొసంగిన యుపదేశము కాలానుగుణ్యముగ మహత్త్వపూరితమును,బహు మూల్యమును నుపాదేయమునునై విరాజిల్లుచుండెను. మార్గదర్శ కులును పరోపకారపారీణులును నగుమునివృషభులు పలువురు గలరు గాని, వారిలో వశిష్ఠునింబోలిన జితక్రోధులు క్షమా శీలురుం జూపట్టుట మిక్కిలి యరిది. విశ్వామిత్రుండు తనకుంజేసిన యపకృతికి ప్రతికృతిగ, బ్రహ్మర్షి వరిష్ఠుండౌ వశిష్ఠుండు, అవలంబిం

చినమహౌదార్యము లగునీతిక్షమామార్గములు ఆతనిమాహా త్మ్యప్రాశస్త్యమునకు ప్రధానద్యోతకములై రాజిలుచున్నయవి.

వశిష్ఠప్రశస్తములగు ప్రశంసాపత్రులఁ గ్రహియించుట గౌరవచిహ్నములని తత్కాలీనమహాత్ములు పరిగణించుచుండెడి వారు. ఆకారణముననే విశ్వామిత్రుఁడు, వసిష్ఠునియెడ క్రోధ వైరములఁబూని యాతనివలన నిర్బంధపూర్వకముగ 'బ్రహ్మర్షి పదవి' గ్రహియించుటకు భగీరథప్రయత్న మొనర్పుటయందు ప్రవృత్తుఁడయ్యెను. విశ్వామిత్రునిహృదయమున నంతస్సలిల యగు ఫల్గునఁబోలెనంతశ్శత్రువులు నిత్యవహమానములై యొప్పు చుండినంతవఱకు, సాటితపస్వులెందఱెన్నివిధములఁ నిరోధించిన సుచితవక్తయగువసిష్ఠుఁ డాతని 'రాజర్షి' యనియే సంబోధిం చెనుగాని, 'బ్రహ్మర్షి'యని యేయవస్థయందును సంబోధించిన వాఁడు కాఁడు.

ఒకప్పుడు విశ్వామిత్రుఁడు, వశిష్ఠునిఁ బొరిగొన మదినెంచి సునిశితకరవాలమును గేలఁగొని యొకనిశీథమం దాతని యాశ్రమగేహమునకరిగి, యాతఁడు మేలుకొనియున్నవాఁడో లేక నిద్రించుచున్నవాఁడో యనువిషయము నెఱుంగనెంచి, తద్వారసమీపమునఁ బొంచియుండెను. ఆసమయమున వశి ష్ఠుఁడు మేల్కొని సహధర్మిణి యరుంధతీదేవితోడి యిష్టాగోష్ఠులఁ బ్రొద్దుపుచ్చుచుండెను. అపుడు సందర్భానుసరణముగ, "ప్రాణ నాథా! నేటివెన్నెల యెంత యాహ్లాదకరముగ నొప్పుచున్న దియో, చూడుఁడు." అని యరుంధతి యనఁ, "అవును ప్రాణేశ్వరీ! యథార్థమును బలికితివి. నేటివెన్నెల మహాతపస్వి విశ్వామిత్రుని తపస్సుఁబోలె, నాహ్లాదకరమేగాదు, జగత్ప్రకాశమును, లోక

సోపానమునునై యలరారుచున్నయది.” అని వశిష్ఠుఁడు బదులొసంగెను. యుక్తియుక్తములగు నీయరుంధతీవశిష్ఠుల వాక్యోపవాక్యములు, ద్వారముఁగడ పొంచియుండిన విశ్వామిత్రుని వీనులయందుఁ జొరఁబడి యాతనిహృదయసీమను నాటుకొని పెరుఁగుచున్న క్రోధవిరోధములను సమూలముగ నాశనమొనరించి, తత్స్థానమందు క్షమాశాంతములను నెలకొల్పెను. అంత విశ్వామిత్రుఁడు ప్రశాంతచిత్తుఁడై వశిష్ఠసందర్శనమున కందు వేచియుండెను. అనంతర మొక్కింతతడవునకు వశిష్ఠుఁడాశ్రమగేహమునువీడి బయటికరుదేర విశ్వామిత్రుఁడాతనికి సాష్టాంగనమస్కృతుల నర్పించి, తానొనర్చిన యకృత్యములను క్షమింపుఁడని యాతని బహుభంగులఁ బ్రార్థించెను. ఉదారహృదయుఁడు వశిష్ఠుఁడాతనిదీనావస్థఁ గని దయార్ద్రహృదయుఁడై యాతని నాలింగనమొనర్చి పలువిధముల బహూకరించుచు “ఇపుడుకదా బ్రహ్మర్షిపదవిఁ గ్రహించుటకు పాత్రతఁ గడియించినవాఁడవైతివి” అని పలికెను. క్షమావతారుఁడని పేరొందినవశిష్ఠునిఁబోలిన మహర్షు లరుదుగఁ జూపట్టుదురనుటకు మనపురాణములు ప్రబలనిదర్శనములు. వశిష్ఠుఁడాదర్శచరితుఁడనుటకు సందియము లేదు.

3. వాల్మీకి మహర్షి.

పూర్వకాలమున రత్నాకరుఁడను పేరుగల బ్రాహ్మణుఁడొకఁ డుండెడువాఁడు. ఆతఁడు నామమునకు మాత్రము బ్రాహ్మణుఁడు. ఆతనికడ బ్రాహ్మణకృత్య మెద్దియును జూపట్టకుండెను. ఆతఁడు బాటసారులను దోచి ధనసంగ్రహణ మొనర్చి

తస్కాలముగ జీవయాత్ర సలుపుకొనుచుండెడివాఁడు. వాని దుర్వర్తనమును గని పితామహుఁడు బ్రహ్మయు, దేవర్షి నారదుఁడును చింతిలుచు వానియెడ జాలిగొని వాని నుద్ధరింప నెంచి వానికడకు రాఁజొచ్చిరి. అట్లు తనకడ కభిముఖముగ నరుదెంచుచున్న యమ్మహానీయుల నిరువురఁ జూచి, రత్నాకరుఁడు వారలను వధించి వారికడనుండుసొత్తు నపహరింప మది నెంచి కాలదండముంబోలిన దండము నొకదానిని జేకొని వారల కెదురేగఁజొచ్చెను. అట్లు ససంభ్రమముగ నగ్గరిలు చూడిన యాయుధము బ్రాహ్మణునిఁ జూచి కమలజుఁడు, సవాత్సల్యముగ "రత్నాకరా! జగత్పూజ్యమగు బ్రహ్మకులమున జన్మమును బడసినవాఁడవు అట్టి నీవు ఇట్టిఘృణితమును నీచమును నగు క్రూరకర్మమును ఎందులకాచరించుచున్నవాఁడవు? అటులాచరించుటకు నీమన సెటులొప్పెను? నీ వెవరిపోషణము నిమిత్తమిట్టి పాపకర్మ మాచరించుటకుఁ గడంగుచున్నవాఁడవో, వారు నీ యీపాపకర్మఫలానుభవమునందు భాగస్వాములగువారలగుదురని తలంచుచుంటివా ఏమి? అట్లున్నఁడును దలంపకుము. ఎవరిపాలనముకొఱకు కొంకుజంకులు లేక నరహత్యలఁ గావించుచున్నాఁడవో వారు అందువలన లభ్యమగుఫలమునందు భాగస్థులు కానేరరు. నీ కలవడుపాపఫలమును నీవే యనుభవింపవలయును నీవొనర్చుపాపములకు ప్రతిఫలముగ పరలోకమందు ఎంతటి ఘోరకష్టముల ననుభవింపవలసియుండునో ఆవిషయమును గూర్చి యెన్నఁడైన నించుక విచారణ మొనర్చి చూచియున్నవాఁడవా; లేదు. చూచియుండినయెడల పాపభీతుఁడవై యుందువు. అది యటుల నుండనిమ్ము. నీవలన పోషింపఁబడువారు నీయొనర్చుకర్మలకు

లభ్యమగుఫలమును పంచుకొనెదరేమో? యడిగిరమ్ము" అని యాతనితో మందలించెను బ్రహ్మపలికినపలుకులు వీనులసోఁకినంతనే రత్నాకరుఁడు చకితుఁడయ్యెను పాపభీతుఁడై యోజనాంబుధినోలలాడుచు 'ఎవరిపోషణముకొఱకు పాపకర్మముల నాచరించుచున్నాఁడనో, వారు తత్ఫలానుభవమున నేల భాగస్వాములుకారు' అనితనలోఁ దాననుకొనుచు తల్లిదండ్రులకడ కరిగి, "జననీజనకులారా! మీభరణపోషణమునకునై నే నొనర్చుకర్మలకు లభ్యమగుఫలము నాకొక్కనికే చెందునా? లేక, ఆఫలమునందు మీరుకూడ పాలుఁగొందురా? ఆసంగతిని వివరించి చెప్పుఁ"డని వారిని యడిగెను. అందుల కాతనితల్లిదండ్రులు, "వత్సా! నీయొనర్చుకర్మమునకు లభ్యమగుఫలము మంచిదైనను చెడ్డదైనను, అయ్యది నిన్నే పొందును మమ్మెంతమాత్రమును బొందనేరదు. ఆఫలమును నీవే యనుభవింపవలయును మే మెవరము ననుభవించువారము కాఁజాలము. జీవులెట్లు ఒక్కరొక్కరుగ జన్మమును గ్రహించుచున్నవారలో, యెట్లు ఒక్కరొక్కరుగ మరణమును బొందుచున్నవారలో అట్లనే వారువారొనర్చు సుకృతదుష్కృతములకు లభ్యములగుసుఫలదుష్ఫలములను వారువారొక్కరొక్కరుగనే యనుభవించువారలగుదురు తదన్యు లనుభవించువారలు గారు. నీవు బాలుఁడవై జీవననిర్వాహణమున కసమర్థుఁడవైయున్ననాఁడు నిన్ను పోషించితిమి. అయ్యది, అటులపోషించుట, మాకు కర్తవ్యము మాకుధర్మము మాకర్తవ్యధర్మమును మేమునిర్వహించుకొంటిమి. ఇపుడు నీవు పెద్దవాఁడవైతివి. ప్రాజ్ఞుఁడవైతివి. జీవననిర్వాహణమునకు సమర్థుఁడవైతివి. మేమన్ననో వృద్ధులమైతిమి. అసమర్థులమైతిమి. మమ్ముఁబోషించుట నీకుకర్తవ్యము. నీకుధర్మ

ము. మమ్ముఁ బోషించుచు, కర్తవ్యముఁ బరిపాలించుచు పిత్రూణ మునుండి విముక్తుఁడవగుచున్నాఁడవు. ఇంతలో కింతవిచారణ మేటికి? అనవసరము కాని, చౌర్యమారణాదులగల దుష్కర్మముల నాచరించి కొల్లపాపఫలమునకు పాత్రుఁడవగుచున్నాఁడవో, ఆట్టిపాపఫలమును నీవొక్కఁడవే యనుభవింపవలసినవాఁడ వనిమాత్రము గ్రహియింపుము. గ్రహియించి తదాచరణము నకుఁ గడంగుము" అని యేకగ్రీవముగ బదులొసంగిరి. తల్లిదండ్రు లొసంగిన ప్రత్యుత్తరమును బడసి రత్నాకరుఁడు నివ్వెఱఁగొని వారికడనుండి వెడలి సహధర్మిణికడ కరుదెంచి, "ప్రాణేశ్వరీ నే నొనర్చు కర్మములకు సంప్రాప్తమగుఫలమును నేనొక్కఁడనే యనుభవింపవలయునా? లేక, నీవు, అర్ధాంగినిఁ గనుక నర్ధభాగ మును గ్రహియించుదానవగుదువా? ఆలోచించి చెప్పుము." అని యాపె నడిగెను. అందులకాపె "ప్రాణనాథా! మీరొనర్చు దుష్కృతముఫలమును మీరొక్కరే యనుభవింపవలయును. నేనందలి యంశమును అనుభవించుదానను గాను. వివాహకాల మున ధర్మశపథమూని నన్ను భార్యగ గ్రహియించితిరి, గావున మీరొనర్చు సుకృతముఫలమునం దర్ధభాగము అర్ధాంగినిని గనుక నాకుఁ జెందఁగలదు. పతిపత్నులిరువురలో పతి పత్నిని భరించు (పోషించు) వాఁడు గావున భర్త యనియును, పత్ని పతివలన భరింపఁ (పోషింపఁ) బడునది గావున భార్య యనియును బిలువఁబడుచున్నవారు. మీరు నాకు భర్తలు నేను మీకు భార్యను. నన్ను పోషించుబాధ్యత మీయందుంచుక నన్నే విధముగనైనఁ బోషింపవలయును. అట్లని నాపోషణముకొఱకు పాపకర్మమొనర్చుఁడని మిమ్ముల నేనెన్నఁడును బురికొల్పిన దానను గాను. మీ యిష్టము చొప్పున మీరొనర్చు పాపకర్మము

వను ప్రాప్తమగు ఫలమునందు నేనెటుల భాగమును గొనుదాన నగుదును?" అని ప్రత్యుత్తరమొసఁగెను. జనకుఁడును, జననియును, పత్నియును నొసంగిన ప్రత్యుత్తరములు చెవిసోఁకినంతనె రత్నాకరునిహృదయమున పాపభీతి జనియించెను. వైరాగ్య ముదయమయ్యెను. అంత నాతఁడు బ్రహ్మనారదులున్నయెడకు పరుగుపరుగున జనుదెంచి వారిపదవనజములపై వ్రాలెను. పాపవిమోచనమున కుపాయముపదేశింపుఁడని కాతరుఁడై పదేపదే ప్రార్థింపఁజొచ్చెను. వానిపశ్చాత్తాపమును, వానిదైన్యమును, వానియధైర్యమును గని పద్మజుఁడు దయాళుఁడై వానికిధైర్యముగఱపి, రామమంత్రముపదేశించి, 'వత్సా! ఈమంత్రరాజమును అనన్యచిత్తుఁడవై యనన్యభక్తుఁడవై నిరంతరమును జపయించుచుండుము. సూర్యతేజము తమోరాశిని రూపుమాపువిధమున, ఈమంత్రరాజము నీపాపసంచయమును రూపుమాపు. ఇఁక పాపచింతనమును వీడి తదేకధ్యానమున రామమంత్రజపమున కుద్యుక్తుఁడవుగమ్ము' అని బోధించెను. అంత రత్నాకరుఁడు రామనామమును జపియించుటయందు మనసుఁజొనిపి, స్థిరాసనుఁడై, గురూపదిష్టప్రకారమున మంత్రజపమున కుద్యుక్తుఁడై పలువిధముల ప్రయత్నమొనరించెను. కాని, వానిపాపము బలవత్తరమైయున్నందున వానినోటినుండి రామనామము వెలువడినది కాదయ్యె. అందువలన కమలజుఁడు రామశబ్దమును వర్ణవ్యత్యయమొనరించి 'మరా' యని జపియింపుమని వానికి బోధించెను అనంతరము రత్నాకరుఁడు, కమలజుఁడు బోధించినట్లు మరా, మరా యని జపింపఁజొచ్చెను. సద్గురుగణము శిష్యకోటికొసంగు కుండలినీప్రబోధన సమర్థమగుశక్తిప్రదానమే ప్రకృతమంత్ర

ము. అదియే సిద్ధమంత్రము. ఆమంత్రజపమే కుండలినీప్రబోధమునకు ప్రధానసాధనము. అతిరసంయుతమగుశబ్దము మంత్రముకాదు. అద్దానికిఁ గుండలిని బోధించుశక్తి లేదు సద్గురుప్రబోధమువలన బోధితమైనమంత్రమునందు మంత్రమూర్తియగుభగవంతుఁడు, అద్వైతభావమున నిరంతరము వర్తమానుఁడై విరాజిల్లుచుండును. సద్గురూపదిష్టమైన మంత్ర(నామ) మెట్టిదైననేమి తత్సాధకులకు, తన్మంత్రమును జపియించువారలకు తప్పక ముక్తి యలవడుననుటకు సంశయమావంతయును లేదు. సద్గురుఁడు కమలజుఁ డుపదేశించిన 'మర' మంత్రమును రత్నాకరుఁడు తదేకచిత్తమున జపియించుచు, కొలఁది దినములకు బాహ్యజ్ఞానశూన్యుఁ డయ్యెను. అతఁడు 'మరా' మంత్రజపమునందు ఎన్నిసంవత్సరములు కడచెనో గుర్తిడ నేరనంతటి తన్మయత్వమును బొందినవాఁడయ్యెను. కాలాంతరమున శ్రీరామచంద్రునిదర్శనమును బడసినవాఁడయ్యెను. శ్రీరామచంద్రదర్శనానంతరము దృఢసమాధియందు లీనుఁడయ్యెను. అతఁడు సమాధియందున్నకాలమున నాతనిశరీరముపై చెదపురుగులు పుట్టలుపెట్టెను. అద్దాని నాతఁడు గుర్తిడ నేరకయుండెను. అంత చతురాననుఁడు, రత్నాకరుఁడున్నయెడ కరుదెంచి నలుదెసలఁ బాహ్యదృష్టిఁ బరికించిచూచి యాతనిఁ బొడఁగానకపోయెను. అనంతరము దివ్యదృష్టి నవలోకించి, శరీరముపై చెదపురుగులు, వల్మీకములు (పుట్టలు) పెట్టినను గ్రహియింపనేరనంతటి తన్మయత్వమున దృఢసమాధియందున్న వానిని రత్నాకరుని జూచి, యాతనిశరీరమును నలముకొనియున్న వల్మీకమును విదళించి యాతనిని సమాధిప్రబోధితునిఁ గావించెను. ఇట్లు సమాధ్యుద్బోధకుఁడైన రత్నాకరుఁడు,

కట్టెదుర నిలిచియున్న పరమారాధ్యుని, గురువర్యుని, బ్రహ్మను గని సభక్తికముగ సాష్టాంగనమస్కృతుల నర్పించి పరితృప్తునిం గావించెను. వాని భక్తివినయముల కలరి బ్రహ్మ వానికాశీస్సుల నొసంగుచు, "వత్సా ! నీసాధకము సఫలమైనది. నీపాపము నశించినది. నీజన్మము సార్థకమైనది. నీవు దేవదుర్లభమగు ఋషిత్వమును బడసి జీవన్ముక్తుండవైతివి. వల్మీకస్థూపమునందుండి నూతనజన్మమును గ్రహించినవాఁడవుగావున నింతటనుండి వాల్మీకి యనునామమునం బ్రఖ్యాతుండ వగుదువు" అని పలికి యంతర్హితుండయ్యెను.

మహర్షిపదవిఁబడసిన యనంతరము వాల్మీకి తమసానదీ తీరస్థమగు విధూపనామకస్థానమం దాశ్రమమేర్పఱచుకొని యందు నివసింపఁజొచ్చెను అనతికాలమున దేవర్షి నారదుఁడా తపోవనమున కరుదెంచెను. అట్లరుదెంచిన నారదుని వాల్మీకి యథావిధిఁ బూజించి యనంతరము, "ద్విజోత్తమా ! ఋషిసత్తమా! మూఁడులోకములయందెందైన మీరుచూచినవారిలో గుణవంతుఁడు, విద్యావంతుఁడు, సత్యవ్రతుఁడు, దృఢవ్రతుఁడు, ప్రియవచనుఁడు, ధర్మపరాయణుఁడు, దయార్ద్రహృదయుఁడు, మహాపరాక్రమవంతుఁడు నగుమహనీయుఁ డొక్కఁడైనఁగలఁడా? కలఁడేని వానినామమును వివరింపుఁడు. వాని గుణములు గీర్తింపుఁడు వినుట కుత్సుకుఁడనై యున్నాఁడను" అని యాతనిఁ బ్రార్థించెను. వాల్మీకిప్రార్థన నాలించి నారదుఁడు, "అట్టిమనుజుఁడు జగత్తునందు దుర్లభుఁడు. అయినను, అయోధ్యాధిపతియగు శ్రీరామచంద్రునియందు నీవడిగిన గుణములన్నియును గలవు" అనిపలుకుచు రామచంద్రునిపవిత్ర చరిత్రమును వాల్మీకికి సంక్షేపముగ నెఱిగించి యెందేని చని

మెను. వాల్మీకి నారదుఁడు వినిపించిన రామచరితమును మనన మొనరించుచు తమసానదికి స్నానమున కరిగెను. అతఁ డా సమయమున ప్రఫుల్లహృదయమున క్రీడానిమగ్నమై యొప్పి యున్న క్రౌంచమిథునములోని పురుషపక్షిని నిర్దయుఁడు వ్యాధుఁ డొకఁడు కూలనేయు, నది పుడమిఁగూలి విలవిలఁ దన్నుకొనుచు నెత్తురుఁ బొరలుచున్న దానిని, అట్లుగిట్టిన దానిఁ జూచి, కలిగి యొంగ జనిత శోకానల జ్వాలామాలాసంతప్తచిత్తయై యయ్యె వినయముగఁ గూయిడుచున్న యాఁడుపక్షినిఁ జూచి కరుణార్ద్రహృదయుఁడై, నిషా దుని కట్ల మొగమై "మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీస్సమాః, యత్క్రౌంచమిథునాదేక మవధీః కామమో హితమ్" "ఓ! నిషాదా! కామమోహమున నొడలెఱుఁగక క్రీడించు క్రౌంచమిథునములోని యొకదానిని నీవు నిమితి; కావున నశాశ్వతమగు ప్రతిష్ఠఁగనువాఁడవగుదువప్ప అనఁగా, దీర్ఘకాల ములో నశించువాఁడవగుదువుగాక!" యని పలికి వెంటనే, "ఈక్రౌంచిఁ జూచినంతనే పొడమిన శోకము నన్నుఁ బీడింపఁగా నోపలేక, యిదియేమి యిట్టులం జెప్పితిని" అనిచింతిల్లుచు తనయాశ్రమమునకుమరలి విధ్యుక్తకర్మాచరణమునందు మనసుఁ జొరఁజేసెను; కాని తనముఖమునందుండి యకస్మాత్తుగా నా లుగుపాదములనొప్పి ప్రతిపాదమందును సమానాక్షరసంఖ్యఁ గలిగి శ్లోకరూపమున వెలువడిన యాశాపవాక్యమునుగూర్చిన విచార మాతనిహృదయమును పీడించుచునే యుండెను. అంతఁ జతురాననుం డాతని హృదయపీడనమును బాపనెంచి యాతని కడ కరుదెంచెను. అట్లరుదెంచిన బ్రహ్మను భక్తికముగ నర్చించి, ముకుళితకరకమలుఁడై ఖిన్నవదనుఁడై యాతని కట్టెదుర నిలువఁబడియెను. అట్లు నిలిచిన కారణమేటిదని ప్రశ్నిం

కర్త యాతనిం బ్రశ్నించెను. అందులకు, బోయఁడొకఁడు మదులు మెల్లన నొప్పచున్న క్రౌంచమిథునములోని మగపక్షిను ఆ కారణముగాఁ గూలనేయ, పోతుపిట్టకై మిక్కిలి మొరపెల్లుచుఁ గవఁ బాసిపోగులు మన్న యాఁడుపిట్టఁ జూచినంతన పొడమినజాలి పెంపున తపంబుపసఁజెలుప నకస్మాత్తుగా తనవోటినుండి శ్లోక రూపమగు శాపవాక్యమొండు వెలువడియె ననిపలుకుచు, నా వాక్యమును వినిచి, యీవాక్యము వెడలుటకు కారణమేటిదో గ్రహింపనేరనిచింతఁ దురపిల్లుచున్నాఁడను. నాచింతఁబాపి నన్నుఁ గరుణింపుఁడని ప్రార్థించెను. వాల్మీకిప్రార్థనమాలించి, పద్మజుఁడు, "నానియోగమున సరస్వతి తనజిహ్వాగ్రముననిలిచి యీ వాక్యమును వెలువరించినదని యెఱుఁగకగదా యిట్లు చింతిల్లుచున్నవాఁడవు" అని తనలోఁ దాను నవ్వుకొనుచు, "ఋషివరా! నీవు విధిప్రేరణమున, ఛందోబద్ధమైనశ్లోకమును రచియించితివి. ఈశ్లోకమును అనుష్టుప్ అనియందురు. ఇదిశాపరూపమైనది కాదు. మంగళప్రదమైనది. దీనినిగూర్చి విచారింపకుము మంగళావతరణమగు నీశ్లోకమును నాందిగాఁగొని యిట్టిశ్లోకములతో శ్రీరామ చరితమును ప్రబంధరూపముగా రచియింపుము. రామచరితమునుగూర్చి దేవర్షి వలన వినియున్నవిషయముగాక, ఆతఁడెఱిగింపని, రామకథసంబంధమైన రహస్యప్రకాశములైన విషయములన్నియును నీకు తేటతెల్లములగు. ఇకావ్యరచనమునకు నీవసర్వసమర్థుఁడవు. నీవురచియించు నికావ్యము దుష్టమును, అనృతమును గాక, మనోహరంబై, సకలపాపహరంబై, పుణ్యప్రదంబై, ఆచంద్రార్కము, లోకప్రచారమునుగలదై యొప్పునది కాఁగలదు. నీరచియించిన రామాయణము ప్రచారమున నుండునంతకాలము ఎల్లలోకములయందు అప్రతిహతగతిని

చరించుచుండి యనంతరము నాలోకమును బొంది, నాతోఁగూడ ముక్తిఁజెందువాఁడవగుదువు." అని యానతిచ్చి యచ్చటనే యంతర్హితుఁడయ్యె. అనంతరము మంగళార్థము మనంబున పరమాత్మను ధ్యానించి రామాయణమును రచియింప నుపక్రమించెను. వాల్మీకివిరచితమగు రామాయణము 'వాల్మీకిరామాయణ'మని పేరొందినది.

రావణవధానంతరము శ్రీరామచంద్రుఁడు పట్టాభిషిక్తుఁడై రాజ్యపాలన మొనర్చుచుఁ బ్రజారంజనమును బడయ నెంచి, నిరపరాధినియు గర్భవతియునగు సతీతిలకమును జనకనందినజానకిని త్యజించి, యామెను అరణ్యములో విడిచిరమ్మని లక్ష్మణుని కాజ్ఞయిచ్చెను. రామాజ్ఞ చొప్పున లక్ష్మణుఁడు జానకిని గొనిపోయి యరణ్యమునందు విడిచి తానయోధ్యకు చనుచెంచెను. అట్లు పతిపరిత్యక్తయై నిస్సహాయముగ నరణ్యములో విలపించుచున్న జానకిని వాల్మీకి తనయాశ్రమమునకుఁ గొనిచని కన్నకూఁతుఁబోలెఁ బాలింపఁజొచ్చెను. మునిపాలితయగు జానకి యథాసమయమున లవకుశులనుపుత్రుల నిరువురఁ బ్రసవించెను. ఆబాలకులిరువురును సమయానుగుణముగఁ బెరిగి పెద్దవారలైరి. వారలకు వాల్మీకి క్షత్రియోచితముగ సంస్కార మొనరించి విద్యాప్రదాన మొసంగెను. వారలు మహర్షి ప్రసాదమునకుఁ బాత్రులై, సకలవిద్యావిశారదులును, ధనుర్వేదపారగులును, వీరులును, పరాక్రమోపేతులును నై విరాజిలఁజొచ్చిరి. వారలకు వాల్మీకి తావిరచించిన రామాయణమును కంఠస్థమొనరింప, వారలు లోకమనోమోహనస్వరముతో రామచరితమును గాన మొనరింపఁదొడంగిరి. ఆసమయమున శ్రీరామచంద్రుఁడు అశ్వమేధయాగమును సలుప నారంభించెను. ఆయాగమునకు వాల్మీకి

నిమంత్రితుఁడై లవకుశులఁదోడ్కొని అయోధ్యాపురికరిగెను. యజ్ఞస్థానమునకరుదెంచినప్పటి నాయన్నదమ్ము లిరువురును తమ కోకిలకంఠములతో వాల్మీకివిరచిత రామాయణమును గానము చేయుచు నందందు తిరుగాడఁజొచ్చిరి. వారిగానప్రశంసనము నగరమంతటను వ్యాప్తమై క్రమక్రమముగ శ్రీరామ చంద్రునికర్ణపుటముల నలంకరించెను అంత రాముఁడు ముదిత హృదయుఁడై వారలను రాజసభకు రావించెను రాజసభనలం కరించిన లవకుశుల నిరువురఁజూచినంతనె వారియెడ రామమా తకు కౌసల్యకు ప్రేమవాత్సల్యము లుదయమయ్యెను జానకి బ్రతికి పుత్రుని బ్రసవించియుండినచో, నాపుత్త్రుఁడును వీరియం తవాఁడయి యుండునుగదా యని విచారింపఁజొచ్చెను. వారి గానవిద్యానైపుణ్యమును విలకించి సంతసిలుచు, రాముఁడా బాలురతల్లిదండ్రు లెవరని వాల్మీకిఁ బ్రశ్నింప, నాతఁడు జానకీరామ చంద్రులని బదులొసంగెను మహర్షిపలుకుల నాలించినంతనె, రామునకును, రామపరివారమునకును గలిగినహర్షానందములు మేరమీఱినవయ్యెను. ప్రకృతపరిచయమును బడసి లవకుశు లును ప్రసన్నహృదయులైరి అనంతరము వాల్మీకి లవకుశులను జానకిని శ్రీరామచంద్రునివశ మొనర్చి తాను తనతపోవనంబు నకు మరలఁ జనియెను.

4. విశ్వామిత్రమహర్షి.

కాన్యకుబ్జాధిపతి గాధిరాజునకు కొడుకులు లేరు. ఆత నికి సత్యవతియను నొక్కకూఁతురుగలదు. ఆతఁ డాకూఁతును ఋచీకమహాముని కొసంగి పరిణయమొనరించెను. సత్యవతి పతి

వ్రత. ధర్మపరాయణ. పత్యనురాగమున నతిశయముగఁ బడ
సినయది. ఆమెయొకానొకదినమున పతి చెంతఁజేరి, స్త్రీడావనత
వదనయై, 'ప్రాణనాథా! పుత్రప్రాప్తిఁబడయ నామనము వ్విళ్లూరు
చున్నయది. కాఁబట్టి, యనుగ్రహించి ధార్మికపుత్రునిఁ బడయ
నగునుపాయమును బరికింపుఁడు. నాకే కాదు. పుత్రసంతతిలేక
పరితపించుచున్న నాతల్లిదండ్రులకుఁగూడ నొకపుత్రుని యను
గ్రహింపుఁడు' అని సభక్తికముగఁ బ్రార్థించెను. సతిప్రార్థన
నాలించి, ఋచీకుఁడు సంతుష్టాంతరంగుఁడై రెండు దివ్యచరు
వులను సిద్ధముచేసి, యందొకదానిని బ్రహ్మతేజముచేతను,
వేఱొకదానిని క్షాత్రతేజముచేతను బూరించి, భార్యఁజేరి, చరు
పాత్రములనొసఁగుచు, 'నీపాత్రమందు బ్రహ్మతేజమును, నీపాత్ర
మందు క్షాత్రతేజమును సన్నివేశితములై యున్నయవి బ్రహ్మ
తేజసన్నివేశితమైన చరువును నీవు భుజియింపుము. క్షాత్రతేజ
స్సన్నివేశితమైనచరువును నీజనని భుజింపఁజేయుము. దాన మీ
రుభయులును పుత్రలాభమును బడయువారలగుదు'రని చెప్పి
యామెను బనిచెను. సత్యవతియు, యాచరుపాత్రలరెండింటిని
భక్తిపూర్వకముగ గ్రహియించి, యవ్వానిని జననికడకుఁగొనిచని,
తద్వివరణమెరిగించుచు తత్పాత్రల నామెచేతి కొసంగెను. అంత
సత్యవతిజనని, ఋచీకుఁడు సత్యవతికి తనభార్యకు అత్యుత్తమ
మైన చరువునవశ్యము నిర్మించియుండునని మదినెంచి, చరు
పాత్రలనుపరివర్తనమొనర్చి, క్షాత్రతేజస్సమన్వితమగు చరువును
కూఁతు భుజింపఁజేసి, బ్రహ్మతేజసమన్వితమగు దానిఁ దానుభుజిం
చెను. ఈపరివర్తనము ఋచీకున కవగతమగుడు, ఆతఁడు
భార్యఁ జేరి, 'కళ్యాణీ! నీజనని చరుపాత్రలను పరివర్తనమొన
రించెను. అయ్యది యుచితమైనది గాదయ్యె. ఆపరివర్తనము

కారణముగ నీకుదయించుపుత్త్రుఁడు క్షాత్త్ర తేజస్సమన్వితుఁ డగు వాఁడును, నీజననికి జనియించుపుత్త్రుఁడు బ్రహ్మతేజస్సమన్వితుఁ డగు వాఁడునునగుదురు.' అని వివరించి చెప్పెను. అంత సత్యవతి కడుదుఃఖితయై, 'ప్రాణనాథా! నాపుత్త్రుఁడు క్షాత్త్రవంతుఁడు గావలదు. కాకతప్ప దేని నాపౌత్త్రుఁడగుఁగాత! అట్లనుగ్రహింపుఁ' డని పరిపరివిధముల భర్త్రను బ్రార్థింప, నాతఁ డలరుచు, నామె ప్రార్థనమంగీకరించి, "తథాస్తు" అని పలుకుచు నామెనూఱడించి పనిచెను. అనంతరము యథాసమయమున చరుగుణము ప్రకటితమయ్యెను. సత్యవతికి జమదగ్నియు, నామెజననికి విశ్వామిత్త్రుఁడును జనియించిరి. విశ్వామిత్త్రుఁడు శుక్లపక్షచంద్రునివలె దినదినాభివృద్ధిఁగనుచు కాలానుగుణముగ యథోచిత సంస్కారములఁ బడసి సకలవిద్యావిశారదుఁడును, ధనుర్వేద పారంగతుఁడును, సకలగుణసమన్వితుఁడును, పితృసింహాసన విరాజమానుండును నై ప్రజలను నిజప్రజలఁబోలెఁ బాలింపఁ జొచ్చెను.

విశ్వామిత్త్రుఁడు పితృసింహాసనారూఢుఁడై నయనంతర మొకనాఁడు మృగయావినోదియై యరణ్యమున కేగి యందందుఁ దిరుగాడుచు దైవికముగ వశిష్ఠతపోవనమున కరుదెంచెను. ఆతపోవనము శాంతభూయిష్ఠము. మనోహరము. సర్వగుణ సంపన్నము. సత్యలోకసదృశము. అట్టితపోవనముఁజూచి విశ్వామిత్త్రుఁడు ప్రహర్షచిత్తుఁడై వశిష్ఠసాక్షాత్కారమును బడయ నెంచి యాతనికడ కరిగి యాతనికి సాష్టాంగనమస్కృతుల నర్పించెను. వశిష్ఠుఁడును, విశ్వామిత్త్రుని సాదరపూర్వకముగ సత్కరించి, కూర్చుండఁజేసి, కుశలమారసి, 'గాధినందనా! నీవు నాకతిథి వైతివి. నాయొసంగు నాతిథ్యమును పరివారయుత

ముగ స్వీకరించి నేఁడిందు విశ్రామముఁగొనుము. ఇదినాకోరిక.' యని యతనితోఁబలికెను. విశ్వామిత్రుఁ డందుల కంగీకరించెను. అనంతరము, వసిష్ఠుఁడు, చిత్రవర్ణయు, లోకోత్తరగుణసంపన్నయు, నందినీనామ్నియు నగుతనహోమధేనువును రావించి, 'భద్రా! నేఁడు రాజును, రాజపరివారమును మనయాశ్రమమునకరుదెంచి మనకతిథులైనవారలు. వారలను యథోచితసత్కారముల సత్కరించి సంతుష్టులఁజేయుము. పొమ్ము.' అని యద్దాని కాదేశించెను. వసిష్ఠాదేశమును బడయుటతడవుగ నాసామాన్యశక్తిశాలిని నందిని, తనశరీరమునుండి షడ్రసయుక్తమగు పదార్థసంచయమును నుత్పన్నముగావించి, తత్కాలమున విశ్వామిత్రుని యాతనిపరివారమును పరితృప్తిఁబొందించెను. అంతవిశ్వామిత్రుఁడు కడు ప్రసన్నుఁడయ్యెను. అపూర్వశక్తిసంపన్న యగు నందినియెడ లోభచిత్తుఁడయ్యెను. అద్దానిఁ బడయనెంచి, వసిష్ఠుఁ జేరి 'బ్రహ్మర్షివర్యా! యీయలోకసామాన్య యగునందినియెడ నాకనురాగము మిక్కిలియయ్యెను. దానికిఁ బ్రతిగ లక్షగోవుల నొసంగెదను. వాని గ్రహించి నాకీనందిని నొసంగుఁ'డని పరిపరివిధములఁ బ్రార్థించెను. నందిని నెడబాయుటవలన వసిష్ఠునకు కష్టము ఉత్కటమగు. ఆకారణమున నాతఁడు, 'రాజా' నాయొనర్చుయజ్ఞాది సమస్తధర్మకర్మములు నందినియధీనములు. నందినివినా యవిసాగవు. అందువలన త్రైలోక్యాధిపత్యము సంప్రాప్తమైనను నందిని నొసంగఁగలవాఁడను గాను. అద్దాని నెడఁబాయఁజాలువాఁడను గాను' అని విశ్వామిత్రునకు బదులొసంగెను. అంత విశ్వామిత్రుఁడు, వసిష్ఠుండు సామమునసందినినొసంగువాఁడు కాఁడని నిశ్చయించి, అద్దానిఁ బలాత్కారముగఁ గొని రాజధాని కరుగుఁడని తన

సైనికుల కాజ్ఞనొసంగెను. తదాజ్ఞానుసరణముగ సైనికు లెన్ని చేష్ట లొనరించినను, ఎన్నిప్రయత్నములు చేసినను, వశిష్ఠుని హోమధేనువు ముందున కొక్క-యడుగైనను పెట్టినదికాదు. అందువలన సైనికులు విసిగివిసిగి యద్దానిఁ బ్రహరింపఁజొచ్చిరి. దాన నయ్యది క్షతవిద్ధశరీరయై, దుఃఖాశ్రువుల వెలువరించుచు, దైన్యముఁ బ్రకటించుచు,వశిష్ఠుముఖమును బరికింపఁదొడంగెను. నందినికలవడిన దుర్దశఁగని శోకాకులచిత్తుఁడై, గద్గదకంఠుఁడై, "నేనుక్షమాశీలుఁడను తపస్విని ఈదుష్టక్షత్రియుని దుర్వర్తనమునకు సహనమును జూపవలసినవాఁడను. ఈతనికడ నపారసైన్యబల ముపస్థితమైయున్నది. అద్దానిని నాశనమొనరించునట్టి తపోబలమునాకడనొప్పియున్నయది. కానియద్దానినవసరముగ వ్యయమొనరించుటకు నామనస్సొప్పకున్నయది. కాఁబట్టినీసామర్థ్యమును బ్రకటించి యీక్షత్రియునిగర్వమును ఖర్వమొనరింపుము.' అని వశిష్ఠుఁడునుడివెను. అంతనందిని తనశరీరమునుండి యపారసైన్యమును నుత్పన్నమొనరించి యద్దానిని విశ్వామిత్రసైన్యముఁ దలపడ నియోగించెను. అయ్యది సత్వరమున నరిగి విశ్వామిత్రునిసైనికులనేగాదు ఆతనిపుత్రులఁగూడ నాశనమొనరించెను. అంతట గాధినందనుఁడు హతదర్పితుఁడై, నిజరాజధానికి మరలినవాఁడయ్యెను వశిష్ఠునివలన సంప్రాప్తమైన పరాభవ మాతనిహృదయమును వేధించుచుండినకతమున నాతఁడచిరకాలమున రాజ్యపరిత్యాగియై హిమవత్పర్వతప్రాంతమందు క్రూరమృగసంకులమగు నొకానొకయరణ్యమందు, వశిష్ఠనాశనాభిలాషి యై యీశ్వరుఁగూర్చి ఘోరతపముసలుప నారంభించెను. ఆతఁడొనర్చుతపంబునకు దేవదేవుఁడు, మహాదేవుఁడు ప్రసన్నుఁడై యాతనికిపలువిధము లగుదివ్యాస్త్రముల

నొసంగి కృతకృత్యుని గావించెను. ఈశ్వర ప్రసాదమునుబడసి మహోత్సుకుఁడై తపోవనమును వీడిచనుదెంచి వశిష్ఠునియాక్రమించి, కాఁబడసిన దివ్యాస్త్రముల నాతనిపైఁ బ్రయోగించెను. వశిష్ఠమహర్షి యాయస్త్రముల నన్నిఁటిని తనయోగదండమున వ్యర్థములుగఁ గావించెను. విశ్వామిత్రుఁడు తాను వశిష్ఠునిపైఁ బ్రయోగించిన అస్త్రము లాతనిశరీరమును స్పృశించుటకైన సమర్థములుగాక వమ్ములగుటఁ జూచి, క్షుభితుఁడై, క్షాత్రబలమును ధిక్కరించుచు, బ్రహ్మతేజఃప్రభావమును బ్రశంసించుచు బ్రాహ్మణత్వమును బడయనెంచి ఘోరతపమొనర్చుటకు కృతనిశ్చయుఁ డయ్యెను పత్నీయుతముగ దక్షిణాపథమున కరిగి యందొకరమణీయస్థానమున నాశ్రమమును నిర్మించుకొనెను. ఆయాశ్రమమునం దాతనికి హవిష్పందుఁడు, మధుష్పందుఁడు, దృఢనేత్రుఁడు, మహారథుఁడు ననునలువురు పుత్త్రు లుదయించిరి

ఆకాలమున నయోధ్యానగరమును కల్మాషపాదుఁడనురాజు పాలించుచుండెను. అతఁ డొకానొకదినమున వేఁటతమకమున నరణ్యమునఁబరిభ్రమించుచుఁబిపాసాకులుఁడై జలాన్వేషణాతత్పరత్వమున నొకయిఱుకటపుమార్గమునఁ జనుచుండెను. ఆమార్గమున నెదురుమనిషి తప్పుకొనుటకు తావు లేదు. ఆసమయమున నాతనికెదురుగ వశిష్ఠపుత్త్రుఁడు విపులతపోధనసంపన్నుఁడు, ధర్మతత్పరుఁడు శక్తినామకుఁడు చనుదెంచుచుండెను. అల్లెదురుగఁ జనుదెంచుచున్న శక్తిని మార్గమునువిడుమమని కల్మాషపాదుఁడునిర్బంధించెను. శక్తి తన్నట్లునిర్బంధించు రాజుఁజూచి, 'రాజా! రాజులు బ్రాహ్మణులకు తెరువిడవలయునను సనాతననియమ మొండు గలదు. కాఁబట్టి తన్నియమాను

శరణముగ నీవే నాకు మార్గమిడవలయు'నని బదులు పల్కెను. శక్తి తనమాటను మన్నింపమికి రాజు క్రుద్ధుఁడై యాతనిఁ బదాఘాతమునకు లోనుగావించెను. రాజుచేత పదతాడితుఁడైన శక్తి కుపితుఁడై, రాజుఁ జేరి 'ధర్మాధర్మవివేచనావిదూరుఁడవై రాక్షసునిఁబోలె నన్ను పాదప్రహారమునకు గురిగావించితివి. కావున, నేఁడు మొదలుగ రాక్షసుఁడవై నరభోజివై కుత్సిత జీవనమునకుఁ బాలగువాఁడ వగుదువుగాత'మని యాతనికి శాపమొసంగి తనదారిఁ దాఁ జనియెను. శక్తిశాపమునకుఁ గురియైనకల్మాషపాదుఁడు రాక్షసాకారుఁడై సంచరింపఁదొడంగెను.

శక్తిశాపతప్తుఁడై కల్మాషపాదుఁడు రాక్షసాకారమున సంచరించుచున్నవాఁ డనుసంగతి విశ్వామిత్రుని వీనులకెక్కెఁడు, ఆతఁడు కల్మాషపాదునికడ కరుదెంచి, యాతని నుత్తేజితునిఁ గావించి యాతనిచేత శక్తిప్రభృతి వశిష్ఠపుత్రులను నూఱుగురను జంపించి ప్రహర్షచిత్తుఁడయ్యెను. విశ్వామిత్రుని మూలమున నిట్టిఘోరకష్టమునకు బాల్పడినవాఁడయ్యును, క్షమాశీలుఁడు, శాంతచిత్తుఁడు నగువశిష్ఠుఁడు ఆతని కనిష్టమును సలిపినవాఁడు కాఁడయ్యెను. ఆతనిక్షమాశీలమును గని విశ్వామిత్రుఁడు సాశ్చర్యుఁడై, తనలోఁదాను, 'నాయొనర్చిన దుష్కర్మమునకుఁ దగినప్రతిఫలమొసంగుటకు తగుసామర్థ్యమాతనికడ నొప్పియున్నను, నన్నేమియుఁ జేయక సహించి యూరకున్నవాఁడు. సహనశీలుఁడగు వశిష్ఠునకును, మత్సరగ్రస్తుఁడనగునాకును గలయంతరము దేవతలకును రాక్షసులకును గలయంతరముకన్న నతిశయముగఁ జూపట్టుచున్నయది' అని వితర్కింపఁజొచ్చెను. బ్రాహ్మణత్వ మలవఱచుకొనినఁగాని సహనశీల మలవడనేరదని నిశ్చయించెను. బ్రాహ్మణత్వమును

బడయనెంచి యుగ్రతపము సలుప నారంభించెను. ఆతఁడు సలుపునుగ్రతపమునకు ముల్లోకములును కలవరమొందుచుండుటఁ గని, బ్రహ్మాదిశ్వాలసహితముగ నరుదెంచి రాజర్షిపదవి యనుగ్రహించి చనియెను.

ఆకాలమున ఇక్ష్వాకువంశజుఁడు త్రిశంకుఁడు, వశిష్ఠునికడకేగి 'సశరీరముగ స్వర్గపదమలవరచుయజ్ఞము నాచేఁ జేయింపుఁ'డని యాతనిఁబ్రార్థించెను. త్రిశంకునిప్రార్థన మసంగతమని తలంచి వశిష్ఠుఁ 'డట్టియజ్ఞమును నేఁ జేయింపఁజాల'నని చెప్పి యాతని వెడలనడచెను. అయ్యుదంతము విశ్వామిత్రునికవగతమగుడు, వశిష్ఠుని నవమానితునిగఁ జేయవలయుననుతలంపుతో, ఆతఁడు త్రిశంకుని కడకేగి, 'సశరీరముగ స్వర్గమునుబొందించునట్టి యజ్ఞమును నేఁ జేయించెద'నని చెప్పుచు నాతనిచే బృహద్యాగమొందు చేయించెను. కాని, త్రిశంకుని దేవలోకమునను బొందింపనేరక, యాతనివాయుపథమున నిలువరించి, యాతఁడు నిలిచినస్థానమునకు 'త్రిశంకుస్వర్గ'మని పేరిడియెను.

త్రిశంకునిస్వర్గధామమును బొందింపనేరనందులకు చింతిల్లుచు విశ్వామిత్రుఁడు, పవిత్రతమమగు పుష్కరతీర్థమునకరిగి నిష్ఠురతపోనిమగ్నతఁ దగిలియుండ మరల బ్రహ్మ ప్రత్యక్షమై ఋషిపదవియనుగ్రహించి చనియెను. బ్రాహ్మణత్వమును బడయనెంచినవాఁడగుటకారణముగ నాతఁడు బ్రహ్మప్రదత్తమగు ఋషిపదవితో సంతుష్టినొందనేరక యథాపూర్వముగ తపోనిమగ్నతఁదగిలియుండెను. అట్లు విశ్వామిత్రుఁడు తపోనిరతుఁడై యొప్పియున్నకాలమం దొకనాఁడు అప్సరస మేనకను, పుష్కరతీర్థస్నానమున కరుదెంచిన దానినిఁ జూచి, కామవివశుఁడై,

తపంపు పెంపు బోనడచి యామెను తనయాశ్రమమునం దునిచి
కొని, యామెతోడి క్రీడావిహారములఁ బ్రొద్దులుపుచ్చఁదొడం
గెను. ఈవిధముగ విశ్వామిత్రతపంబునకు విఘ్నమొం డాపా
దించెను. కాలాంతరమున మేనక గర్భవతియయ్యెను. విశ్వా
మిత్రుఁడు చింతాకులస్వాంతుఁ డయ్యెను. క్షుబ్ధుఁడయ్యెను.
ఆతనిమనోవైకల్యముఁగని మేనక భయకంపితయయ్యెను. విశ్వా
మిత్రుఁడామెకు ధైర్యముఁగఱపి యొం దేని జనుమని యాదేశిం
చెను. అంత గర్భవతియగు మేనక విశ్వామిత్రాశ్రమమును వీడి
హిమాలయపార్శ్వవాహినియగు మాలినీనదీతీరమున కరిగి
ప్రఫుల్లకమలినీసదృశసుందరియగు కన్యకఁ బ్రసవించి యాశిశువు
నందు దిగవిడిచి స్వర్లోకమును బొందెను. అట్లు జననీపరిత్యక్త
యగుశిశువును శకుంతములు (పక్షులు) సంరక్షింపసాగెను.
శకుంతరక్షణమునఁ బెరుగుచున్నబాలికను కణ్వమహర్షి తన
యాశ్రమమునకుఁ గొనిపోయి నిజపుత్రికఁబోలెఁ బాలింపఁ
దొడంగెను. శకుంతరక్షణమును బడసినదగుటకారణముగ
నామెకు శకుంతల యని నామకరణముచేసెను. ఈశకుంతలయే
కాలాంతరమున రాజర్షి దుష్యంతునిబరిణయమై, రాజచక్రవర్తి
భరతుని గనియెను. ఆభరతునిపరిపాలనమున రాజిల్లినకతము
ననే జంబూద్వీపమునకు భరతఖండమనునామ మలవడియెను.

మేనకను విడిచిపుచ్చిన యనంతరము విశ్వామిత్రుఁడు
పుష్కరతీర్థస్థాశ్రమమును వీడి కౌశికీతీరమున కరిగి యందు
నాశ్రమమును నిర్మించుకొని నిష్ఠురతపోనిమగ్నుఁడై కామ
ప్రవృత్తిఁ దమనమొనర్చెను. ఆతనితపంబునకు మెచ్చి బ్రహ్మ
మరలసాక్షాత్కరించి యాతనికి మహర్షిపదవి ననుగ్రహించెను.
అట్లు ప్రసన్నుఁడైన ప్రజాపతికి విశ్వామిత్రుఁ డభివాదన మొనర్చి

యనంతరమాతని, 'దేవాదిదేవా! సదాచారసంపత్తికి, క్షమా
శీలతకును, భూతదయాళుత్వమునకును నిలయమైన బ్రాహ్మణ
త్వమును ఆశించుచున్నాఁడను. కరుణించి యనుగ్రహింపుఁడు.'
అని భక్తివినయములతోఁ బ్రార్థించెను. అందులకు బ్రహ్మ,
'వత్సా! కారణము కలిగినప్పుడైనను నీచిత్తము వికారాయత్తము
కాకుండ నెప్పుడుండునో అప్పుడు జితేంద్రియుఁడ వగుదువు.
జితేంద్రియత్వమును బడయుటకు ప్రాణపణముగ ప్రయత్న
మొనరింపుము. దానఁ గృతార్థుఁడవగుదువు.' అని యాతనికి
బోధించి యందుండి తిరోధానుఁ డయ్యెను. అనంతరము విశ్వా
మిత్రుఁ డూర్ధ్వబాహుఁడై, వాయుభక్షుఁడై, వేసవియందు
పంచాగ్నిమధ్యమునను, వర్షాకాలమునందు బహిఃప్రదేశము
నను, శీతకాలమందు జలమధ్యమునను నిలిచి చిరకాలము ఘోర
తప మొనరింపఁజొచ్చెను. అంతట దేవేంద్రుఁడు, పరీక్షార్థము,
పరమరూపవతి రంభ నాతనికడ కనిపెను. ఆతఁ డింద్రునిచేతు
రత గ్రహియించి, రంభవర్తనమునకుఁ గినిసి యామెను శాప
దగ్ధఁ గావించెను. పిమ్మట క్రోధోద్రేకమున నొడలెఱుంగక
వెనుకముందులాలోచింపక రంభనుశపించి తపంబునువ్యర్థపుచ్చి
నందులకు పశ్చాత్తాపతప్తుఁడై, యిఁకముందెన్నఁడును క్రోధ
మూనుట, శాపవాక్కుల నుచ్చరించుట మొదలుగాఁగల తపో
విఘ్నదములగు వర్తనములందు చిత్తమును జొరనీకుండ
బంధించి, కుంభకయోగమున నింద్రియనిరోధ మొనరించి బ్రాహ్మ
ణత్వమును బడయునంతదనుక నూపిరినైన విడుచువాఁడనుగా
నని దృఢప్రతిజ్ఞుఁడై యథాపూర్వముగ నిష్ఠురతపోనిరతుఁడై
యచిరకాలములో మనోవృత్తులను విధ్వంస మొనరించి, నిశ్చ
లుఁడును, నిష్క్రియుఁడును నయ్యెను. అందువలన నాతనికి

సంకల్పవికల్పములు పూర్ణరూపముగ వినష్టమైనవయ్యెను. ఇంద్రియవిజయ మలవడియెను. అంత నింద్రాదిదేవతలు పితామహునికడ కరిగి, 'దేవా! విశ్వామిత్రుని పలువిధములఁ బరీక్షించి చూచితిమి. ఆతనికడ కామక్రోధాదు లిసుమంతయుఁ జూపట్టుటలేదు. ఆతనిపాపములును విషయవాసనలును సంపూర్ణముగ భస్మములయ్యెను.' అని యాతనికి వినిచిరి. విశ్వామిత్రుఁడు విజితేంద్రియుఁడైనవాఁడని యింద్రాదిదేవతలవలన నాలించి సరస్వతీపతి సంతోషతరంగితాంతరంగుఁడై యాతనికడ కరుదెంచి యాతనికి బ్రాహ్మణత్వమును బ్రసాదించెను. బ్రాహ్మణత్వమును బడసినంతనె విశ్వామిత్రుఁడు పితామహునకు సాష్టాంగనమస్కృతుల నర్పించి, యాతని, 'దేవాదిదేవా! నాకు బ్రాహ్మణత్వము ననుగ్రహించినవారలు గనుక నన్ను వేదవిదునిగఁ గూడఁ జేయుఁడు. ధన్యుఁడ నగుదును. నాజన్మము సార్థకముజెందును. నాయపరాధములను క్షమించి నన్ను వశిష్ఠమహర్షి, బ్రహ్మర్షియని సంబోధించునటుల చేయుఁడు. ఈనా కోరికలు సఫలములు కాఁజాలవని తోఁచినయెడల నాకు యథాపూర్వకముగ తపంబుసలుపుట కాజ్ఞ దయచేయుఁడు.' అని సవినయ భయభక్తులతోఁ బ్రార్థించెను. సృష్టికర్త యాతని భక్తివినయములకలరి యాతనికోరికలీడేరునటు లనుగ్రహించి యందుండి వెడలిపోయెను. ఇట్లు విశ్వామిత్రుఁడు ఘోరతపంబున విరించి నలరించి యాతనివలన బ్రాహ్మణత్వమును, వేదవిజ్ఞానమును బడసి వశిష్ఠునివలన బ్రహ్మర్షియని సంబోధితుఁడై నిజాశ్రమమున సుఖపూర్వకముగ నివసింపఁదొడంగెను

విశ్వామిత్రాశ్రమమునకు సమీపస్థమగు నరణ్యములో తాటకియనుఘోరరాక్షసి నివసించుచు, తపోవనస్థు లొనర్చు

యజ్ఞాదికర్మములను విధ్వంసములు గావించుచుండెను. ఆపె యొనర్చు నీదుష్కృత్యమునందు ఆపెపుత్రులు సుబాహుమారీచులనువార లిరువురు సహచరులై యొప్పుచుండెడివారు. మహర్షులొనర్చు యజ్ఞాదికర్మములను పుత్రసహచరియగుతాటకి విధ్వంసమొనరించుచుండుటఁ గని, విశ్వామిత్రుఁడు చింతితుఁడై, దుష్టశిక్షణ యజ్ఞరక్షణార్థ మయోధ్యనుండి దశరథపుత్రులను రామలక్ష్మణులను వెంటఁ దోడ్కొనితెచ్చి, వారలకు మార్గమధ్యమున, నాయాసాపజయములను దూరమొనర్పఁగల 'బలాతిబల'లను విద్యల నుపదేశించెను. విశ్వామిత్రుని వెనువెంటఁజనుదెంచుచున్న రామలక్ష్మణులను జూచినంతనే తాటకి కుపితయై వారలను భక్షింప నెదురేగఁజొచ్చెను. క్షణకాలమున నెదురేగుదెంచుచున్న తాటకిని రామునిచేత చంపించెను. అనంతర మాశ్రమమునకరుదెంచి యజ్ఞదీక్షితుఁడయ్యెను. విశ్వామిత్రుని యజ్ఞోదంత మాలించి, యద్దానిని విధ్వంసమొనరించుటకునై సుబాహుమారీచు లరుదెంచి యజ్ఞకుండములపై రక్తమాంసాదులను విసరఁజొచ్చిరి అంత యజ్ఞరక్షకుఁడు రాముఁడు సుబాహుని సంహరించి, మారీచుని సముద్రములోఁ బాఱవైచి యజ్ఞమును నిర్విఘ్నముగ పరిసమాప్తిఁబొందించెను. ఇట్లు యజ్ఞమును నిర్విఘ్నపరిసమాప్తిఁ గనఁజేసిన రామలక్ష్మణుల యెడ విశ్వామిత్రుఁడు ప్రసన్నుఁడై వారలకు పురశ్చరణపూర్వకముగ దివ్యాస్త్రములనేకము లొసంగెను.

విశ్వామిత్రుఁడు రాజర్షి జనకరాజనిమంత్రితుఁడై రామలక్ష్మణులతో మిథిలానగరమున కేగుచు, మార్గమధ్యమున గౌతమమున్యాశ్రమమున కరుదెంచి యందు శాపదగ్ధయై పాషాణరూపమునఁ బడియున్న గౌతమపత్నిని, అహల్యను,

రాముని చేత శాపవిముక్తఁ గావించి జనక రాజపురముఁ జేరెను. అట్లు చను దెంచినమహర్షికి జనకుఁడు కులపురోహితుఁడు శతా నందపురస్సరముగ నెదు రేగి స్వాగత మొసంగి యాతని రాజమంది రమునకుఁ దోడ్కొనివచ్చి యథావిహితముగ పూజాదికృత్య ములఁ బరితుష్టునిఁ గావించి, పార్శ్వవర్తులగు రామలక్ష్మణులఁ దిలకించి, మునిచంద్రమా! అసితూణశరాసనధారులై సింహ కిశోరములచందమున నలరారుచున్న యీబాలకులతల్లిదండ్రు లెరో యెఱిఁగించి నన్ను ధన్యునిగఁ జేయుఁడని ప్రార్థించెను. అంత నాతఁడు రామలక్ష్మణులచరితమాద్యంతము జనకున కెరి గించి, 'నీయింటనున్న శివునివిల్లును ఈరామునకుఁ జూపు మని' యాదేశించెను. మహర్షి యాదేశానుసరణముగ జనకుఁడు, రాము నకు శివధనుస్సును జూపుచు, 'దీనిని మోపెట్టు దేని నాకూఁతును, అలోకసామన్యసుందరిని, సీతను నీకిచ్చి వివాహము చేయుదును' అని పలికెను. విశ్వామిత్రునియనుమతిఁ బడసి రాముఁడు ధను స్సును గ్రహియించి యెక్కిడుటకుద్యమింప, నయ్యది నడిమికి రెండుతునుకలయ్యెను. శివునివిల్లెక్కిడునట్టిగాని, విఱచునట్టి గానివ్యక్తికి తనపుత్రికను సీతనిచ్చి వివాహము చేయుటకు జన కుఁడు ప్రతినఁబూని యున్నవాఁడు. తత్ప్రకారము విశ్వా మిత్రానుమతిని జనకుఁడు, రామునకు సీతను, లక్ష్మణునకు తన రెండవకూతునూర్మిళను, భరతశత్రుఘ్నులకు తనసోదరపుత్రి కలు మాండవీశ్రుతకీర్తుల నొసంగి పరిణయ మొనర్చెను. పరిణ యానంతరము, సంతోషపూర్వకముగ, విశ్వామిత్రుఁడు సిద్ధా శ్రమమునకును, రామలక్ష్మణప్రభృతులు అయోధ్యకును మర లినవారలైరి.

విశ్వామిత్రమహర్షి, అయోధ్యాధిపుఁడు,సత్యసంధుఁడు, హరిశ్చంద్రునిరాజ్యమును సర్వస్వమును గ్రహియించి, యంత కుము న్నాతఁడొసంగెదనన్న యజ్ఞదక్షిణకు, ఆతనిఁ గాటికాప రికిని, ఆతనిభార్యను చంద్రమతిని, పుత్రుని లోహితాస్యుని నొకబ్రాహ్మణునకును విక్రయించి, పలుకష్టములపాలు గావించి, యాతనిసత్యవ్రతమును లోకవిఖ్యాతమొనరించి, యాతనికి శాశ్వతయశమును సమకూర్చినవాఁడు.

---

5. వేదవ్యాసమహర్షి.

వేదవ్యాసుఁడు శ్రీమన్నారాయణావతారుఁడుగ పరిగ ణింపఁబడుచున్నవాఁడు. ఆతనితండ్రి పరాశరుఁడు తాత శక్తి. ముత్తాత బ్రహ్మర్షివరిష్ఠుఁడు వశిష్ఠుఁడు. తల్లిమత్స్యదరియను విదుషీరత్నము. మత్స్యదరికి యోజనగంధి, సత్యవతియను మఱిరెండునామములు గలవు. వేదవ్యాసుఁడు కృష్ణవర్ణుఁడగుట కారణముగ కృష్ణుఁడనియు, నదీమధ్యమున ద్వీపమందు జన్మించిన వాఁడగుటవలన ద్వైపాయనుఁడనియును బేర్కొనఁబడుచున్న వాఁడు. వేదవిభాగమొనర్చినకారణమున వేదవ్యాసనామమున విఖ్యాతుఁడయ్యెను. చిరకాలము బదరీవనమునఁ దపంబునలిపి యున్నకారణమున బాదరాయణుఁడనిగూడఁ బేరొందినవాఁడు. మహర్షిమండలమునందు ప్రథమగణ్యుఁడు. విద్యలకు అపరసర స్వతి. ప్రత్యక్షమూర్తి. పదునెనిమిది మహాపురాణములు, పదు నెనిమిది యుపపురాణములు, వ్యాసస్మృతి, బ్రహ్మసూత్రములు ఉత్తరమీమాంస, మహాభారతమును, అధ్యాత్మరామాయ

ణము, ఆపిగాఁగల బహుసంఖ్యాకములగు గ్రంథరత్నములను, పాతంజలియోగసూత్రములకు వ్యాఖ్యను రచియించి, తత్కాంతి పుంజములచేత, పుణ్యప్రదమగు భారతభూమి ప్రాచీనగుణ గరిమ నుత్తరోత్తరాభివృద్ధిగ వెలుఁగొందఁజేసెను. ఆతఁడు జన్మగ్రహణమొనర్చిన వెనువెంటనే, జననియగుసత్యవతికి ధర్మోపదేశమొసంగి, "నన్ను నెప్పుడు తలంచెదవో, అప్పుడు, ఆక్షణమున నీసమ్ముఖమున నుపస్థితుఁడనగుదు"నని యామెకడ కృతప్రతిజ్ఞుఁడై, తపంబొనర్చుట కెందేని చనియెను.

ఆకాలమున, భరతవంశజుఁడు, శంతనుఁడు, హస్తినాపురమును బాలించుచుండెను. ఆతనికి గంగవలన భీష్ముఁడను కొమరుఁడు గలిగెను. భీష్ముఁ డుదయించినపిమ్మట కారణాంతరమున గంగ శంతనుని వీడి వెడలిపోయెను. కాలాంతరమున భీష్ముఁడు యువరాజపట్టభద్రుఁడయ్యెను. పిమ్మట భీష్ముఁడు రాజ్యాధికారమును పరిత్యజించి, ఆజన్మబ్రహ్మచర్యవ్రతమును గ్రహియించి తనజనకునకు శంతనునకు సత్యవతిని బరిణయమొనరించెను. శంతనుఁడు సత్యవతియందు చిత్రాంగదుఁడు, విచిత్రవీర్యుఁడు ననునిరువురు కొమరులఁబడసి స్వర్గస్థుఁడయ్యెను. చిత్రాంగదుఁడు అవివాహితుఁడుగనె పరలోకగతుఁడయ్యెను. విచిత్రవీర్యుఁడు అంబిక, అంబాలికలను నిరువురుసతులను, అనాథయువతులుగ నొనరించి తాను స్వర్గలోకమును జూఱఁగొనియెను. అట్లు కురువంశము నష్టప్రాయమగుఁడు, జనని, సత్యవతి యాజ్ఞచొప్పున, వేదవ్యాసుఁడు తనయోగశక్తివలన, అంబిక యందు ధృతరాష్ట్రుని, అంబాలికయందు పాండురాజును, అంబికాదాసియందు భక్తప్రవరుని విదురుని నుత్పన్నులఁ గావించి కురుకులమును పునరుజ్జీవితమును గావించెను.

వ్యాసుఁడు, దుర్యోధనయుధిష్ఠిరులకు బ్రవర్తిల్లినమహాభారత యుద్ధసమయమునందు, ధృతరాష్ట్రదుర్యోధనాదులకు సదుపదేశ మొసంగుచు పాండుపుత్త్రుల కర్ధరాజ్య మొసంగి కురుకులరక్షణ మొనరింపుఁడని బోధించెను. వ్యాసవరప్రభావమువలననే భారతయుద్ధమందు సంఘటిల్లినగుప్తఘటనలను గూడ నిత్యమును ధృతరాష్ట్రున కెఱింగించుటకు సంజయుఁడు సమర్థుఁడయ్యెను. అర్జునపుత్త్రుఁడు, మహావీరుఁడు నగునభిమన్యుఁడు నిహతుఁడైనపిమ్మట, షోడశమహారాజులయు, రాజపుత్త్రులయొక్కయు కథలను వినిచి ధర్మరాజును దుఃఖోపశాంతునిగఁ జేసెను. ఆకథలు శోకాకులచిత్తులకు దుఃఖోపశమనములు. ఆనందదములు. వైరాగ్యదములు. భారతవీరుఁడు అర్జునునకును, గురుపుత్త్రుఁడు అశ్వత్థామకును ద్రౌపదేయవధానంతరమున బ్రవర్తిల్లినమహాయుద్ధమందు నావీరులిరువురు నొండొరులపైఁ బ్రయోగించుకొనిన బ్రహ్మశిరోనామకాస్త్రములనడుమ యోగబలమున నుపస్థితుఁడై, తదస్త్రములకు బలి కాకుండ నాయిరువురవీరులనేగాక సమస్తప్రపంచమునుగూడ సంరక్షించెను. భారతయుద్ధానంతరమున, ధృతరాష్ట్రయుధిష్ఠిరులకును, కుంతిగాంధారిప్రభృతి శోకవిహ్వలలగు కౌరవవనితలకును ననుగ్రహించిన యుపదేశములు నేఁడును సకలజనులకు పరమోపాదేయములై విరాజిలుచున్నయవి. ధృతరాష్ట్రుఁడు, పుత్త్రశోకమువలన నధీరుఁడై పడియుండినపుడు, తన యోగబలముచేత దుర్యోధనాదులయాత్మలనుస్వర్గమునందుండి ధరాతలమునకు రావించి యాతనికిఁ జూపి, యాతనిశోకమును దూరగత మొనరించెను. శ్రీకృష్ణనిర్యాణానంతరము పాండవులకు దివ్యోపదేశ మొసంగెను ఆయుపదేశమువలన వారలు

మోహావిదూరులై స్వర్గయాత్రకు ప్రస్థానము చేసిరి. వ్యాస మహర్షి జగత్కల్యాణమభిలషించి, కాలానుగుణముగ సామ యిక రాజమహారాజులకును ప్రజలకు నొసంగిన సదుపదేశ ములతో ఆర్షగ్రంథములన్నియును నిండియున్నయవి.

పుణ్యభూమియగు భరతఖండమున కలంకారసదృశు లగుఋషులు, మహర్షులు, రాజులు, మహారాజులు, చక్ర వర్తులు పలువురు గలరు. కాని వారలలో వేదవ్యాసునిఁ బోలు లోకోపకారపారీణు లొక్కరైనఁ బుట్టరు. ఆతఁడు రచియిం చిన గ్రంథములు ఆర్యవాణి కమూల్యాభరణములు. సంస్కృత సాహిత్యభిత్తిప్రతిష్ఠాపనమునకు ప్రధానసాధనములు. ధర్మ ప్రబోధమునకు సద్గురుసదృశములు. సనాతనధర్మాస్తిత్వమునకు ముఖ్యకారణములు బ్రహ్మసూత్రములు మతాంతరులచే సర్వ సమ్మతములుగ పరిగణింపఁబడుచున్నయవి. మహాభారతము ఇతి హాసముగను, పురాణముగను, కావ్యముగను, నీతిశాస్త్రము గను, ధర్మగ్రంథముగను కొనియాడఁబడుచున్నయది. అందు వేదాంతబ్రహ్మవిద్యాదివిషయములు పెక్కులిమిడియున్నయవి. అంతటి భగవద్గీతఁబోలిన కర్తవ్యోపదేశక బ్రహ్మతత్త్వనిరూపక గ్రంథము మఱియొకటి గానరాదు. ఆతఁ డుద్ధరించినయుద్యో గపర్వములోని భగవద్వాక్యము ఆతనిబుద్ధికుశలతను బహు తరముగఁ గొనియాడుచున్నయది. దివ్యపురుషుని శ్రీరామ చంద్రుని పుణ్యచరిత్రప్రచారమునకు వాల్మీకి రామాయణము కారణమైనవిధమున యోగివర్యుని శ్రీకృష్ణచంద్రుని పావన చరిత ప్రచారమునకు భాగవతబ్రహ్మవైవర్తపురాణములు కార ణములై యున్నయవి. వ్యాసవిరచితమగు భాగవతదివ్యపురాణ

మున్నే, అభిమన్యుతనయుండు పరీక్షిత్తు శుకమహర్షి వలన నేడు దినములలో నాలించి పరమపదముం జూఱఁగొనియెను.

వ్యాసమహర్షి తాను రచియించిన గ్రంథముల నొకమూల నిడి పూజింపక, తత్ప్రచారమును గూర్చి యథేష్టోద్యోగ మొనర్చి యున్నవాఁడు. ఆతనికడ ననంఖ్యాకులగు శిష్యులు అధ్యయన మొనర్చుచుండెడివారు. ఆశిష్యుల కాతఁడు తా రచియించిన గ్రంథములను వెంటవెంటనే కంఠస్థ మొనరించి వానిని పవిత్ర క్షేత్రముల కరిగి ప్రచారమును సలిపి తన్మూలముగ జగత్కళ్యాణ మొనఁగూర్పుఁడని వారల నియోగించుచుండెడివాఁడు. వ్యాసశిష్యులలో వైశంపాయనుఁడు, భారతమును జనమేజయునకు సర్పయాగసభాసదనమున వినిపించి కీర్తిఁబడసెను. శుకుఁడు భాగవతమును పరీక్షిత్తునకు వినిచి కృతార్థుఁడయ్యెను. సూతుఁడు తదితరపురాణములను నైమిశారణ్యాదిపుణ్యక్షేత్రములయందు సహస్రసంఖ్యాకులగు మహర్షులసమ్ముఖమున కథారూపమున వినిచి జీవన్ముక్తుఁడయ్యెను. గౌతమాదులు వేదశాస్త్ర బ్రహ్మవిద్యాదివిషయములను ప్రచార మొనరించి యశఃకాయులైరి. పురాణములన్నియును వేదవ్యాసవిరచితము లగుటకారణముగ తత్పురాణకథకులు ప్రకృతకాలమందు కూడ వ్యాసనామమునఁ బేర్కొనఁబడుచున్నవారలు.

వ్యాసమహర్షి యనేక గ్రంథములను సంకలన మొనర్చుటయందు సర్వసమర్థుఁడైనవాఁడైనను, దుర్భేద్యమగు సంసారవ్యామోహమును విచ్ఛిన్న మొనరించుటయం దశక్తుఁడై, మనశ్శాంతిని బడయనేరక పరితపింపఁజొచ్చెను. అట్టితరి దేవర్షి నారదుఁ డాతనికడ కరుదెంచి, 'యాతనికి పరమపవిత్రమగు

శ్లోకచతుష్టయమును వినిచి యెందేని చనియెను. నారదుఁడు వినిచిన శ్లోకచతుష్టయమును నాధారముగఁగొని వ్యాసమహర్షి పవిత్రతమమును, పుణ్యప్రదమునునగు శ్రీమద్భాగవతమును రచియించి మనశ్శాంతిఁ జూఱఁగొనియెను.

6. యాజ్ఞవల్క్యమహర్షి.

యాజ్ఞవల్క్యుఁడు మహర్షిశ్రేష్ఠులలో నొక్కరుఁడుగ పరిగణింపఁబడినవాఁడు. మహాభిమానుఁడు త్రికాలజ్ఞుఁడు. వేదశాస్త్రపారంగతుఁడు. యోగవిదుఁడు, బ్రహ్మజ్ఞానోపదేశకుఁడు. స్మృతిగ్రంథమును యోగశాస్త్రమును విరచించినవాఁడు. ఈశ్వరసాక్షాత్కారమును బడసినవాఁడు. అమరత్వమును జూఱఁగొనినవాఁడు. అతనితపోవనము మిథిలలో నొప్పుచుండెడిది. మిథిలాధిపతి, రాజర్షి జనకమహారాజు పాలనకాలమునం దుండినవాఁడు. జనకచక్రవర్తికిని సహధర్మిణి మైత్రేయికిని బ్రహ్మజ్ఞానవిషయమునుగూర్చి బహుతరముగ నుపదేశ మొసంగియున్నవాఁడు ఆయుపదేశవివరణము బృహదారణ్యకోపనిషత్తునందు విపులముగ వివరింపఁబడియున్నయది.

ఒకప్పుడు జనకుఁ డొక బృహద్యాగమును సలిపెను. ఆసమయమున కురుపాంచాలాది దేశములలోని విద్వాంసులు, బ్రహ్మవిదులు, బ్రాహ్మణులు పలువురు నిమంత్రితులై యరుదెంచి యాయజ్ఞవాటికయం దుపస్థితులైరి. అట్లు బ్రహ్మవిదులు, బ్రాహ్మణులు అందఱు నొక్కచోనుండఁగా జనకుఁడు ఆనందభరితుఁడై, వారలనందఱిని యథావిధిఁ బూజించి,

"భూదేవులారా! బ్రహ్మవిద్వరిష్ఠుఁడగు బ్రాహ్మణునకు సవత్సాకము,స్వర్ణశృంగమండితములు నగు గోసహస్రమును పురస్కారపూర్వకముగ నొసంగఁదలఁచియున్నవాఁడను. కాఁబట్టి అట్టివారు మీలో నెవ్వరైన నుండినయెడల వారాగోసహస్రమును యథేష్టముగ గ్రహియించి తోడ్కొనిచనదగు"నని వారియెదుట బ్రకటించెను. ఆపలుకుల నాలించి బ్రాహ్మణులందఱొకరి మొగ మొకరుచూచుకొనువారలైనవారే కాని, యాగోసహస్రమును గ్రహియింప సాహసించినవారెవరును లేరైరి. గోగ్రహణమున కుద్యుక్తుఁడగు బ్రాహ్మణుఁడొక్కఁడైన నాబ్రాహ్మణబృందమునందుఁ బొడఁగానమికిఁ జింతిల్లుచు,యాజ్ఞవల్క్యుఁడు, తనశిష్యులలో నొక్కనిఁ జీరి, యాతనితో గోసహస్రమును దనయాశ్రమమునకుఁ దోలుకొనిజనుమని యాదేశించెను ఇట్లు యాజ్ఞవల్క్యుఁడు నిస్సందేహముగ శిష్యునకొసంగిన యాదేశమాలించి యుపస్థితబ్రాహ్మణులు, తపోధనులు, పలువురాతనియెడ నసంతుష్టులై యాతనితో శాస్త్రార్థమొనరించి, యాతనివలన పరాజయమునుబడసి, యాతని బ్రహ్మవిదులలో సర్వశ్రేష్ఠునిగ స్వీకరించి సమ్మానితునిఁగావించిరి అనంతరమాతఁడు ఆశ్రమమునకరుదెంచి మైత్రేయీకాత్యాయనులను తనయిరువురుపత్నులను చేరఁబిలిచి,"నేనిదె సన్న్యాసాశ్రమమును గ్రహియింపనున్నాఁడను. నాయాజ్ఞను గ్రహియించి, నాసంపత్తును మీరుభయులును సరిసమానముగఁ జేకొని సుఖంబునమనుఁడు. నాకు సంతోషపూర్వకముగ సమ్మతినొసంగుఁడు" అని వారితో చెప్పుచు వారియనుమతి నభిలషించెను. అంతట, మైత్రేయి "మీయీయనుగ్రహించుసంపత్తి నాకమృతత్వ మొడఁగూర్పునదియగునా? కాదేని, దీనిని నేనాశింపను. చేకొనవొల్లను, ఆయ

రత్నమొడఁగూర్పఁ గలసంపత్తి యెద్దియో అద్దానినే నాకొసంగి నన్నుఁ గృతార్థురాలనుగాఁ జేయుఁడు" అని సవినయముగ భర్తఁ బ్రార్థించెను. పత్నిప్రార్థన మాలించి యాజ్ఞవల్క్యుఁడు ప్రసన్న హృదయుఁడై భవరోగమున కేకమాత్రౌషధమగు బ్రహ్మవిద్య నామె కుపదేశపూర్వకముగ నొసంగెను. పత్యుపదిష్టమార్గాను సరణముగ మైత్రేయి యష్టాంగయోగమును సాధన మొనర్చి బ్రహ్మజ్ఞానమును బడసినదయ్యెను. యాజ్ఞవల్క్యుఁడు మైత్రేయి కొసంగిన యుపదేశము గ్రంథరూపమును దాల్చి 'యాజ్ఞవల్క్యయోగ'మను పేరఁ బ్రఖ్యాతమగుచున్న యది. ఆగ్రంథమును బోలినగ్రంథము 'పాతంజలియోగదర్శనము' తక్క మఱియొక్కటి గానరాదు.

యాజ్ఞవల్క్యుఁ డొకప్పుడు జనకమహారాజుకడ కరుదెంచెను. అన్యోన్యకుశలసంవాదానంతరము సగుణబ్రహ్మముఁ గూర్చిన ప్రస్తావన ముపస్థితమయ్యెను. జనకుఁడు సగుణబ్రహ్మమును గూర్చినవిషయమునే యెఱింగియున్నవాఁడు. అద్దానినే సంపూర్ణమగు బ్రహ్మజ్ఞానమని తలంచియున్నవాఁడు. అట్టిజనకునిభ్రమను యాజ్ఞవల్క్యుఁడు నివారణమొనరించి యాతనికి నిర్గుణబ్రహ్మోపాసనావిధాన ముపదేశించి, యాతని జీవన్ముక్తుని గావించెను. యాజ్ఞవల్క్యునియుపదేశముచొప్పున జనకుఁడు నిర్గుణబ్రహ్మము నుపాసించి అచ్యుతపదమును బడసినవాఁడయ్యెను.

యాజ్ఞవల్క్యుఁడు వైశంపాయనమహర్షి శిష్యుఁడు. ఆతనికడ యజుర్వేదమును అభ్యసించినవాఁడు. ఒకప్పుడు మహర్షులందఱు నొకచోఁగూడి యొకానొకపర్వతశిఖరమందు

ఋషిసభ జరుపుటకు నిశ్చయించి, ఆసభకు మహర్షులందఱును రావలయును; రానివారలు వారము దినములలో బ్రహ్మహత్యాపాతకమునకు లోనగువారలగుదురు! అని ప్రకటించిరి. ఆప్రకటనముమేరకు మహర్షులంద రాసభయం దుపస్థితులైరి. కాని వైశంపాయనుఁడు కారణాంతరమున రాఁజాలక బ్రహ్మహత్యాపాతకమునకు లోనైనవాఁడయ్యెను. అంత నాతఁడు కడుదుఃఖితుఁడై, తనశిష్యులను రావించి, వారలకు, తపంబొనర్చి తనకలవడిన బ్రహ్మహత్యాపాతకమును బాఁప ద్రోలుఁడని యాజ్ఞయొసంగెను. గుర్వాజ్ఞను శిరసావహించి శిష్యులందఱు తపంబు సలుపుట కుపక్రమించిరి. ఆసమయమున యాజ్ఞవల్క్యుఁ డందు లేఁడు. ఎందేని చనియుండెను. ఆతఁ డాశ్రమమున కరుదెంచి అయ్యుదంత మాద్యంతమును గ్రహియించి, గురువు చెంతకరిగి, "మీరలీశిష్యులవలన కార్యసాఫల్యమును గనఁజాలరు. వీరలు మీకలవడిన బ్రహ్మహత్యాపాతకమును బాఁప ద్రోలనేరరు. నా కాజ్ఞ నొసంగుఁడు. నేను కఠోరతపంబొనర్చి మిమ్ములను పాపవిముక్తులఁ గావించెదను." అని సగర్వముగఁ బలికెను. యాజ్ఞవల్క్యుని గర్వపూరితములగు నాపలుకుల నాలించి వైశంపాయనుఁడు రుష్టుఁడై తనకడ గ్రహించినవిద్యను తనకు మరల సమర్పించి తనయాశ్రమమును వీడి యెందేని పొమ్మని యాతని కాదేశించెను. అంత మహాభిమానియగు యాజ్ఞవల్క్యుఁడు, తాను వైశంపాయనుకడనుండి గ్రహించినవిద్యను వమన మొనర్చి తన్మూలకముగ నాతని కర్పించి యాతనియాశ్రమమును వీడి వెడలిపోయెను. అట్లు యాజ్ఞవల్క్యుఁడు, వమనపూర్వకముగ వైశంపాయనునకు మరల నర్పించినవిద్యను, తక్కుఁగలమహర్షులు తిత్తిరిపక్షులై గ్రహియించిరి. అకారణమున నది మొద

లు వేదభాగము, 'కృష్ణయజుర్వేదము, తైత్తిరీయశాఖ'యని ద్వివిధమయ్యెను. అనంతర మాతఁడు వేదవిద్యఁబడయుటకై సూర్యునినారాధించెను. సూర్యుఁడు ప్రసన్నుఁడై యాతనికివేద విద్యనొసంగెను. సూర్యుఁడు యాజ్ఞవల్క్యునకొసంగిన వేద విద్య 'శుక్లయజుర్వేద'మనునామమునఁ బ్రసిద్ధము.

యాజ్ఞవల్క్యునకు కణ్వమాధ్యందినులను నిరువురు పుత్రులుదయించిరి. వారును దంద్రింబోలి తపోధనసంపన్నులు. బ్రహ్మతేజస్సమన్వితులు.

---

7. కర్దమమహర్షి.

కర్దమమహర్షి బ్రహ్మమానసపుత్రుఁడు. ప్రజాపతులలో నివాఁడు. ఆతఁడు బ్రహ్మచే ప్రజాసృష్టియొనర్చుటకు, సంతానోత్పాదనమొనర్చి సృష్టిని వృద్ధియొనర్చుటకు, అనుజ్ఞాతుఁడై ప్రోతస్స్వతి సరస్వతీతీరమున కరిగి యందు సమాధిస్థుఁడై చిర కాలము శ్రీహరి నారాధించెను. ఆతనితపస్సునకును, ఆతని యారాధనమునకును శ్రీమన్నారాయణుఁడు ప్రసన్నుఁడై యా తనికి దర్శనమొసంగెను. ప్రజాపతికర్దముఁడు భగవద్దర్శనమును బడసి భక్తిపరతంత్రుఁడై, గద్గదకంఠుఁడై, యథోచితరీతిని స్తుతియొనర్చి యాతని నలరించెను. కర్దమస్తుతులకు శ్రీహరి హృష్టచిత్తుఁడై, గంభీరనిస్వనమున, "నోద్విజోత్తమా! నీతపస్సునకు సంతసించితిని. నీవాంఛితము సఫలముగాఁగలదు. నీవు అనురూపమగుభార్యను, అనుకూలమగుసంతానమును అభిలషించి నన్ను భక్తియుక్తముగ నారాధించితివి. నీయభిలాషము సఫ

ఘ్రముగ సమకూరఁగలదు. అచిరకాలములో స్వాయంభువు మనువు తనభార్యయగుశతరూపను, కన్యయగు దేవహూతిని వెంటనిడుకొని నీయాశ్రమమున కరుదెంచును. మనుకన్య దేవహూతిరూపవతి. శీలవతి. యౌవనావస్థయందు పదార్పణమిడినయది ఆమె నీకు భార్యకాఁగలదు. మనువామెను నీకు సమర్పించి నీవాంఛితమును బూర్తియొనరించును. దేవహూతిగర్భమునుండి పలువురు కన్యలఁ బడయఁగలవు. అనంతరమామె గర్భజనితుఁడనై సాంఖ్యవిద్యను ప్రకాశింపఁజేసెదను. నీవు గృహస్థాశ్రమమునందు ప్రతిష్ఠుఁడవై, భూతదయాపరతంత్రుఁడవై ప్రవర్తిలుచుండుము." అని పలుకుచు నంతర్హితుఁడయ్యెను.

శ్రీహరి యింతర్హితుఁడైనయనంతరము ఋషివరుఁడు కర్దముఁడు సరస్వతీవ్యాప్తమగు బిందుసరోవరతీరమునకరుదెంచి యందు నివసింపఁజొచ్చెను. కొంతదినములు సాగఁగా మనువు కర్దమప్రజాపతియాశ్రమమున కరుదెంచి యాతనికి విధ్యుక్తవిధి నభివాదన మొనరించెను. కర్దముఁడును మనువున కాగతస్వాగతమొసంగి, యాతని నర్ఘ్యపాద్యాద్యుపచారములఁ బూజించి తుష్టునిఁగావించి, యనంతర మాగమనకారణ మెఱిఁగింపుఁడని సవినయముగఁ బ్రార్థించెను. కర్దమునినోటనుండి వెలువడినవచనామృతమును గర్ణపుటములఁ గ్రోలి మనువు సంతోషతరంగితాంతరంగుఁడై, సవినయముగ, "ఓమహర్షిసత్తమా! ఈ దేవహూతి నాకన్య పరిణయయోగ్యయయ్యె. ఈమెకు వివాహముచేయకుండనే పనిచేయుటకును వలనుపడకుండెను. ఈమెను సుపాత్రునకర్పింప మదినెంచి తదన్వేషణమున పరిభ్రమించుచుండ, దేవర్షి నారదుఁడు, తాము వివాహోత్సుకులరై యున్నవారలని యెఱిఁగించెను. కాఁబట్టిసర్వలక్షణసంపన్న యగు,

సుగుణగణసమన్వితయు నగునాయీకన్యను పరిగ్రహించి పరిణయమై నన్నుఁ గృతార్థునిగఁ జేయుఁడని వినీతభావమునఁ బ్రార్థించుచున్నాఁడ"నని బదులొసంగెను. అంత, తాను మున్ను భగవంతునివలన వినినవాక్యము తలంపునకుఁ బాఱ, కర్దముఁడు మనుప్రార్థనమును స్వీకరించెను. కర్దముఁడు దేవహూతిపాణిఁ గ్రహియించుట కంగీకృతుఁడయ్యెనని మనువు సంతసిలుచు, యనతికాలమున దేవహూతిని కర్దమప్రజాపతికి వేదోక్తరీతిని సంప్రదానమొనరించెను. ఇట్లు దేవహూతిని కర్దమునకు వైవాహికవిధిని సమర్పించి మనుశతరూపలు ఆనందాంబుధినోలలాడుచు, అల్లునకు కూఁతునకు నరణంబులొసంగి నిజ రాజధానికి మరలినవారలైరి.

తల్లిదండ్రులు వీడిచనినయనంతరము, పతివ్రతయగు దేవహూతి, మనోవాక్కర్మములఁ బతినే దైవముగఁ బరిగణించుచు, పతిసేవయే సలుపుచుండెడిది. ఆమెయొనర్చుసేవకు కర్దమఋషి యతిశయసంతుష్టుండగుచుండెడివాఁడు ఇట్లుకొంత కాలమరుగుఁడు, అసాధారణతపస్వియగు కర్దమప్రజాపతి, తనతపోమహిమవలన నొకదివ్యవిమానమును నిర్మాణమొనరించి సపత్నీకముగ నం దారూఢుండై విహరింపఁజొచ్చెను. దేవహూతి, వసు, అనసూయ, శ్రద్ధ, హవిర్భు, గతి, క్రియ, ఖ్యాతి, అరుంధతి, శాంతినామ్ములను తొమ్మండుగురుకూఁతులను ప్రసవించెను. కర్దముఁడీకన్యలలో వసుని మరీచికిని, అనసూయను అత్రికిని, శ్రద్ధను అంగిరునకును, హవిర్భుని పులస్త్యునకును, గతిని పులహునకును, క్రియను క్రతునకును, ఖ్యాతిని భృగునకును, అరుంధతిని వశిష్ఠునకును, శాంతిని అథర్వునకును వైవాహికవిధిని సంప్రదానమొనరించెను.

కొలఁది కాలమరిగినపిమ్మట పూర్వప్రతిజ్ఞానుసరణముగ కమలామనోహరుఁడు శ్రీమన్నారాయణుఁడు దేవహూతి గర్భమున కపిలనామమున జన్మించెను కపిలదేవుఁడు జన్మగ్రహణమొనర్చిన యనంతరము కర్దమప్రజాపతి, భార్యయగు దేవహూతి పరామర్శానుసరణముగ వానప్రస్థుఁడై కఠోరతపము సలుపఁజొచ్చెను. ఆతఁడు తనపాపతాపములనన్నిటిని యోగాగ్నిజ్వాలల శాంతులుగావించి విష్ణుపదమును జొచ్చికొని యెను.

కపిలుఁడు కాలానుగుణముగ వేదశాస్త్రపారగుఁడయ్యెను. తల్లియగు దేవహూతికి తత్త్వోపదేశమొసంగెను. ఆయుపదేశమువలన నామెను మాయామోహము వినష్టమయ్యెను. బ్రహ్మజ్ఞానములబడెను. అనతికాలముననే యామె యచ్యుత పదమునుబడసి కృతార్థురాలయ్యెను.

అనంతరము కపిలదేవుఁడు, త్రితాపదగ్ధుల, మనుజుల కళ్యాణార్థము, సాంఖ్యదర్శనమును రచియించి మోక్షమార్గమును సుగమము గావించెను. ఆతఁడు సాంఖ్యదర్శనమున నీశ్వరసత్తను అంగీకరించినవాఁడు కాఁడు. అందువలన కొందఱాతనిని నిరీశ్వరవాదియనియందురు. కపిలుఁడు సాంఖ్యదర్శనమునందు, "జగత్తు జడము. ప్రకృత్యుత్పన్నము. ప్రకృతి అనాది ప్రకృతివలెనె పురుషుఁడు (జీవుఁడు) కూడ అనాదియై యున్నవాఁడు. మనుజులు కర్మఫలానుసరణముగ నొకశరీరమునువీడి మఱియొకశరీరముచు ధరియించువారలగుచుందురు" అని నిరూపించియున్నవాఁడు. ఆవిచారణమిట యప్రస్తుతము.

కపిలుఁడు సాంఖ్యదర్శనరచనానంతరమున మాత్రాజ్ఞఁబడసి పాతాళమునకరిగి యందు తపంబుసలుప నారంభించెను. పవిత్ర హృదయయగు దేవహూతియు కపిలుఁడుపదేశించిన తత్త్వజ్ఞాన మహిమవలన బ్రహ్మపదప్రాప్తిఁగనియెను. కపిలుఁడు తపోనిర తుఁడై యుండిన సమయమందు అయోధ్యాధిపతిసగరుఁడుఅశ్వ మేధయాగమును సలుపుట కుపక్రమించి, సవనాశ్వమును భూ పరిక్రమణమునకు విడిచిపుచ్చి, తదశ్వరక్షణమునందు తన యఱువేలపుత్రులను నియోగించి యద్దానివెంట నని పెను. అంత నింద్రుఁడు మాయావేషధారియై యరుదెంచి, యాసవ నాశ్వమును హరియించి యద్దానిఁ గొనిపోయి, పాతాళలోక ములో తపోనిమగ్నతఁ దగిలియున్న కపలమునియాశ్రమము నందు విడిచిపుచ్చెను. గుఱ్ఱమువెంట బయలువెడలిన సగర పుత్రు లాగుఱ్ఱమునుగానక, భూలోకమందెల్లయెడల వెదకి వెదకి యద్దానిజాడ నరయనేరక పరితపించుచు పాతాళముఁ జొచ్చి యందు కపిలాశ్రమములోఁ దిరుగాడుచున్న యాసవ నాశ్వమునుగని, యద్దానినపహరించి తెచ్చినవాఁడు కపిలుఁడు గానెంచి యాతని దూషింపఁదొడంగిరి. అంతకపిలుఁడు క్రుద్ధుఁ డై యాయఱువేలసగరపుత్రులను శాపమొసంగి భస్మీభూతు లుగఁ గావించెను. అనంతరము, సగరవంశీయుఁడు భగీరథుఁడు ఘోరతపమొనర్చి గంగావాహినిఁ గొనితెచ్చి యాభస్మరాశు లపై ప్రవహింపఁజేసి తనపితరులకు సద్గతినొసంగెను.

8. జరత్కార మహర్షి.

జరత్కారుఁడు ఋషికులశేఖరుఁడు. బ్రహ్మదేవునకు సాటియగువాఁడు. ఊర్ధ్వరేతస్కుఁడు. తపఃపరాయణుఁడు. వేదాధ్యయనశీలుఁడు. పరిశుద్ధచిత్తుఁడు. సర్వసమర్థుఁడు. తీక్ష్ణవ్రతుఁడు. ధర్మజ్ఞుఁడు. బ్రహ్మచర్యవ్రతమూనినవాఁడు. ఉగ్రతపమును సలుపుటయందే యాసక్తుఁడైయుండును. ఆహారమునుమాని వాయువునే భక్షించుచు శరీరమును క్షయింపఁజేసి శల్యావశిష్టమొనర్చిన కతమున జరత్కారుఁడను నామమును బడసినవాఁడు. అతఁడొకప్పుడు ప్రొద్దుగ్రుంకినచోటే విడిసినట్టుగా భూమియంతయుఁ బ్రదక్షిణమొనరించెను. ఆ తపోనిధి సమస్తతీర్థములయందు తానమాడుచు, వాయుభక్షుఁడై శరీరమును శుష్కింపఁజేయుచుఁ దిరుగుచుండెను. అతఁడట్లు దిరుగాడుచు, నొకానొకప్పుడొక పెద్దపల్లమునందు తలక్రిందుగా నవురుగంటికొన నంటికొని వ్రేలాడుచున్న తన పితరులను జూచెను. ఆవ్రేలాడువారు తనపితరులని యెఱుంగక, జరత్కారుఁడు వారిచెంతకుం బోయి "ఈ పెనుపల్లమునందే యెప్పుడును దాగి నివసించుచుండిన మూషికమొకండు నాయవురుగంటివేళ్ల నన్నింటిని గొఱికివేయఁగా, దుర్బలమైనయీయవురుగంటికొనను బట్టికొని వ్రేలుచున్నారే! మీరలెవరు? ఈయవురుగంటుకు నొక్కవేరే మిగిలియున్నది. దానినిఁగూడ నీయెలుక కొఱికివేయుచున్నది. ఈవేరుకూడ పట్టుసడలియున్నందున నిదియును అచిరకాలములోనే తెగిపోవును. అపుడు మీరు తలక్రిందుగా నీపల్లమునందు నిశ్చయముగాఁ బడువారలగుదురు.

ఇట్లు తలక్రిందుగా వ్రేలుచు నుత్కట సంకట మనుభవించుచున్న మిమ్ములఁజూడ నాకు దుఃఖము మిక్కిలి గలుగుచున్నయది. మీకు నేను జేయఁదగిన యుపకార మేదియైన నుండిన యెడల నెఱిఁగింపుఁడు. నాతపస్సునంతను వెచ్చించియైన మీకు హితము సమకూర్చెదను. ఈవిపత్తునుండి కడతేరుట కిష్టముగల వారలగుదురేని జాగుసేయక చెప్పుఁ"డని యనియెను.

జరత్కారునిపలుకులు విని, యాతనిపితృదేవతలు "నీవు బ్రహ్మచారివై యున్నావు. మాకు హిత మొనర్చుటయెట్లు? మాయీసంకటము తపస్సుచేతఁ దొలఁగించుట కశక్యము. తపోధనా! తపోధనము మాకును గొంతఁగలదు. కలిగిన నేమి? సంతతి లేనివారలమగుటవలన పాపాత్ములఁ బోలె నరకకూపమునఁ గూలఁబడుచున్నారము. సత్తమా! మాకు ప్రాప్తమైన యీ సంకటముచేత మాబుద్ధిసన్నగిల్లినది. నిన్ను గుఱుతిడ నేరకున్నారము. నీవు మహానుభావుఁడవుగా నున్నాఁడవు. వృద్ధుఁడవుగా నున్నాఁడవు. మమ్ముఁ జూచి దుఃఖించుచున్నాఁడవు. కాఁబట్టి మాయుదంతమును వినిచెదము. వినుము. నాయనా! మేము దృఢవ్రతముగల యాయావరు లనఁబడుఋషులము. సంతతి కొఱవడుటకారణముగ పుణ్యలోకమునుండి జాఱి భూమికిఁ దలక్రిందుగాఁ బోవుచున్నారము మాకు సంతతి లేనందున మా తపస్సంతయు వ్యర్థమైపోయినది. భాగ్యహీనులమగు మాకు నభాగ్యుఁడొకఁడు సంతతికి మిగిలియున్నాఁడు వాఁడు నుండియు లేనివాఁడుపోలెఁ దపమునొక్కటినే గైకొనియున్నాఁడు వాఁడు జరత్కారుఁడని పేరొందినవాఁడు. వేదవేదాంగవిదుఁడు. విజితేంద్రియుఁడు. మహాత్ముఁడు. నియమవ్రతుఁడు. మహాతపస్వి. వాఁడు తపస్సునందేయాసక్తుఁడై మమ్ముల నీవిపత్తునకుఁ దెచ్చిన

వాఁడు. మహాభాగా! మాకు వాఁడు నాథుఁడై యుండియున్నప్పటి
కిని, మేము పుణ్యహీనులవలె యనాథులమై యీపల్లమున వ్రేలు
చున్నారము. సంతతిలేని మనుజు లెంతటి పుణ్యవంతులైననేమి,
వారలకు స్వర్గమందు వసతి దొరకదు. మాకు జరత్కారుఁ డొక్క
రుఁడు నాథుఁడై యున్నవాఁడు. కాఁబట్టి, దయాళూ! నీవు
వానిని జూచినయెడల 'నీపితరులు దీనులై పుణ్యహీనులై పెను
పల్లమునందుఁ దలక్రిందుగా వ్రేలుచున్నారు. పెండ్లిచేసికొనుము
సంతతిని బుట్టింపుము. అట్లు చేయుదువేని వారలు సద్గతికులగు
దురు. లేనిచో దుర్గతికు లగుదురు.' అని వానితోఁ జెప్పుము.
బ్రాహ్మణోత్తమా! మాకులమునకు ఆజరత్కారువు అను
నొంటితంతువే మిగిలియున్నయది మాకుఁ బట్టుగా నీవు
చూచెడి యీ యవురుగంటయే మాకులముగంటు ఇది మాకుల
మును బెంపొందించునదై యున్నయది. ఈగంటునకుఁ గల
వేళ్లనుజూచుచున్నావే ఇవియే మాకులంపుఁదంతువులు. ఇవియే
కాలునిచే భక్షింపఁబడినవి. దీనివేరొకటి సగము భక్షింపఁబడి
యున్నదానిని, మేము బట్టుకొని వ్రేలుచున్నదానిని నీవు చూచు
చున్నావే, ఇదియే తపమునే వ్రతముగాఁ జేఁబట్టియున్న జర
త్కారుఁడు. నీవుచూచుచున్న యెలుకయే దుర్జయుఁడగు
కాలుఁడు. ఆకాలుఁడు, తపమునందే స్థిరచిత్తుఁడై మతిమాలి
యున్న జరత్కారుని బీడించుచు క్రమక్రమముగా క్షీణింపఁ
జేయుచున్నాఁడు. ఇట్లు మూలము దెగి పుణ్యలోకమునుండి
జాఱి, మతిమాలియున్న మమ్ము వాఁడు తాను జేసిన యాతపస్సు
చేత నీవిపత్తునుండి దాటింపఁజాలఁడు. వాఁడును కాలమాపన్న
మగుఁడు, మావలెనే కాలపీడితుఁడై యిందుఁ బడి నరకమును
బొందఁగలవాఁడగును. నాయనా! తపస్సుగాని, యజ్ఞముగాని,

తపింతనపవిత్రకర్మములు గాని సంతతికి సాటిగాఁజాలునవిగావని సజ్జనులమతము. మహాశయా! నీవాజరత్కారునిఁ జూచి చెప్పుము. మఱువకుము. నీవిక్కడఁ జూచినదంతయు సవిస్తర ముగ వానికిఁ జెప్పుము. వాఁడు మాకు నాథుఁడుగా నున్నాఁడు. కాఁబట్టి, యెట్లు చెప్పిన వాఁడు పెండ్లి చేసికొని సంతతినిబుట్టిం చునో, యట్లే మమ్ము నీబంధులముగా నెంచి మామేలుకొఱకు వానికిఁ జెప్పవలయును. సత్తమా! బంధువుఁబోలె మమ్ముఁజూచి యిట్లు దుఃఖించుచున్నావే; నీవెవ్వఁడవు? నీవు మాకేమి కావల యును! వివరింపుము? విన గోరుచున్నా"మని బలికిరి.

జరత్కారుఁడు పితరులమాటలు విని, మిక్కిలి దుఃఖ తుఁడై, డగ్గుత్తికఁ గొని వారిఁ జూచి "మీరు నాపూర్వజులైన పితలును, పితామహులును నై యున్నవారు ఇపుడు, నేను మీహితముఁగోరి యేమి చేయవలయునో చెప్పుఁడు నేనే మీ వంశధరుఁడను అయోగ్యుఁడను. జరత్కారుఁడను. మతి మాలి పాపకర్ముఁడనై యున్ననాకు మీరుచితదండమును విధిం పుఁడు "అని చెప్పెను. అందులకుఁ జరత్కారునిపితరులు "వత్సా! నీవు యాదృచ్ఛికముగ నిచ్చటకు వచ్చుట మాభాగ్యమేను. నీ వెందులకు వివాహము చేసికొనమానితివో చెప్పుము నీవు వివాహము చేసికొని సంతానమునుబడయుటయందు మనస్సుం పుము. నీవు పుత్రవంతుఁడవగుదువేని మేము ఈదురవస్థనుబాసి నిశ్చింతతో స్వర్గసుఖమనుభవింపఁ గలవారమగుదు"మని యనిరి. అందులకుఁ జరత్కారుఁడు, "పితరులారా! నేను ఊర్ధ్వరేతస్కుఁ డనై బరలోకమును బొందవలయునని నిశ్చయించుకొనియు న్నాఁడను. అందువలన వివాహము చేసికొనుటలేదని నామన మును గుదురుపఱచుకొని యుంటిని. పితరులారా! మీరు

కుడుచుచున్న యీవెతఁజూచియే బ్రహ్మచర్యమునుండి నామన సుఁద్రిప్పికొంటిని. మీరుకోరినకార్యమును జేయుచున్నాను. నేను, నా సుఖముకొఱకుఁగాని, జీవనముకొఱకుఁగాని, భార్యనుగాని, ధనమునుగాని సంగ్రహించుటకు యత్నమొనరింపను. కాని, మీకు హితమొనర్చుటకుఁగాను, మీకు పారలౌకికసుఖ మొడఁగూర్చుటకుఁగాను వివాహ మవశ్యముచేసికొనెదను. అయినను, నేను జేపట్టుకన్య నాపేరుగలదిగానుండవలయును. దానిబంధువులు తామై నాకాకన్యను, స్వేచ్ఛాపూర్వకముగ, భిక్షస్వరూపముగ, నిచ్చుటకు సిద్ధముగాఁ బెట్టికొనియుండవలయును. అట్టికన్య నాకు నెప్పుడు లభించినను దానిని నేను వివాహము చేసికొనెదను; కాని, నేను దానిని బెట్టికొని కాపాడను. ఇట్టివివాహము దొరకొన్నయెడ జేసికొందును లేనియెడఁ జేసికొనను. ఇది నిజము.” అని వారితోఁ జెప్పి, వారియనుమతిఁబడసి, అట్టికన్యను వెదకుటకు బయలువెడలెను.

జరత్కారుఁడు, వివాహమునకై భార్యఁగోరి భూమి యంతయుఁ దిరిగెను; కాని, యట్టిభార్య యలవడినది గాదు. అంత నాతఁడు నిర్వేదమును బొందుచు, నొక నిర్జనవనములోని కేగి, పత్నీప్రాప్తికొఱకు భగవంతునిఁ బ్రార్థించుచు, “నేను కన్యాభిక్షను వేడుచున్నాను. ఇందుగలస్థావరములు, జంగమములు, దృశ్యాదృశ్యులగు దేవతలు నేనుజెప్పునది విందురుగాక! దుఃఖార్తులై యున్న పితరులు, తపోనిరతుఁడనై యున్న నన్ను, సంతతిఁ గలిగించుటకై వివాహము చేసికొమన నాజ్ఞాపించియున్నారు. వివాహమునకై కన్యాభిక్షఁగోరి భూమియంతయుఁ దిరిగితిని. నేను దరిద్రుఁడను. కష్టపడుటయే స్వభావముగాఁ

గలవాఁడను. అంతటను దిరిగితిరిగి యలసియున్న వాఁడను. నాపలుకుల నాలించినవారిలో నేరికైన కన్యయుండియున్న యెడ, వారాకన్యను నాకిత్తురుగాక, ఆకన్య నా పేరుగలదై నాకు భిక్షవలె నొసంగుటకు నుంచుకొన బడినదై యుండవలయును. నేను దానిని కాపాడనవసరములేనిదిగా నుండవలయును. అట్టికన్యకను నాకొసంగుఁడు" అని మహర్షి బిగ్గరగా నఱచెను.

సర్పరాజు వాసుకి, మాతృశాపమునుండి, సర్పకులమును సంరక్షించుటకునై, తనసోదరిని, జరత్కారయను పేరుదానిని, జరత్కారున కిచ్చి వివాహము చేయుటకు కాచికొనియుండెను. ఆతఁడు జరత్కారునిపలుకులనాలించి, సాలంకృతయగు తన సోదరిని వెంటనిడుకొని యడవియందున్న యాజరత్కారు కడకుఁ బోయి యాతనికాకన్యను భిక్షనుఁబోలె సమర్పించెను. అంత నామహర్షి వాసుకివలన నాకన్య పేరు జరత్కారువని, తప స్సుతోఁ గూడినదని తెలిసికొని, "నేను దీనినిబోషింపను. నాకు నిష్టముకానిదానిని, యిదిచేయఁగూడదు. చేసినయెడ నేను దీనిని దిగవిడుతును. ఇదియే నేఁజేసియున్న సమయము." అని చెప్పెను. అప్పుడు వాసుకి, జరత్కారుమహర్షిఁజూచి "నేను నా సహోదరిని బోషించుకొనియెదను" అని ప్రతిజ్ఞ చేసెను. అంతట జరత్కారుఁడు, నాగరాజుగృహంబునకుఁ బోయి విధ్యుక్తముగా నాకన్యను పాణిగ్రహణము చేసికొనెను. అనంతరము తనయిల్లాలినిఁ జూచి "నీవు నాకిష్టముకానిదానిని యెన్నఁడుగాని చేయరాదు. చెప్పరాదు. అప్రియమును జేసినపుడు నిన్నును నీయింటినిఁగూడ దిగవిడుతును. నేను జెప్పినయీమాటను గ్రహించుకొనుము." అని సమయము చేసెను. పతివ్రత

యగుజరత్కారువు. ఆసమయమునువిని మిగులభయముపొంది యెంతయుదుఃఖమున నతనిఁజూచి 'అట్లనే కానిండు' అనిపలికెను. జరత్కారుమహర్షి ధర్మపరాయణయగు జరత్కారువును భార్యగాఁ బడసి అత్యంత ప్రసన్నుఁడయ్యెను. జరత్కారువు ప్రాణపణముగఁ బతిసేవఁ జేయుచు, కొంతకాలమునకు గర్భవతియయ్యెను. ఆగర్భము శుక్లపక్షచంద్రునిఁ బోలె వర్ధిల్లసాగెను. ఇట్లుండ నొకనాఁడు తపశ్శాలియగు జరత్కారుమహర్షి క్లాంతివివశుఁడై, తనభార్యయొడియందుఁ దలయిడి నిదురఁబోయెను. అట్లు నిద్రించునపుడు, సూర్యుఁ డస్తంగతుఁడయ్యెను. కాని, యాతఁడు మేల్కొనుజాడ పొడసూపకుండెను. అప్పుఁడావాసుకిచెల్లెలు ధర్మముచెడునేయని భయపడి 'నేను భర్తను లేపుట ధర్మమగునో కాదో; లేపితినేని యితని కపరాధము చేసినదాన నగుదును. దాన నితనికి నిశ్చయముగా కోపము గలుగును. లేపకపోవుదునేని, సంధ్యాకాలము గడచిపోవును; దాన నీతనిసంధ్యావందనాది సాయంకాలకృత్యములకు విఘ్నమాపాదించినదాన నగుదును. అందువలన ధర్మమునకు లోపము వాటిల్లును. ఈ రెంటిలో నితనికోపముకంటె ధర్మలోపమెక్కుఁడు' అని నిశ్చయించి, యాపతివ్రత నిద్రితపతిని మేలుకొలిపి "మహాభాగా! లెమ్ము. సూర్యుఁ డస్తమించుచున్నాఁడు. జలములు సిద్ధముగానున్నవి ఆచమించి నియమానుసరణముగ సంధ్యనుపాసింపుఁడు. ఇదెయగ్నిహోత్రము. ఈముహూర్తము ధర్మసాధనమగుటకారణముగ రమణీయముగను, భూతాదిప్రభావమువలన భయంకరముగను నొప్పుచున్నయది. పడమటిదెస సంజవర్తిలుచున్నది." అని చెప్పెను. ఇట్లు చెప్పఁగా, జరత్కారుఁడు రుష్టుఁడై, భార్యఁజూచి, "నాగకన్యకా! నేను నిదురించుచుండఁగా సూర్యుఁ

దస్తంగతుఁడగుటకు శక్తుఁడుగాఁడని నానిశ్చయము. నీవు,
నేను క్లాంతివివశుఁడనై నిద్రించుచుండ నన్ను లేపి నాకిట్లు
అవమానమొనరించితివి. అవమానము పొందినపిమ్మట నిచట
నుండుట నాకు రుచియింపదు. ఇక నీదాపున నుండనొల్లను.
నేనిదె వచ్చినదారినే పోయెదను. నేను వెడలిపోయినపిదప నీవు
శోకము నొందుచుండరాదు." అని యనియెను. అంత వాసుకి
సోదరి, శోకదుఃఖములకు లోనై కన్నీరుమున్నీరుగా నేడ్చుచు,
డగ్గుత్తికతో, "ప్రాణనాథా! నేను మిమ్ము నవమానింపనెంచి మేలు
కొలిపినదానను గాను. మీకు ధర్మలోపము కలుగకుండవలయు
నని నేనిట్లు చేసితిని. నీవు ధర్మములన్నియుఁ దెలిసినవాఁడవు.
ధర్మమును దప్పనిదాననై యెప్పుడును నీకు హితమొనర్చుట
యందే యాసక్తిగలిగియున్న నన్ను ఏతప్పునెఱుఁగనినన్ను ధర్మ
మును ఎంతమాత్రమును దప్పకుండు నీవు దిగవిడుచుట ధర్మము
గాదు. నన్ను మన్నింపుము. ఇఁక నేనేతప్పిదమును జేయను." అని
యాతపస్విని బహుతెఱఁగులఁ బ్రార్థించెను; కాని, కోపసమా
విష్టుఁడై యున్న యాతపస్వి తనభార్యను, ఇట్లు విహ్వలహృద
యయై ప్రార్థించుచున్నదానిని దిగవిడిచి పోవఁగోరి, "నాపలుకు
అబద్ధముగాదు. నేను పోయెదను. సుందరీ! అగ్నిహోత్రమునకు
పాటియై, ధర్మవిదులలో మేటియై, వేదవేదాంగపారగుఁడై,
మహాతపస్వియై పరఁగుపుత్రుఁడు నీకుఁ బుట్టఁబోవుచున్నాఁడు.
ఆతనివలన నీకును నీదాయాదులకును మేలుసమకూడు." నని
చెప్పి, మరల నుగ్రతపముసేయ నిశ్చయించి యచ్చోటుబాసి
పోయినవాఁడయ్యె. భర్త చనినయనంతరము వాసుకిచెల్లెలు
జరత్కారు యొకపుత్రునిఁ గనియెను. ఆతఁడు గర్భమందుండి
నపుడే యతనితండ్రి అస్తి(ఉన్నాఁడు)అని చెప్పి యడవికి పోవుట,

చేత, నాపుత్రునికి 'ఆస్తీకుఁ' డని యాతనితల్లి పేరిడియెను. మేనల్లుఁడు పుట్టెనని వినినంతనె వాసుకి యానందభరితుఁ డయ్యెను ఆపుత్రుఁడు వాసుకిగృహమునందె పెరిగి యథాసమయమున నుపనయనసంస్కారమును బడసి భృగునందనుఁడైన చ్యవనునియొద్ద వేదవేదాంగముల నధ్యయనము చేసెను. ఆతఁడు పిన్ననాఁడే మంచిబుద్ధియు, శాంతియు, సుగుణసంపత్తియుఁ గలవాఁడై బ్రహ్మచర్యవ్రతమును జరపిపుచ్చెను ఇట్లు జరత్కారుఁడు పెద్దయుఁగాలమునకు బరిణయమై, ఆస్తీకుఁడను పుత్రునిఁ గని యుత్తమమయినధర్మము నాచరించి, పితరుల నుద్ధరించి, తనపితరులతోఁ గూడఁ దాను స్వర్గమునకుఁ బోయెను. ఆస్తీకుఁడు తపోయజ్ఞాది కర్మములు చేసి దేవతలను, బ్రహ్మచర్యవ్రతమును వేదాధ్యయనమును సలిపి ఋషులను, పుత్రసంతతిని బడసి పితరులను తృప్తిపఱచినవాఁడయ్యెను.

ఆకాలమున జనమేజయుఁడను రాజు సర్పయజ్ఞమును జేయఁదొడంగెను. యాజ్ఞికు లుచ్చరించుమంత్రముల ప్రభావమువలనఁ బ్రతిదినమును లక్షలకొలఁదిసర్పములు, యజ్ఞకుండమునఁబడి భస్మముగాఁజొచ్చెను ఇట్లు నాగములు యజ్ఞకుండమున నెడతెగకపడుచు భస్మమగుచుండుట కారణముగ తనకులమువారు కొలఁదిమందిమాత్రమే మిగిలియుండుటఁగని వాసుకి మిక్కిలియు వెతగుందుచు, వారినైన కాపాడి కులమును సంరక్షించుటకుఁగాను, తన మేనయల్లుని ఆస్తీకుని జనమేజయునియాగశాల కనిపెను.అట్లు మాతులనియుక్తుఁడై యాస్తీకుఁడు యజ్ఞశాలకరుదెంచి రాజును బలువిధముల బ్రస్తుతించి ప్రసన్నునిఁగావించెను. రాజును ఆస్తీకుని విధ్యుక్తముగఁ బూజించి సుఖాసీనుఁగావించి వరమును గోరుమని హెచ్చరించెను.

ఆ స్త్రీకుఁడు యజ్ఞశాల కరుదెంచునంతకు, సర్పములు లెక్క కెక్కుడుగ యాగాగ్నికాహుతులై భస్మీభూతము లయ్యెను; గాని, జనమేజయునిదండ్రిని, పరీక్షిత్తుని ప్రాణముల నపహరించిన తక్షకుఁడు సజీవుఁడై యుండెను. ఆతనినాహుతునిఁ గావింపకుండ నాతనిమనస్సు శాంతినొందకుండెను. అందువలన నాతఁడు ఋత్విక్కులఁజేరి, "మంత్రవిదులారా! నా తండ్రిఁజంపినపాపాత్ముఁడు తక్షకుఁడే నాకు విరోధి. ఆతఁడింకను సప్రాణుఁడై యున్నాఁడు. ఆతని సశీఘ్రముగ విగతప్రాణునిఁ జేయుటకు మీశక్తినంతయుఁ బ్రయోగింపుఁడు" అని పలికెను. అంపులకు ఋత్విజులు 'మహారాజా! ఆక్రూరుఁడు, తక్షకుఁడు భయకంపితుఁడై యింద్రునియొద్ద నున్నాఁడు. ఆతని నగ్నిహోత్రున కాహుతియొసంగుట యనునది సహజమైనపని కాదు." అని బదులొసంగిరి. అపిని, యాగదీక్షితుఁడు జనమేజయుఁడు "ఇంద్రునితోఁగూడఁ దక్షకుని నగ్నికాహుతి యిడుఁడు. తక్షకు నెంతమాత్రము విడువరాదు." అని హోతలను హెచ్చరించెను. హోతలును, కడునిష్ఠులై "ఇంద్రుఁడును దక్షకునితోఁగూడియే యగ్నియందుఁబడుగాత"మనిహోమముఁ జేసిరి. అంతఁ దక్షకునితోఁగూడ నింద్రుఁ డరుదెంచి, యా యజ్ఞమును జూచి మిక్కిలిగ భయకంపితుఁ డయ్యెను. అందువలన నాతఁడు తక్షకునిఁ బరిత్యజించి నిజగృహంబునకు మరలినవాఁడయ్యెను.

ఇంద్రుఁడు మరలిపోయినపిమ్మట తక్షకుఁడు, హోతల యమోఘమంత్రశక్తిచేత బద్ధుఁడై, స్వాధీనతఁదప్పి, వివశుఁడై, స్వర్లోకమునుండి యవతీర్ణుఁడై యజ్ఞకుండ సమీపమున కరుదెంచుచుండెను. ఆ ట్లరుదెంచుచుండెడి తక్షకునిఁ జూచి,

యాస్తీకుఁడు, మార్గమధ్యమం దాతని నిలువరించి, రాజు దిక్కు మొగమై, "రాజా! నీవు నాకు వరమీయ నిచ్చఁగొని యున్నవాఁడ వయితివేని, నీయీ యొనర్చుసర్పయాగ మింతటితో నిలుచుఁగాత! ఇందు సర్పములు మడియకుండుఁగాత! ఇదియే నేఁగోరుకొనువరము. ఇందువలన నాతల్లివంశమునకు మేలు సమకూరును. నీకు శుభముకలుగును." అని యనియెను. అంతట జనమేజయుఁడు బ్రాహ్మణానురోధమును ప్రతిఘటించుట ధర్మవిరుద్ధము, పాపమూలము, అని తలంచి, యందుల కియ్యకొన నేరక, 'వల్లె' యని పలుకుచు, సర్పయాగము నసంపూర్ణముగఁ బరిసమాప్తమొనరించి, యాస్తీకుని హర్షచిత్తునిఁగావించెను.

ఆస్తీకుఁడు, జనమేజయుని సర్పయాగమున దహనోన్ముఖులగుచున్న తక్షకాదిసర్పముల నట్లు మరలించి, వారలకు ప్రాణరక్షణమొసంగి, వారికులమును పెంపొందఁజేసి, రాజు మన్ననలఁగొని నిజగృహంబునకు జనుదెంచి, తల్లికిని, మామకును, జరిగినయుదంత మాద్యంతమెఱిఁగించెను. సర్పము లా సమాచార మాలించి యానందాంబుధి నోలలాడుచు ఆస్తీకునకు "నీనామమును జపించువ్యక్తులకు సర్పభయము కలుగ నేర"దని వరమొసంగి, యాతని బహువిధములఁ బ్రస్తుతించెను. అనంతర మాస్తీకుఁడు, మేనమామగృహమున నివసించుచు, సర్పములచేతఁ బూజలుగొనుచు, యథాసమయమునఁ బరిణీతుఁడై పుత్రోత్పాదన మొనర్చి, పితౄణముక్తుఁడై, పిమ్మట తపోనిరతుఁడై విష్ణులోకమును బడసినవాఁడయ్యెను.

---

9. చ్యవనమహర్షి.

చ్యవనుఁడు భృగుమహర్షి పుత్త్రుఁడు. ఆతనిజన్మవృత్తాంతము కడువిచిత్రము. భృగుఁడు బ్రహ్మమానసపుత్త్రుఁడు. వరుణ యాగమందు యజ్ఞకుండమునుండి పుట్టినవాఁడు. ఆతఁడు త్రిలోకసుందరియు, సుగుణఖనియు, ధర్మనిరతయు నగు పులోమయను దైత్యరాజగు వైశ్వానరునికూఁతును విధ్యుక్తముగ వివాహముచేసికొని యామెయందనురక్తుఁడై యుండెను. పులోమ, సుఖసంభోగములను బరిత్యజించి, పతిసేవాపరతంత్రురాలై యొప్పుచుండెడిది. కొంతకాలమున కామె గర్భము ధరించెను. ఆమె గర్భవతియైయుండినకాలమం దొకనాఁడు భృగువు స్నానార్థము బయిటకుఁ బోయియుండెను. ఆ సమయమునఁ బులోమ యొంటిపాటుగ నాశ్రమములో నుండెను. అపుడు పులోమ యను రాక్షసుఁ డా యాశ్రమము లోనికి వచ్చెను. అట్లాశ్రమములోని కతిథియైవచ్చిన యా రక్కసునకు భృగుపత్ని యాతిథ్యమొసంగి కందమూలఫలంబుల నాహారమిడి సత్కరించెను.

భృగుపత్ని, పులోమ, పసిబాలికగా పితృగృహమున నున్నకాలమం దొకనాఁడు యేడ్చుచుండఁగా, నాయేడుపును మానుపునిమిత్తమా పెతండ్రి వైశ్వానరుఁడు ఆ పెకు భయముఁ గొలుపుచు, "ఓరీ! రాక్షసా! ఈపిల్ల యేడ్చుచున్నది. కాఁబట్టి, దీనిని బట్టుకొనిపొమ్మ"ని బిగ్గరగాపలికెను. ఆయలుపు నాలించి పులోమయనురాక్షసుఁడు, వైశ్వానరగృహంబున కరుదెంచి, "ఈకన్యను నేను వరించితిని. ఇది నాభార్య"యని చెప్పి

పోయెను. పిమ్మట నాబిడతండ్రి యామెను భృగుమహర్షి కొసంగి, విధ్యుక్తముగ, నగ్నిసాక్షికముగఁ బరిణయ మొనరించెను. పరిణయానంతరము పులోమ భృగుమహర్షితోఁగూడ నాశ్రమవాసమొనర్చుచు గర్భవతియైయుండుతఱి నొకనాఁడు, మహర్షి యింటలేనిసమయమున నారాక్షసుఁ డాశ్రమమున కరుదెంచి యామెవలన నతిథిసత్కారములు వడసినవాఁడయ్యెను.

అట్లాశ్రమమున కరుదెంచి భృగుపత్నిచే పూజితుఁడైన యారక్కసుఁడు, పూర్వపరిచితయగు నాసుందరాంగి నొంటఁబె యినుండుటఁజూచి, కామపీడితుఁడై యుబ్బిగొని, యాచెలువఁగొనిపోవ మదినెంచెను. గాని, మున్ను తావరియించియున్న పులోమ యీపులోమ యగునా, కాదా యనుసంశయమొందాతనిహృదయమునఁ బొడసూపెను. అంత నాతఁడు సంశయనివారణార్థము, అగ్నిహోత్రశాలయందు ప్రజ్వలితుఁడగుచున్న జ్వాలనునిఁ జూచి "ఇది మున్నెవనిచేత వరియింపఁబడినది? మొదట నెవనిభార్యయైనది సత్యమడుగుచున్నాను. యథార్థమును చెప్పుము. నేనుగదా మొదట నీవరవర్ణిని భార్యగా వరియించినవాఁడను. పిమ్మట మాటనిలుకడలేని దీనితండ్రి ధర్మమును బోఁద్రోచి, దీనిని భృగువున కొసంగినవాఁడు ఈసుందరి నాభార్యయైయుండఁగా భృగువు దీనిని బొందినపక్షమున నదినాకెంతయు సమ్మతముగాదు. నేనోర్వఁజాలను. నాహృదయము దహించుచున్నట్లున్నది. కాన, దీనినిప్పుడే కొనిపోయెదను" అని పలికెను. అంతట నగ్నిదేవుఁడు కడుదుఃఖితుఁడై సత్యమును జెప్పితినేని నన్ను భృగుమహర్షి శపియించును. అసత్యమును జెప్పితినేని అనృతదోషము నన్ను వరియించును" అని భృగుశాప

మునకును అపత్యదోషమునకును భయమొందుచు "రాక్షసే శ్వరా! ఈపులోమ మొదట మాటవరుసకు నీకొసంగఁబడినది. అదికారణముగ నీవు వరించినయది. అయినను మంత్రయుక్త ముగా నీవు వరింపలేదు. పిమ్మట దీనితండ్రి దీనిని భృగువున కొసంగినాఁడు. భృగువు నన్ను సాక్షిగా మున్నిడుకొని విధిపూ ర్వకముగ మంత్రయుక్తముగ వివాహము చేసికొనెను. ఇట్టీ పెను భృగుభార్యగా నెఱుంగుచున్నాను. నే నసత్యమును జెప్పనొల్లను."అనిచెప్పెను. అగ్ని చెప్పినది విని యారక్కసుఁడు, ముద మొందుచు, పందిరూపమును దాల్చి వాయువేగమనో వేగముల నాసుందరాంగిని బట్టుకొనిపోయెను. అంత పులోమ గర్భస్థుఁడై పెరుగుచున్న బాలుఁడు ఆనిశాచరుని సంరంభము నకు ననుచితవర్తనమునకుఁ గుపితుఁడై రోషమున తల్లిగర్భము నందుండి చ్యవనుఁ(చ్యుతుఁడు. జాఱినవాఁడు) డయ్యె. అందు వలన నాబాలుఁడు చ్యవనుఁ డను పేరుగలవాఁ డయ్యెను. తల్లి కడుపునందుండి చ్యుతుఁడైన యాబాలుఁడు ప్రళయకాలసదృ శుఁడై ప్రజ్వాలజ్వాలాసన్నిభములైన రూక్షేక్షణముల నా రక్కసునిపైఁ బాఱఁజేసెను. ఋషికుమారుని క్రోధాగ్ని కా రా క్షసుఁ డింధనమై యాక్షణముననే పులోమను విడిచి నేలఁబడి భస్మీభూతుఁడయ్యెను. అంతట పులోమ, భృగుకులానందకరుని, నవజాతకుమారుని, చ్యవనుని దీసికొని దుఃఖమును మిక్కిలిగఁ బొందుచు నాశ్రమమునకుఁ బోయెను. ఆసమయమునఁ బితా మహుఁడు హిరణ్యగర్భుఁ డుపస్థితుఁడై యేదోషమును బొందని భృగుపత్నిని, కన్నీరుమున్నీరుగా రోదనము చేయుచున్న శీల వతిని, తనకోడలిని పులోమను నూరార్చెను. ఆచెలువ కన్నీటి ధారచే నుప్పతిల్లిన పెద్దనదిని, ఆబిడ పోయినమార్గము ననుస

రించి ప్రవహించుచున్న దానిని జూచినవాఁడాయెను. బ్రహ్మ తనవధువు (కోడలి) మార్గ మనుసరించి యాశ్రమమునకు దాపుగాఁ బోవుచున్న యానదికి 'వధూసరము' (వధువుతోడఁ బోయినది)అని పేరిడి యంతర్హితుఁడయ్యెను. భృగుపుత్త్రుఁడును తపఃప్రతాపుఁడును నగు చ్యవనుఁ డిట్లు పుట్టినవాఁడాయెను.

అనంతరము,భృగుమహర్షి యాశ్రమమునకు వచ్చి నవజాతపుత్త్రుని:చ్యవనునిఁ గాంచెను. ఉదంతమాద్యంత మెఱింగెను. పిదప నాతఁడు భార్యఁ జూచి కోపముగొని, "నిన్ను రాక్షసుఁ డెఱుఁగనే యెఱుఁగఁడు.నిన్ను వాని కెఱుఁగించినవాఁ డెవఁడు? చెప్పు"మని యడిగెను.అందులకు పులోమ,"మహాత్మా! ఆర్యపుత్త్రా! నన్నారక్కసున కగ్ని యెఱిఁగించెను. అందువలన నాతఁడు, నన్ను కురరియుంబోలెఁ గూయిడుచుండ, నిర్దయుఁడై యెత్తికొనిపోయెను. అట్లు నన్ను వాఁడెత్తికొని పోవుచుండఁగా, నీపుత్త్రుఁడు కుక్షినుండి జాఱి వానిని నీఱుగావించి, నన్ను రక్షించెను." అని చెప్పెను. మొదలే కోపియగు భృగువు, పులోమ చెప్పినదివిని, మిక్కిలి కోపియై: యగ్నిఁ జూచి, "నీవు సర్వమును భక్షించువాఁడ వగుదువుగాక" యని శపించెను.

అనంతరము భృగుమహర్షి చ్యవనువని, జాతకర్మాది సంస్కారముల సంస్కృతునిఁ గావించెను. ఋషికుమారుఁడు చ్యవనుఁడు, శుక్లపక్షచంద్రునింబోలె వృద్ధినొందసాగెను. వయ యానుసరణముగ నుపనయనసంస్కారమును బడసెను. ఉపనయనానంతరము బ్రహ్మచర్యవ్రతదీక్షితుఁడై వేదశాస్త్రముల నధ్యయన మొనరించెను. పిమ్మట నొక సరోవరతీరమందు తపస్సు చేయుటకు ప్రవృత్తుఁడయ్యెను. ఆతఁడు స్థిరాసనస్థుఁడై చిరకాలము తపోనిరత నొప్పియుండుటకారణముగ, నాతని శరీ

రము తృణలతావృతమై, వల్మీకాచ్ఛాదితమై, యేరికినిఁ జూడ రానిదై యుండెను ఇట్లు, చ్యవనుఁడు దృఢసమాధిస్థుఁడై యుండుతఱి ననేకసంవత్సరములు గడచినవయ్యెను. అంతట నొకనాఁడు శర్యాతిమహారాజు, సహధర్మిణితోను, కన్యకతోను విహారోత్సుకుఁడై చ్యవనుఁడు తపంబుసలుపుచున్న సరోవరతీరస్థారణ్యమునకుఁ జనుదెంచెను. ఆసమయమున ననన్యరూపలావణ్య, రాజకన్య, సుకన్య వనసౌందర్యముఁ గనుచు, నిటునటు పరిభ్రమించుచు చెలికత్తెలతోఁగూడ భృగునందనుఁడున్న యెడ కరుదెంచెను. అంతట నాయలోకసామాన్య సుందరీరత్నమును జూచి, చ్యవనఋషి ముగ్ధహృదయుఁడై యామెతో మాటలాడుటకు మనసుఁగొని యామెను బలుకరింపఁజొచ్చెను. చిరకాలమునుండి నిష్ఠురతపోనిరతుఁడై శుష్కభూతుఁడై యున్న యాఋషి కంఠస్వనము సుకన్య కర్ణపుటముల నలంకరింప నేరనివయ్యెను. అట్లు చెలులతో పరిభ్రమించుచున్న సుకన్య, వల్మీకస్థూపములోనుండి మిణుగురుపురుగులవలె మెఱయుచుఁ, గానవగుచున్న యామునికన్నులఁగని యందు కౌతూహలవశమున కంటకములఁ గ్రుచ్చెను. అంతట చ్యవనుఁడు నేత్రవ్యథితుఁడై, రాజపరివారమును, మలమూత్రబద్ధమునుకలిగి కడుపుబ్బురోగముచేత పీడితమగునటుల శపియించెను. తత్ప్రతికారము రాజసైనికులు రోగపీడితులైరి. అట్లు సైనికులెల్లరు నొక్కపరి నొకేరోగమునకు పాలగుటఁజూచి, రాజు శోకమునకును ఆశ్చర్యమునకును లోనై "మీలో నేరైన మహర్షి భార్గవున కేదైన యపరాధమును సలిపియున్నారా" యని వారల నడిగెను; కాని, వారిలో నపరాధమును స్వీకరించినవారెవరును లేరైరి. అంతట రాజకన్య సుకన్య జనకుఁ జేరి, "తండ్రీ!

నేను వల్మీకస్థూపమధ్యమున మెఱయుచుండు రెండువస్తువులను జూచి, యావస్తువులను ముండ్లతోఁ బొడిచితిని." అని చెప్పెను. రాజకన్య చెప్పినది చెవి సోఁకినంతనే శర్యాతిమహారాజు తపోనిరతుఁడగు భృగునందనుని చెంతకరిగి, ముకుళిత కరకమలుఁడై వినీతభావమున "దేవా! నాపుత్త్రిక యజ్ఞానవశమున మీకొసంగినకష్టమును క్షమించి రక్షింపుఁ"డని ప్రార్థించెను. అందులకు చ్యవనుఁడు "మహారాజా! నీపుత్త్రిక రూపయౌవనములచేత మదమత్తయై నాకవమానమును సలిపినయది. అంతియ కాదు. నాకన్నులలో కంటకములఁ దూర్చి, నన్ను నేత్రవ్యథకుఁ బాలుగావించినయది. కాఁబట్టి, నీవు నాకాకన్యను సమర్పింపవలయును. ఆరూపవతి నన్నుఁ బతిగాఁ జేకొనవలయును. అట్లు సేయుదురేని నీసేన కారోగ్యము కలుగఁగలదు. ఇదియే యుపాయము. తదన్యమగు నుపాయము వేఱొండు గానరాదు." అని చెప్పెను. అంతట శర్యాతి తనకన్యఁ దోడ్కొనితెచ్చి మహర్షి కిసమర్పించి, యాతనిని ప్రసన్నునిఁగావించి, నిజరాజధానికి మరలఁజనియెను. రాజకుమారి సుకన్య హర్షచిత్తయై, నిరంతరము తపోనిరతుఁడగు పతిని దైవముగఁ బరిగణించి, శుశ్రూషలఁ జేయుచు, అతిథిసత్కారాదికృత్యములను నిర్వహించుచు నాశ్రమవాసమును సలుపఁజొచ్చెను.

అంత కొంతకాలమునకు అశ్వికుమారు లిరువురును చ్యవనాశ్రమమున కరుదెంచిరి. వారు లావణ్యవతియగు సుకన్యను జూచి, "యో దేవీ! నీవెవతవు? ఎవనిభార్యవు? ఈవనమున కేల యరుదెంచితివి? మాకు నెఱిగింపఁదగునేని సవిస్తరముగ నెఱిఁగింపుము." అని పలికిరి. అందులకాబిడ "నేను శర్యాతిపుత్త్రికను

భృగునందనుఁడును మహాత్ముఁడును నగుచ్యవనఋషివరేణ్యుని భార్యను." అనిచెప్పెను. అంతట నశ్వికుమారులు, "కళ్యాణీ! ఈవనమందు సౌదామినింబోలె వెలుఁగొందుచున్న నిన్ను నీ తండ్రి యీవృద్ధముని కెటుల సమర్పింపఁగలిగెను. నిన్నుఁబోలు సుందరీమణి ముల్లోకములయందుఁ జూపట్టదు. నీవు వస్త్రభూషణములు పరిత్యజించి కేవలము నారచీరల ధరించినదానవై యుండియు, యీవనస్థలిని సముజ్జ్వలితముగఁ గావించుచుంటివి. నీవు పలువిధములగు వస్త్రాలంకారముల నలంకృతవై యలరారుచుండునపుడు, నీసౌందర్యమునకు సామ్యమగువస్తువు జగత్తునందు దుర్లభము కాఁగలదు. ఈవృద్ధుఁడైనను నీభరణపోషణములను సక్రమముగ నిర్వహింపఁగలవాఁడుగాఁ గానఁబడఁడు. కాఁబట్టి నీవీజరాగ్రస్తుఁ డగువృద్ధుని పరిత్యజించి మాలోనొకనికి హృదయేశ్వరివి గమ్ము! మేము నీమనోరథముల నన్నిఁటిని పూర్ణములు గావింపఁగలవారము." అని పలికిరి. అందులకు, మహాపతివ్రతయగు సుకన్య "దేవరులారా! పతినే ప్రాణముగఁ బరిగణించియున్న నన్ను యిట్టిఘృణితంపు వాక్కులను వినిచి యేల పరితపింపఁజేసెదరు? ఇయ్యది మీకుఁ దగదు. నాహృదయమెన్నఁడును ఏవిధముగను పతినుండి మరలునది కాదు." అని ప్రత్యుత్తర మిచ్చెను. అంతట నశ్వికుమారులు సుకన్యఁ జూచిఁ బ్రసన్నులై "సుందరీ! మేము నీయాచరణమునకుఁ బ్రసన్నులమైతిమి. నీపతిని రూపయౌవనసంపన్నునిగఁ జేయుదుము."అని పలుకుచు, చ్యవనునికడకేగి "తపోధనా! మేము నిన్ను రూపయౌవనసంపన్నునిగాఁ జేయఁదలఁచితిమి. వలయునేని యీ సరోవరమున స్నాన మొనరింపుము." అని చెప్పిరి అంతట చ్యవనుఁడు రూపయౌవనాకాంక్షుఁడై స్నానమాడ సరోవరము

లోనికిఁ డిగియెను. ఆతనితో నశ్వినీకుమారు లిరువురుఁగూడ సరోవర ప్రవిష్టులైరి. ముగ్గురును స్నానమాడి సరోవరమునుండి బయలువెడలుఁడు, ముగ్గురు నొక్కతీరగు రూపయౌవనసంపన్నులగుయౌవనపురుషులఁబోలె గాననగుచుండిరి. ముగ్గురును నొక్కతీరగు వస్త్రభూషణములచేత నలంకృతులైయుండిరి ఆముగ్గురను సుకన్యఁజూచి "చారుశీలే! మాముగ్గురిలో నీపతి యేవఁడో యేర్పఱుచుకొనుము." అని యేకగ్రీవముగఁ బలికిరి. సుకన్య మొట్టమొదట సమానరూప యౌవనవేష భాషాసంపన్నులగు నాముగ్గురను జూచి వికలమనస్క యయ్యెను. పిమ్మట దృఢచిత్తయై, వివేచనాన్వితయై చ్యవనమహర్షినే పతిగా నెన్నుకొనెను. అంత, చ్యవనుఁడు జరాభారపీడితుఁడై గుందు చొందుచున్న తనకు మరల రూపయౌవనసంపన్నత నొసంగి సంతసముఁగలుగఁజేసిన యశ్వినీకుమారులయెడ నత్యంతముఁ బ్రసన్నుఁడై, వారలఁజూచి, "వృద్ధుఁడనగు నన్ను మీరలు మరల యౌవనవంతునిగఁజేసితిరి. కాఁబట్టి దేవేంద్రునిసమ్ముఖమున మీచేత సోమరసమును పాన మొనరింపఁజేసెదను. అని యిదె ప్రతిజ్ఞఁ జేయుచున్నాను." అని పలికెను. అందులకు దేవవైద్యులు ప్రసన్నులై యందుండి ప్రస్థానులైరి. చ్యవనుఁ డావనములో యథేచ్ఛావిహారమును సలుపఁజొచ్చెను.

శర్యాతిమహారాజు, వృద్ధుఁడగుతనయల్లుఁడు చ్యవనుఁడు అశ్వినీకుమారులవలన, మరల రూపయౌవనసంపన్నతను యనుగ్రహింపఁబడినవాఁడని విని, రాజమహిషీసహితముగ చ్యవనాశ్రమమున కరుదెంచి, యందు రతీమన్మథులవలె చెలువొందుచున్న కూతునల్లునిఁ జూచి, యానందపరవశుఁడయ్యెను. పులకితగాత్రుఁ డయ్యెను. చ్యవనుఁడును, అత్త

మామఁగను, స్వాగతమొసంగి పూజించి, ఆతిథ్య సత్కార మొసంగి నానావిధములగు కథాపురాణములను వినిచి, సంతుష్టాంతరంగునిఁ గావించెను. అల్లుఁడును కూఁతురు నొసంగెడి సత్కారములను గొనుచు, వినిచెడి కథాపురాణములను వినుచు, నా రాజదంపతులు కొంతకాల మాశ్రమవాసమును సలిపిరి. అంత నొకనాఁడు, అన్యోన్యవార్తాలాప సందర్భమున చ్యవనుఁడు శర్యాతితో "మీర లోకయజ్ఞమును సలుపుఁడు. అందు నేను యాజ్ఞికుఁడ నగుదు"నని యనియెను అందులకు శర్యాతి యంగీకృతుఁడయ్యెను. అనంతరము శర్యాతి అల్లునిఁ గూఁతునిఁ దోడ్కొని నిజరాజధానికిఁ జనియెను. భృగునందనుఁ డాతనిని వ్రతపూర్వకముగ యాగదీక్షితునిఁ గావించెను. చ్యవనుఁ డింతకుమున్ను, అశ్వినీకుమారులచేత సోమరసమును పానమొనరింపఁ జేయుటకుఁ బ్రతినఁ బూని యున్నవాఁడు. కాఁబట్టి తత్ప్రకారము యజ్ఞభాగులగు దేవతలతోఁ బాటు యశ్విని దేవతలకుఁ గూడ సోమరస మొసంగఁ జొచ్చెను. అయ్యదిఁ జూచి, ఇంద్రుఁడు "అశ్వినీకుమారులు దేవచికిత్సకులు. సోమరసపానమున కనధికారులు. కాఁబట్టి వారల కొసంగఁ జనదు." అని నిరోధించెను. అందులకు చ్యవనమహర్షి, "స్వర్గాధిపా! అశ్వినీకుమారులు నాకు రూపయౌవనముల ననుగ్రహించి నన్నమరతుల్యునిగఁ జేసిరి. అట్టివారిని సోమరసపానులుగఁ జేయుట నాకు పరమకర్తవ్యము. అయ్యది పరమధర్మము. అట్లు చేయకుండుట యనుచితముగాదా! కాఁబట్టి వారిచేత నిర్నిరోధముగ, నిరాటంకముగ సోమరసమును త్రాగించెదను. వారును అమరులె. వారు సోమరస పానాధికారముఁ గనినవారలే" యని బదు లొసంగెను. ఆమాటలను

ఇంద్రుఁడు మన్నింపఁడయ్యె. అంత చ్యవనుఁడు దేవవైద్యుల అంశను కొంతవరకు గ్రహియించి, "వారలిక సోమరస పానార్హులై"రని ప్రకటించెను. అందుల కింద్రుఁడు మరలఁ బ్రతిఘటించెను. కాని, చ్యవనుఁడు అశ్వినీకుమారులకు సోమ రస మొసంగుటయందు స్థిరచిత్తుఁడై వెనుదీయకుండెను. "అశ్వినీ కుమారులకు సోమరస మొసంగుదువేని, నిన్ను వజ్రాయుధ మునకు బలియొసంగెద"నని యింద్రుఁడు చ్యవనుని బెదరించెను. చ్యవనుఁడు ఇంద్రుని ధిక్కరించెను. అంతట దేవరాజు క్రుద్ధుఁడై చ్యవనునిపై వజ్రముఁ బ్రయోగించెను. అంత భృగునందనుఁడు యజ్ఞకుండమునందుండి పరాక్రమవంతుఁడును మహాబలవంతుఁడును, వికటాకారుఁడును నగు నొక మహాసురుని బుట్టునట్లు చేసెను. అట్లుత్పన్నుఁడైన రాక్షసుఁడు, భయంకరాకారుఁడై, ఇంద్రుని భక్షింపనెంచి నోరు దెఱచుకొని, యాతనివంకకుఁ బరుగిడఁజొచ్చెను. అట్లు తన పైకిఁ బరుగుపరుగున నరుదెంచుచున్న యావికటరక్కసునిఁ జూచి, యింద్రుఁడు భయవిహ్వలుఁడై "మహర్షివర్యా! దేవ వైద్యులు, అశ్వినీకుమారులు నేఁడు మొదలుగ హవిర్భాగముల గ్రహియించుట కర్హులని నేను ప్రకటించుచున్నాను. క్షమింపుమ'ని చ్యవనుని పలువిధముల బ్రార్థించెను. ఇంద్రుని ప్రార్థన మంగీకరించి, భృగునందనుఁడు శాంతచిత్తుఁడై, రక్కసుబారినుండి యాతని రక్షించెను. అనంతరము, శచీధవుని, అశ్వినీకుమారులను, తదితరహవిర్భాగార్హులగు దేవతలను సోమరసపానతృప్తులఁ జేసి, శర్యాతి యజ్ఞమును పరిసమాప్తమొనరించి, పతిపరాయణను పత్నిని సుకన్యను

దోడొకని స్వాశ్రమప్రస్థానుఁ డయ్యెను. అది మొదలుగ అశ్వినీ కుమారులు హవిర్భాగములను బడయువారలైరి.

చ్యవనమహర్షి, ప్రయాగలోని త్రివేణీతీర్థమందు, గంగా యమునా సరస్వతుల సంగమస్థానమందు, పండ్రెండు సంవత్సరములు నివసించి, యొకప్పుడు భూమియందు నొకప్పుడు జలమధ్యమునందును, నిలిచి ఘోరతప మొనర్చుచుండెను. అక్కాలమం దొకప్పుడు ఆతఁడు జలమధ్యమందు దీర్ఘసమాధిస్థుఁడై చిరకాలము నిలిచియుండినందున, జలచరము లాతనితో మైత్రిసినెఱపుకొని యాతనిచెంతఁజేరి యాతనిశరీరమును పసిగొనుచుండెడియది. ఇట్లుండ నొకనాఁడు, కొందరు ధీవరులు చేపలనుపట్టుటకై యరుదెంచి చ్యవనుఁ డున్నస్థానమందు జాలమునువైచిరి. ఆజాలములో మత్స్యములతోబాటు చ్యవనుఁడు కూడ తగులుకొనెను. వానితోపాటు ఆతఁడుకూడ బయిటకుఁ గొని తేఁబడియెను. అంతఁ జాలరులు, జాలమందు చిక్కువడి యున్న మహర్షిఁజూచి భయవిహ్వలులై బయలుపఱచి యాతనికి మాటిమాటికిని సాష్టాంగనమస్కారములు సలుపఁజొచ్చిరి. మత్స్యములు నీటినుండి వెలికిఁదీయఁబడినంతనె ప్రాణములను గోలుపోయిన వయ్యెను. మహర్షి తనకు సహచరము లగుమత్స్యముల కలవడిన యాదురవస్థఁ జూచి కడుదుఃఖితుఁ డయ్యెను. దీర్ఘనిశ్వాస పరిత్యాగుఁ డయ్యెను. ఈవిధముగ దుఃఖాక్రాంతుఁడై పరితపించుచున్న మహర్షిఁ జూచి,జాలరులు,"దేవా! తెలియక మేము చేసినపాప మేదిగలదో యద్దానిని క్షమియింపుఁడు. మీకు సంతోషమగుటకు మేమేమిపనిచేయవలయునో యాజ్ఞాపింపుఁడు." అని సవినయముగఁ బ్రార్థించిరి. అందులకు, మహర్షి "జాలరులా రా!-ఈచేపలతో బాటు నేనుకూడఅమ్ముడుపోయెదను,

లేదా, ప్రాణములనైన విడిచెదను. నేను వీనితో పెద్దకాలము నుండి నివసించుచున్నాఁడను. కాఁబట్టి వీనిని విడువనేరను." అని బదులుపలికెను. అంత ధీవరులు క్షుబ్ధులై, యేమియుఁ దోఁచక నహుషమహారాజుచెంత కరిగి, యావృత్తాంతమాద్యంతమును వినిచిరి. ధీవరులు చెప్పినమాటల నాలించి నహుషుఁడు పాశ్చర్యుఁడై, మంత్రిపురోహితసామంతవర్గంబుతో మహర్షియున్న యెడ కరుదెంచెను. అట్లరుదెంచిన నృపతిని మహర్షి యభ్యర్చితునిఁ గావించెను. అనంతరము, నహుషమహారాజు, మహర్షిఁ జూచి, "మహాత్మా! నేనేమి జేసిన మీకు సంతోషము కలుగునో యయ్యది యెరిగించి నన్నుఁ గృతార్థునిఁ జేయుఁ"డని సవినయముగఁ బ్రార్థించెను. అందులకు భృగునందనుఁడు, "నహుష రాజేంద్రా! ఈమత్స్యములతో బాటు నాకును మూల్యమొసంగి నన్నును శీఘ్రముగ విలిచికొనుము." అని చెప్పెను. అంతట నహుషుఁడు, ధీవరులకు మత్స్యమూల్యమొసంగినయనంతరము, ఋషిమూల్యముక్రింద మొదట నొకసహస్రమును ఆవెనుక నొకలక్షయును స్వర్ణముద్రికల నొసంగెను. అయ్యది చూచి చ్యవనుఁడు, "నృపవరా! వేయియు లక్షయు నగుస్వర్ణముద్రికలు నన్ను విలిచికొనుటకు తగుమూల్యముగాదు. మహర్షి మూల్యము మహర్షితోపరామర్శించి స్థిరమొనర్పుము" అని రాజుతో ననియెను. అంత రాజు నికటవర్తులగు మహర్షుల దిక్కుమొగమై, "తపోనిధులారా! ఈమహర్షి మూల్యమును స్థిర పఱుపుఁడు" అని యడుగ, వారియం దొకమహర్షి ముందంజవిడి, "మహారాజా! తపోనిధియగు బ్రాహ్మణుఁడు అమూల్యపదార్థము. ముల్లోకములలోని బహుమూల్యరత్నముల నన్నిటిని సంగ్రహించి యొసంగినను అందులకుఁ దగుమూల్యము కానే

రము గోధనము అందులకుఁ దగుమూల్యము. అయ్యది యొసంగి విలిచికొనుము" అని చెప్పెను. మహర్షిమాటల నాలించి, నహుషుఁడు సంతసిలుచు, ధీవరులకు గోధన మొసంగి మహర్షిని విలిచికొనియెను మహర్షి మూల్యముక్రింద నహుషుఁడొసంగిన గోధనమును, ధీవరులు, భృగునందనునకు సమర్పించి, యాతని యాశీర్వాదమును బడసినవారలైరి. మహర్షి యాశీర్వచనప్రభావమువలన ధీవరులు మృతమత్స్యములతోఁ గూడ నచ్చటివారలు చూచుచుండ స్వర్లోకమున కరిగినవారలైరి చ్యవనమహర్షి యాశీర్వాదప్రభావమువలన మత్స్యములును, ధీవరులును స్వర్గలోకవాసులగుటఁ గని నహుషమహారాజు విస్మితుఁడయ్యెను. అనంతరము, చ్యవనుఁడు రాజుఁ జూచి, "వరమడుగు"మని యాదేశించెను. అందులకు రాజు, "మహర్షిశేఖరా! నాకు నిశ్చలభక్తియు, ధర్మనిరతియు దయచేసి నన్ను ధన్యునిగఁ జేయుఁ"డని భక్తివినయములతోఁ బ్రార్థించెను. అందులకు భృగునందనుఁడు సంతసిలుచు, 'తథాస్తు' అని పలుకుచు, రాజు నాశీర్వదించి యందుండి ప్రస్థానుఁడయ్యెను.

కాలాంతరమున, కుశికవంశజులు తనవంశమును క్షాత్రవంతముగ నొనర్చుదురనియు, దాన భృగువంశమునకు వినష్టమాపాదితము గాఁగలదనియు నను ననుమానము చ్యవనుని హృదయమునఁ బొడసూపెను. అందువలన నాతఁడు, కుశికవంశమునకు నష్టమాపాదింపనెంచి, కుశికమహారాజు చెంతకరిగి "మహారాజా! నీకడ కొలఁదిదినములు నివసింపవలయునని నామనమువ్విళ్లూరుచున్నయది. ఏమనియెద"వని యడిగెను. అందులకు కుశికుఁడు సంతోషతరంగితాంతరంగుఁడై "మహర్షి

శేఖరా! నిస్సంశయముగ వలయునంత కాలము నివసింపుఁడు. యథాశక్తిగ మీసేవయొనర్చి ధన్యుఁడనయ్యెద”నని బదులొసంగి, యాతనిని విధ్యుక్తముగఁ బూజించెను. అంతట చ్యవనుఁడు, “మహారాజా! నీవును రాజమహిషియు నిష్ఠాలగుదురేని నేను మీప్రాసాదమందు నివసించి వ్రతానుష్ఠానమొండొనర్చెదను. అనుష్ఠానసమయమందు మీర లకుంఠితచిత్తులరై నాకు సేవసేయవలయు. ఏమనియెద”వని కుశికు నడిగెను. అందులకును రాజదంపతు లంగీకృతులై యాతని రాజమందిరమునకుఁ దోడ్కొనిపోయి “మహర్షిశేఖరా! మీ రిందు వసియింపుచు సుఖపూర్వకముగ వ్రతానుష్ఠాన మొనరింపుఁ”డని పలికిరి. అంతట చ్యవనుఁ డానందభరితుఁడై యందు విడిసి రాత్రియైనంతనె, “రాజా! నాకాకలి యగుచున్నయది. భోజనమిడుము.” అని రాజుతోఁ బలికెను. భోజనానంతరము, “మహారాజా! నాకు నిద్ర వచ్చుచున్నది. పరుండెదను. నేను నిద్రించునపుడు నన్నెరుచు లేపకుండ మీదంపతులిరువురు నిందు నిలిచి చూచుచుండుఁడు.” అని చెప్పి నిద్రితుఁడయ్యెను. రాజదంపతులాహారనిద్రలనుమాని మహర్షిపరిచర్యను సేయఁదొడంగిరి. ఇట్లు చ్యవనుఁడు యిరువదియొక్క దినములు నిద్రించియుండెను. ఈనిద్రితకాలమందు రాజదంపతు లాహారనిద్రలు లేకయే యాతనికి శుశ్రూషఁ జేయఁజొచ్చిరి అనంతరము చ్యవనుఁడు నిద్రనుండి లేచి యంతర్హితుం డయ్యెను. రాజు పత్నీయుతముగ అనాహారుఁడై యాతని రాకకుఁ బ్రతీక్షింపఁజొచ్చెను. ఎంత వెదకినను యాతనిజాడ పొడసూపదయ్యెను. పిమ్మట నాతఁడెందుండియో యకస్మాత్తుగ జనుదెంచి మరలనిద్రితుఁడయ్యెను. నిద్ర లేచి తైలాభ్యంజన స్నానసమాచరింపనెంచి, రాజదంపతుల

చేత తలనంటించుకొని మరల నంతర్హితుండయ్యెను. మరలఁ జనుదెంచి భోజనమును యాచించెను. రాజమందిరమునం దుపస్థితములై యున్న పలువిధములగు ఖాద్యపదార్థములను, తదితరపదార్థములను ఏకత్రమొనరించి వానినన్నిటిని హుతాశనుని కర్పించెను. అటుల మహర్షి చేసినందులకు రాజేమియు ననఁడయ్యె. అనంతరము చ్యవనుఁడు, కుశికుని విచలితహృదయునిఁ గావించుట కొకయద్భుతమగు నుపాయము నావిర్భావమొనరించెను. తానొక పల్లకియందు కూర్చుని రాజదంపతులను తద్వాహకులుగ నియుక్తులం గావించెను. తన్నియుక్తమున రాజదంపతులు వాహకులై యాపల్లకిని మోయుచుండ, యామహర్షి వారి సుకుమారశరీరములపై, మాటిమాటికిని కశాఘాత మొనరింపఁజొచ్చెను. అట్లు కశాఘాతమున క్షతవిక్షతగాత్రు, లగుచున్న రాజదంపతులు, మునిపల్లకిని మోయుటయందే దృఢచిత్తులై యుండిరిగాని, తదాచరణమున కిసుమంతయు విసుగుజెందినవారలు కారైరి. అంతట చ్యవనుఁడు రాజకోశములోని ధనమును యిచ్ఛావితరణ మొనర్చెను. అందులకును రాజదంపతులు సంతసిలిరేగాని, యసమ్మతమును బ్రకటింపరైరి. ధనాగారము శూన్యమైనదైనను కుశికుఁడు విచలితహృదయుఁడు కాలేదు.

చ్యవనుఁడు, తానెన్నివిధముల నిగృహీతునిఁ గావించినను కుశికుఁడు తనయెడ విరక్తుఁడు కాకుండుటనుఁ జూచి, అమందానందహృదయుఁడై, యాతనిఁజేరి, "మహారాజా! నేను నీయెడఁ గడుఁబ్రసన్నుఁడనైతిని. నీవు, నేఁడు పత్నీయుతముగఁ జని భోజనమొనర్చి విశ్రాంతిఁజెందుము. మఱునాఁడు రేపకడ నాకడ కరుదెమ్ము" అనిచెప్పి నిజాశ్రమమునకుఁ జనియెను.

అంతట ననేకదినములనుండి, మునిపరిచర్యయందు దగిలి నిద్రాహారములను దూరమొనర్చి యున్న రాజును రాణియు తదాదేశమున భోజనభాజనములఁ బరితృప్తులై నాఁడు సుఖనిద్రఁ జెంది స్వస్థచిత్తులైరి మఱునటిదిన ముదయమున మహర్షిసందర్శనమునకునై తదాశ్రమప్రాంతమున కరుదెంచిరి. రాజదంపతులరుదేరునంతకు చ్యవనాశ్రమము సుందరనగరముగను, తత్పర్ణశాల మహావైభవ సమన్వితమగు అట్టాలికగను పరివర్తనమైయుండెను ఆయట్టాలికయం దొకసుందరమును, మృదుతరమును నగుశయ్యపై చ్యవనుఁడు శయనించియుండెను. అట్లు శయనించియున్న మహర్షిని రాజదంపతులు డగ్గరిలినంతనె, యాశయ్యయు నాయట్టాలికయు, యానగరమును అంతర్ధానములయ్యెను. చ్యవనుఁ డొకదర్భాసనముపై నుపవిష్టుఁడై నవాఁడయ్యెను. చ్యవనుని యాయద్భుత తపోబలప్రభావముఁ జూచి యా రాజదంపతులు విస్మయానందములకు లోనుగాఁ జొచ్చిరి. మహర్షి యెదుట నిలువఁజొచ్చిరి. అట్లు ముకుళితకరకమలురై సవినయభయభక్తులతో కట్టెదుర నిలిచియున్న రాజదంపతులను, చ్యవనుఁడు యథావిధిని సత్కరించి యాసీనులఁగావించెను. అనంతరము రాజుఁ జూచి, "కుశికనృపవరేణ్యా! ముందు ముందు నీవంశజులు, నావంశమందు క్షాత్త్ర తేజమును సంచారమగునటుల జేయుదురనియు, అందువలన భృగువంశము వినష్టమగుననియును మున్నొకప్పుడు బ్రహ్మవలన వినియుంటిని. అందువలన నీవంశమును మూలచ్ఛేద మొనర్చి, భృగువంశమును పెంపొందఁజేయ మదినెంచి, నీకడకరుదెంచి, నీమందిరమున నివసించితిని. నీయందు త్రుటిగని నిన్ను శాపదగ్ధునిఁగాఁ జేయుటకు నిన్ను, బహువిధములుగా బాధించితిని. కాని లోపమును

గననైతిని. నీపుత్రునకు, గాధిరాజునకు ఋచీకమహర్షి ప్రభావమువలన విశ్వామిత్రుఁ డనుపుత్రుఁడు, కులపావనుఁ డుత్పన్నుఁడగును. అతఁడు కఠోరతపమొనర్చి బ్రహ్మను ప్రసన్నునిఁ గావించి, యాతనివలన బ్రాహ్మణత్వలాభమును బడయఁగలవాఁడగును. నేను మీరొనర్చిన పరిచర్యలకుఁ బ్రసన్నుండనైతిని. మీకు శుభమగుఁగాత!" అని యాశీర్వదించి యాతని యనుమతిఁబడసి తీర్థాటనమునకుఁ బ్రస్థానుఁడయ్యెను.

భృగుపుత్రుఁ డగుచ్యవనుఁడు సుకన్యయందు ప్రమతి యనుపుత్రునిఁ గనియెను. అతఁడును, తండ్రిఁబోలె, తపస్సునందును తేజస్సునందును, గణుతికెక్కినవాఁడు.

---

10. అగస్త్యమహర్షి.

అగస్త్యుని జన్మవృత్తాంతము అత్యద్భుతము. మిత్రావరుణుఁ డనుమహర్షి యొకదినమున నపూర్వసౌందర్యశాలిని యూర్వశినిఁ జూచినంతనే వీర్యపతనమునకు లోనయ్యెను. అతఁ డాపతితవీర్యము నొకకుంభ (ఘటము)మునం దునిచి సంరక్షించెను. అట్టి కుంభమం దునుపఁబడి రక్షితమైన వీర్యమునుండి యగస్త్యుఁ డుద్భవమందెను. కుంభమునందుండి యుదితుఁడైన కతమున నగస్త్యునకు 'కుంభజుఁ'డనుపే రలవడెను కుంభజుఁడు మహాతపశ్శాలి. అతఁడు, తనతపోబలమువలన పెక్కులం అలౌకికకార్యములను సలిపి లోకోపకార మొనర్చియున్న వాఁడు. అతఁడు సాంసారికజీవనమునందు విరక్తుఁడై చిరకాలము బ్రహ్మచర్యవ్రతావలంబి యై నిరంతరము తపోనిమగ్నుఁడై

రొప్పియుండెను. ఆతఁడు భూప్రదక్షిణ మొనర్చుచుండుతఱి నొకనాఁ డొకశాఖాగ్రమును బట్టుకొని తలక్రిందుగా నొక పెనుపల్లములోనికి వ్రేలాడుచున్న వారలఁ గని, కరుణార్ద్రీ హృదయుఁడై, వారల దరిసి, "అయ్యలారా! మీరలెవరు? ఈ విధముగఁ బడియుండుటకుఁ గారణమేమి?" అని ప్రశ్నించెను. అందులకు వారలు "మేము నీపితరులము. నీ వవివాహితుఁడవై యుండుటకారణముగ, మే మీదుర్దశకు లోనైతిమి. నీవు వివాహితుఁడవై సంతానోత్పాదన మొనర్చువాఁడ వగుదువేని మావంశవృక్షము రక్షణమును బడయఁగలదు. దాన మాయీ యసహ్యకష్టము తొలఁగఁగలదు. అని ప్రత్యుత్తర మొసంగిరి. పితరులమాటల నాలించినంతనె వారికష్టమును బాప మదినెంచి వారియెదుట నగస్త్యుఁడు "నేను వివాహితుఁడనై పుత్రోత్పాదన మొనర్చి మీకష్టమును బోద్రోలుదు"నని కృతప్రతిజ్ఞుఁడై యందుండి వెడలి చని విదేహరాజకన్యను త్రిలోకసుందరిని, లోపాముద్రను, దానపూర్వకముగఁ గ్రహించి విధ్యుక్తముగఁ బరిణీతుఁ డయ్యెను. అనంతరము లోపాముద్రాసహితముగ గంగాద్వారమందలి తనయాశ్రమమున కరిగెను. రాజకుమారి లోపాముద్రయు, తపస్విశ్రేష్ఠుఁ డగునగస్త్యుని బతిగాఁ బడయఁగలిగినందులకు అత్యంతసంతోషమును బొందినయది. లోపాముద్ర యాశ్రమమున కరుదెంచినపిమ్మట బహుమూల్యాభరణములను, సూక్ష్మవస్త్రాదులను పరిత్యజించి, అజినవల్కలములను ధరియించి తనపతికనుకూలవతి యగుసహధర్మచారిణియయ్యెను. అట్లు కొంతకాల మరిగినపిమ్మట నొకనాఁడు అగస్త్యుఁడు ఋతుస్నాతయగుసహధర్మిణిఁ జూచి కామవికారమునకులోనై తన మనోభిలాష మామె కెఱిఁగించెను. అంత నాసాధ్వీశిరోమణి

లోపాముద్ర భర్తచెంతకరిగి నిలిచి, లజ్జావనతవదనయై, ముకుళితకరకమలయై "ప్రాణనాథా! మీయాజ్ఞ నాకు శిరోధార్యము. అయినను తపస్విజనసేవ్యము లగునీపవిత్రగైరికవసనమును, అజినమును ధరియించి యీపవిత్రపదార్థముల మర్యాదను వినష్టమొనరించి మిమ్ముల నెటులఁ దనియింపఁజేయఁగలదాన నగుదును? నేను, పితృగృహమునం దుండినపు డేవిధముగ నమూల్యవస్త్రాభరణములను ధరియించి బహుమూల్యశయ్యపై శయనించియుంటినో ఆవిధముగ నమూల్యవస్త్రాభరణములను ధరియించి బహుమూల్యశయ్యపై శయనించి మిమ్ములను దనియింపఁజేయవలయునని నామనోరథము." అని సవినయముగఁ బలికెను. అందులకు మహర్షి "యో ప్రియతమురాలా! నీమనోరథము దరిద్రునిమనోరథమును బోలినయది. నీతండ్రి నరపతి. అందువలన నాతనియింట నుండినపుడు నీకట్టి వస్త్రాభరణములును, మృదుతరశయ్యయును సంప్రాప్తములయ్యెను. నేనన్ననో తపస్విని. నిరుపేదను. అట్టి వస్త్రాభరణములను శయ్య నెటుల తేఁగలను" అని బదులొసంగెను. అయ్యది యాలించి లోపాముద్ర "మీరు ముల్లోకములలోని ధనమును సంపూర్ణముగఁ బడయఁగల సమర్థులగు" అని యనియెను. అందులకు మహర్షి "నేనటులఁ జేసితినేని నాతపస్సంతయు నష్టమగును. అటుల కాకుండ ధనమును బడయుటకు అనువగుయత్న మొనర్చెద" నని చెప్పెను. అనంతరము శ్రుతర్వరాజుచెంత కరిగెను. శ్రుతర్వుఁడు మహర్షిని యథోచితసత్కార మొనర్చి అర్ఘ్యపాద్యాదివిధులఁ బూజించి పరితుష్టుని గావించి, యాగమన కారణమును నెఱిఁగింపుఁ"డని ప్రార్థించెను అందులకు ధనార్థినై యరుదెంచితి"నని మహర్షి బదులొసంగెను. శ్రుతర్వుఁడు

మహర్షికి వలయు ధనముపరిమితిని గ్రహియింపనేరక తన రాజ్యము ఆయవ్యయసర్వస్వమును దెలిపెడిపట్టికను గొనితెచ్చి మహర్షిసమ్ముఖమున నిడి, "ఇది నారాజ్యాదాయము. ఇది వ్యయము. ఇదె శేషము. ఇందు మీకు వలయునది నిస్సంశయముగ గ్రహియింపుఁడు" అని పలికెను. శ్రుతర్వుఁడు చూపిన ఆయవ్యయపట్టికఁ జూచి, మహర్షి "యీతనికడనుండి ధనమును గ్రహియించితనేని యీతని కమితకష్టమును నాపాదించినవాఁడ నగుదు"నని తనలోఁ దా ననుకొనుచు, ధనమును గ్రహియించుట కసమ్మతమును బ్రకటించుచు, శ్రుతర్వుని వెంటఁగొని బ్రధ్నశ్వునికడ కరిగెను. బ్రధ్నశ్వుఁడును ఆయవ్యయపట్టికను మహర్షికిఁ జూపెను. అగస్త్యుఁ డాతనికడనుండియు, ధనమును గ్రహియించుట కియ్యకొనక, యాతనిఁ గూడ దోడ్కొని త్రసదస్యునికడ కేగెను. ఆతని రాజ్యావస్థయు మహర్షి మనమును నలరింపనేరనిదయ్యెను. అంతట అగస్త్యుఁడు నిరుత్సుకుఁ డయ్యెను. అగస్త్యుని నిరుత్సాహమును, శ్రుతర్వ బ్రధ్నశ్వ త్రసదస్యులుఁ జూచి, "ఇల్వలుఁడు మహైశ్వర్యశాలియై యున్నవాఁడు. ఆతనికడ కరిగిన మీమనోరథ మీడేరఁగల"దని మువ్వురు నేకగ్రీవముగఁ బలికిరి. అందులకు మహర్షి సంతసిలి యామువ్వుర రాజులఁ దోడ్కొని యిల్వలుని చెంత కరిగెను.

ఇల్వలుఁడు మణిపురనామకస్థానమందు నివసించువాఁడు. మహాధనికుఁడు. ఆతనికి వాతాపి యనువతఁడు కనిష్ఠసోదరుఁడు. ఆయిరువురును దురాత్ములు, లోకకంటకులు. అందు నిల్వలుఁ డొకనాఁ డొక తపోనిరతుఁ డగు బ్రాహ్మణునిఁ జూచి "తనకు నింద్రునిఁబోలు కొమరునొకని దయసేయు"మని

యాతని నిర్బంధించెను. అందుల కాబ్రాహ్మణుఁ డియ్యకొనని కతమున నిల్వలుఁడు కుపితుఁడై బ్రహ్మవంశమును విధ్వంస మొనరింప మనమెంచెను. ఆతఁడు తనకడ కరుదెంచిన ప్రతి బ్రాహ్మణుని పూజితునిఁగావించి తనసోదరుని వాతాపిని మేఁకగ నొనర్చి, యీ మేఁకను వధించి దానిమాంసమును పచనముచేసి యాబ్రాహ్మణునకుఁ గుడువఁబెట్టి యనంతరము "వాతాపీ, త్వరగరమ్ము"యని పిలుచుచుండెడివాఁడు. అట్లు పిలిచినతోడనే, వాతాపి తన్ను భక్షించిన బ్రాహ్మణుని పొట్టచీల్చుకొని సజీవుఁడై యన్నయెదుట నుపస్థితుఁ డగుచుండెడివాఁడు. పిమ్మట నా యిరువు రన్నదమ్ములు ఆబ్రాహ్మణుని భక్షించుచుండెడివారు. ఈవిధముగ నిల్వల వాతాపులిరువురు నిరంతరమును నిర్భయ ముగ బ్రాహ్మణవధమును సలుపుచుండెడివారు.

ఇల్వలుఁడు తనకడ కరుదెంచిన యగస్త్యమహర్షిని శ్రుతర్వబ్రధ్నశ్వ త్రసదస్యులను సత్కరించి విధ్యుక్తముగఁ బూజించెను. అనంతరము వాతాపిని మేఁకనుజేసి వధించి యా మాంసమును పచనముచేసి మునికిఁ గుడువఁబెట్టెను. ముని భోజనము పూర్తియగుఁడు, నిల్వలుఁడు తనసోదరుని వాతా పిని యథాపూర్వముగ బిలువఁదొడంగెను. అట్లు పిలుచుచున్న యిల్వలుని యగస్త్యుఁడుచూచి యపహాసమొనర్చుచు, "నో దానవోత్తమా! ఇఁక నేఁటివాతాపి ఆతఁడు నాజఠరాగ్నికిం ధనమై యింతకుమున్నె యమపురి నలంకరించియున్నవాఁడు. ఇక నాతఁడు వచ్చుటయేడ?" అని పలికెను. అగస్త్యుని యా యఖండశక్తిఁ గని యిల్వలుఁడు భయకంపితుఁడై యాతనికి యథేష్టముగ ధన మొసంగెను. మువ్వురరాజులను బహుతర ముగ బహూకరించెను. కారణాంతరమున నిల్వలుఁడు గూడ

మహర్షి క్రోధాగ్ని కింధనమై, భస్మీభూతుఁ డయ్యెను. అనంతర మగస్త్యుఁడు శ్రుతర్వ బ్రధ్నశ్వ త్రసదస్యులనుమువ్వురను తమ తమరాజ్యముల కనిపి తానుస్వాశ్రమమున కరుదెంచి భార్యకు వలయు వస్త్రాభరణాదుల నొసంగి పూర్ణమనోరథుఁ డయ్యెను. లోపాముద్ర గర్భవతియై యథాసమయమున దృఢదస్యుఁ డను పుత్రుని, ధర్మాత్ముని బ్రసవించెను. ఈధార్మికపుత్రుని జన్మము కారణముగ నగస్త్యుఁడు పితౄణమునుండి విముక్తుఁడయ్యెను.

ఒకప్పుడు కాలకేయనామకులు, దుష్టరాక్షసులు, వృత్రాసురుని యధ్యక్షునిగఁగొని యింద్రాది దేవతలను నాక్రమింపఁ దొడంగిరి. ఇంద్రాదులు వృత్రాసురునిధాటి కెదురుపడనేరక బ్రహ్మచెంతకరిగి మొరలిడఁజొచ్చిరి. అంత బ్రహ్మ ప్రసన్నుఁడై దేవతలతో, "మీరలేగి సరస్వతీతీరమందు తపంబునలుపుచున్న దధీచిఁ బ్రసన్నునిఁగావించి యాతని శరీరములోని యెమ్ము కనుబడసి యద్దానిఁ గొనితెచ్చి దేవశిల్పి కొసంగుఁడు. అతఁ డాయెమ్ముకతో వజ్రాయుధమును నిర్మించు. ఆయాయుధము సాధనముగ నింద్రుఁడు వృత్రాసురుని వధియించు పొండు" అనిచెప్పెను. బ్రహ్మ యాజ్ఞానుసరణముగ దేవతలు దధీచి యెముకఁ గొనితెచ్చి దేవశిల్పి కొసంగిరి. దేవశిల్పి యాయెమ్ముకతో వజ్రాయుధమును నిర్మించి యద్దాని నింద్రున కొసంగెను. ఇంద్రుఁ డాయాయుధమును సాధనముగఁగొని వృత్రాసురుని వధియించెను. వృత్రాసుర వధానంతరము కాలకేయులు అధ్యక్షహీనులయినందున చెల్లాచెదరై పరుగిడి, సముద్రమధ్యముఁజొచ్చి యందు దాగికొనిరి. అనంతరము ముల్లోకములను నాశనమొనర్చుటకు స్థిరచిత్తులైరి. బ్రహ్మవంశము విధ్వంసమైనయెడల ముల్లోకములు తమంతటతామే నాశనములగాఁ

గలవని మనంబలంచి మునుముందు బ్రాహ్మణులను విధ్వంసమొన రింపఁబోడంగిరి. వారు పగటిపూట సముద్రములో డాఁగుచు రాత్రిపూట బయలువెడలి తపోనిరతు లగు బ్రాహ్మణులను మహర్షులను నాక్రమించి వధింపఁజొచ్చిరి. ఒకనాఁడు వశిష్ఠాశ్రమముచు,మఱియొకనాఁడు చ్యవనాశ్రమమును,ఇంకొకనాఁడు భరద్వాజాశ్రమమును ఆక్రమించి యందలి ఫలమూలాహారులను, వాయుభక్షులును నగుతపోనిధులను పెక్కువేలమందిని బొరిగొనిరి. కాలకేయులొనర్చు నుపద్రవములకు లోనై ఋష్యాశ్రమములు జనశూన్యము లయ్యెను. జపతపములు వ్యర్థము లయ్యెను. దేవపూజలు పూర్ణానుస్వారము లయ్యెను అగ్నికార్యము లడుగంటెను యజ్ఞయాగాదులు స్వప్నసదృశము లయ్యెను. ఈదుష్టరాక్షసులబారిఁ బడనివారలు ప్రాణరక్షణాతురులై క్రూరమృగశరణ్యము లగునరణ్యములను కొండగుహలను నాశ్రయించి దినములుగడపఁజొచ్చిరి అంతట దేవతలు తమతమ యస్త్రశస్త్రములను చేనంది కాలకేయులను వధింప నుద్యుక్తులైరి. కాని, వారు కంటఁబడినగదా? ఆరక్కసులు సముద్రమధ్యమున నిరవుకల్పించుకొని యుండినకతమున వారలను గనుఁగొననేరక దేవతలు శ్రీమన్నారాయణుని శరణు చొచ్చిరి. కాలకేయులు లోకముల నలయించుచున్నవిధమును వినిచిరి అంత నార్తజనశరణ్యుఁడు, శ్రీమన్నారాయణుఁడు లోకరక్షణకౌతూహలుఁడై, దేవతలఁ జూచి, "కాలకేయులు సముద్రగర్భమునఁ డాఁగియున్నవారు. వారిఁ బొరిఁగొనుట సామాన్యముగాదు. సముద్రము జలశూన్యమయినఁగాని వారు బయలుపడరు. సముద్రమును యింకించుసామర్థ్యము అగస్త్యునకుఁదక్క తదితరులకు లేదు. కాఁబట్టి విూరలగస్త్యమహర్షి

చెంతకరిగి యాతనిఁ బ్రసన్నునిఁజేసి యాతనిచేత సముద్రుని శుష్కింపఁజేయుఁడు. అటులఁజేయుదు రేని మీరలు వారలను నురుమాడ శక్తులరగుదురు" అని చెప్పి వారలను పనిచెను. దేవతలు శ్రీకాంతునియాజ్ఞను శిరమున ధరియించి యగస్త్యుని చెంతకరిగి యాతనిఁ బ్రసన్నునిఁ గావించిరి. అగస్త్యుఁడు సముద్రమును పానముచేసెను. కాలకేయులు బహిర్గతులైరి. దేవతలు వారలఁ దలపడిరి. దైత్యాదిత్యులకు ద్వంద్వయుద్ధము ప్రవర్తిల్లెను. ఆద్వంద్వయుద్ధమున పెక్కండ్రు కాలకేయులు నిహతులైరి. హతశేషులు ప్రాణరక్షణాతురులై పాతాళముకుఁ బరుగిడిరి. దేవతలు విజయమును బడసిరి. పృథ్వి నిరాపదయయ్యెను. లోకములు నిష్కంటకములయ్యెను. జపతపములు, యాగాదులు పునఃప్రవర్తితము లయ్యెను. ఇంద్రాదులగస్త్యుని బహుతరముగ స్తుతియించి యాతనిని స్వాశ్రమమున కనిపి తాము స్వర్లోకమును బొందిరి.

ఒకప్పుడు, వింధ్యుఁడు సుమేరువునెడ క్రుద్ధుఁడై, సుమేరువునకు ప్రతినిత్యమును పరిక్రమమొనర్చుచున్న సూర్యనారాయణునిఁజేరి "నేఁడుమొదలుగ సుమేరువును మాని నన్ను ప్రతినిత్యమును చుట్టుతిరుగుచుండుము" అని చెప్పెను. అందులకు సూర్యుఁడు, "నేను నాబుద్ధిపూర్వకముగ మేరువు చుట్టు తిరుగుచుండుట లేదు. విధాతృనాజ్ఞచొప్పునఁ దిరుగుచున్నాడను" అనిబదులొసంగెను. అంతట వింధ్యుఁడు కుపితుఁడై, సూర్యగమనమును నిరోధింప మదినెంచి తనశరీరమును పెంచి పెద్దదిగఁగావించెను వింధ్యునిశరీరము హద్దుమీరి పెరిగినందున సూర్యగమనము నిరుద్ధమయ్యెను. అందువలన లోకములు పీడితములుగాఁజొచ్చెను.అయ్యది చూచి త్రిదశులు దిగులొంది అగ

స్త్యుని చెంతఁజేరి వింధ్యవర్తనమును వినిచి శోకసంకటమును బాపవేఁడుకొనిరి అంతట నగస్త్యుఁడు దేవతాను రోధముచొప్పున వింధ్యపర్వతము చెంతకరుగ, నప్పర్వత మమ్మహర్షికి దండాకృతిగ నమస్కరించెను అట్లు సాష్టాంగనమస్కృతి నొసంగుచున్న వింధ్యునిఁ జూచి, కుంభజుఁడు ప్రహర్షచిత్తుఁడై "యోపర్వత శ్రేష్ఠమా! నేను దక్షిణయాత్ర కరుగుచున్నాఁడను. నీవు నిలిచి యుండినయెడల నిమ్నోన్నతములగు నీశిఖరములను దిగుట యందు నెక్కుటయందును నాకమితసంకటము సంప్రాప్తమగు. కాఁబట్టి నేను దక్షిణదిశనుండి మరలివచ్చునంతదనుక నీవీవిధ ముగనే దండాకృతిగ నొప్పియుండుము" అని వింధ్యుని శాసించి, సూర్యగమనమును నిర్నిరోధముగ వర్తిలఁజేసి దక్షిణదిక్కున కరిగెను. ఆతఁడందుండి మరలిరాలేదు. దక్షిణమునుండి యుత్తరమున కరుదెంచిన వింధ్యుఁడు యథాపూర్వముగ లేచినిలిచి లోకోపద్రవ మొనఁగూర్చునని, యగస్త్యుఁడు దక్షిణదేశవాసి యయ్యెను

బ్రహ్మవంశసంభూతుఁడును తపోబల సంపన్నుఁడును, మహాపరాక్రమశాలియు నగువృత్రాసురుని వధియించుట కారణముగ నింద్రుఁడు బ్రహ్మహత్యాపాతకమునకు లోన య్యెను ఇంద్రుని కలవడినపాతకము మూర్తివంతమై, చండా లినీ రూపధారియై, యాతని వెనువగిలి దిరుగ నారంభిం చెను అట్లు భయంకరాకారమునఁ దన్నువెన్నంటి దిరుగాడు చున్న బ్రహ్మహత్యాపాతకమునుగని యింద్రుఁడు భయకంపి తుఁడై మానససరోవరమునందలి యొకానొక కమలనాళ మునుజొచ్చి యందు డాగికొనియెను. అంతట స్వర్గము రాజ హీనమయ్యెను దానఁ దేవగురువు బృహస్పతి యనుమతి

చొప్పున దేవతలు నహుషుని స్వర్గాధిపునిఁ గావించిరి నహుషునకు స్వర్గాధిపత్య మలవడినంతనె యాతనిమతి భ్రమసినదయ్యెను ఆతఁడు ఇంద్రాణిని పత్నిగఁ బడసినఁగాని, తనకలవడిన స్వర్గాధిపత్యము సౌఖ్యదాయకము కాఁజాలదని నిశ్చయించి, యింద్రాణిచెంతకేగి, యామెను, తన్ను పతిగ వరియింపుమని నిరోధించెను. నహుషుని దుర్వర్తనమును గని, యింద్రాణియు దేవతలును భయగ్రస్తులై బృహస్పతిచెంతకరిగి యాతనికి శరణుచొచ్చిరి. అంతట బృహస్పతి నహుషునిఁ జేరి, "మహారాజా! స్వర్గాధిపా! మహర్షి వాహితమగు వాహనము నధిరోహించినఁగాని నీకు నింద్రత్వము సిద్ధింపనేరదు. ఇంద్రత్వము సిద్ధించినఁగాని, నిన్ను నింద్రాణి పతిగ వరియింపనేరదు కాఁబట్టి, ఋషివాహితమగు వాహనమును నధిరోహించి యేనాఁడు ఇంద్రాణిగృహమున కరుదేరఁగలవాఁడవగుదువో, అనాఁడు ఇంద్రాణి నిన్ను పతిగ వరియింపఁగలదు" అని చెప్పెను. బృహస్పతిపలుకుల నాలించి నహుషుఁడు సంతోషతరంగితాంతరంగుఁడై, కామమదమత్తుఁడై, మహర్షులనే కత్రులఁగావించి తానొకపల్లకిలోఁగూర్చుండి, యద్దానిని మోయునటుల నమ్మహర్షుల కాజ్ఞనొసఁగెను. రాజాజ్ఞను శిరోధార్యమొనరించి మహర్షు లాతని పల్లకిని మోయుదొడంగిరి. కాని పల్లకిమోతయందు నభ్యాసములేని యామహర్షు లద్దానివలన కలుగుచున్న కష్ట మసహ్యమగుచున్నదైనను సహ్యమైనదానిగ మదిఁదలంచి మందగమనమున నడువసాగిరి. అందులకు మదోన్మత్తచిత్తుఁ డగునహుషుఁడు సహింపనేరక వారలను త్వరపెట్టుచు సర్ప. సర్ప. అని కేకలువేయుచు భయపెట్టసాగెను; కాని మహర్షులు త్వరితగమనులు కాఁజాలకపోయిరి. అంతట నహు

షుఁడు అగ్రహోదగ్రుఁడై యెదుటనున్న యగస్త్యుని పదతాడితునిఁ గావించెను. అట్లు పదతాడితుఁడైనయగస్త్యుఁడు దండతాడిత భుజంగమముచందమున క్రుద్ధుఁడై, "యోదురాత్మా! కామమదమత్తా! పూజ్యపాదు లగుమహర్షులను పూజించుటకు మాఱుగ వారిచేత పల్లకినిమోయింపఁ జేయుటయేకాక వారలను దండనార్హులుగఁగూడఁ జేయుచున్నాఁడవు. నీ యీయనుచితవర్తనమున కుచితదండన మొసంగకుండ విడిచిపుచ్చుట యుచితవర్తనము కానేరదు. సర్పా. సర్పా. అని కేకలువేయుచు మహర్షులను భయపెట్టినవాఁడవు గావున స్వర్గపదమునుండి చ్యుతుఁడవై సర్పరూపధరుఁడ వగుదువుగాత"మని నహుషుని శాపదగ్ధునిఁగావించెను. అంతట నగస్త్యశాపదగ్ధుఁ డగునహుషుఁడు ఆక్షణముననే స్వర్గభ్రష్టుఁడై సర్పరూపమును ధరియించెను. కాలాంతరమున పాండురాజనందనుఁ డగుయుధిష్ఠిరుని వలన శాపముక్తుఁడై మరల స్వర్గమును బడసినవాఁడయ్యెను.

అగస్త్యుఁడు, పితృవాక్యపరిపాలన ధురంధరుఁ డగు శ్రీరామచంద్రుని వనవాససమయమున నాతని కనేకదివ్యాస్త్రములను, అక్షయతూణీరములను నొసంగి యాతని సత్కరించెను. ఆతఁడు రచియించిన రామచరితాత్మకమగు 'అగస్త్యసంహిత' యను గ్రంథము రామోపాసకులచే పవిత్రతమమును, మాననీయమును నగుగ్రంథముగఁ బరిగణింపఁబడుచున్నది

11. అష్టావక్రమహర్షి

అష్టావక్రుఁడు కహోడునిపుత్రుఁడు. కహోడుఁడు ఉద్దాలకుని శిష్యుఁడు. గురుభక్తుఁడు. ఆతనిసేవాశుశ్రూషలవలన

ఉద్దాలకుఁడు అత్యంతముఁ బ్రసన్నుఁడై యాతనికి శ్రుతివిద్యాప్రదాన మొనర్చెను. వేదమం దెన్నిమంత్రములు గలవో యామంత్రముల కన్నిటికిని నధిష్ఠాతలగు దేవతలు ప్రత్యేకులుగ నొప్పుచుండిరి ఆ దేవతలు గురుకటాక్షమువినాగా ప్రసన్నులు గారు. వారు ప్రసన్నులు గానిచోఁ డామంత్రములందలి గూఢతత్త్వమును, రహస్యార్థమును నవగతములు కానేరవు. గురుకటాక్షమునకుపాత్రులై యేరు వేదవిద్యనునధ్యయనము చేయుదురో వారే వేదవిదులు వేదార్థపరిజ్ఞాతలు. వేదము మంత్రపూరితమగుట కారణముగ నద్దానికి బ్రహ్మవిద్యయనియు, శబ్దబ్రహ్మమనియుఁ బేరులు కలిగెను గురుసేవాపరతంత్రుఁడును, బుద్ధిమంతుఁడును నగు కహోడుఁ డాచార్యు నుద్దాలకుని కృపాదృష్టికిఁ బాత్రుఁడై బ్రహ్మవిద్యయొక్క నిగూఢతత్త్వమును రహస్యార్థమును బరమార్థమును హృదయంగమ మొనర్చుకొని వేదజ్ఞుఁడయ్యెను. ఉద్దాలకమహర్షి కహోడుని సేవాశుశ్రూషలకు అత్యంతము హర్షచిత్తుఁడై యాతనికి వేదవిద్యతోబాటు సుశీలయు శుచిస్మితయు నగు సుజాతయను పేరుగల తనకన్యను సంప్రదాన మొనర్చెను. సుజాతయు పతిసేవాపరాయణురాలై కాలాంతరమున గర్భవతియయ్యెను. జన్మాంతరసంస్కారము కారణముగ సుజాత గర్భములోఁ బెరుగుచున్న బాలుఁడు గర్భమందే శాస్త్రజ్ఞుఁడయ్యెను. వేదవిదుఁడయ్యెను. ఆసమయమునం దొకానొకదినమున మహాత్ముఁడు, కహోడుఁడు వేదపాఠ మొనర్చుచుండుతఱి సుజాతగర్భస్థుఁడు మునిబాలకుఁడు తండ్రిఁ జేరి "హే! పితః, నీయొనర్చుపాఠము శుద్ధమైనదిగ నుండ లేదు. నేను గర్భస్థుఁడనై యున్నవాఁడనై యున్నను నాకు సమస్తవేదములందును శాస్త్రములందును నిగూఢతత్త్వము రహస్యార్థము

సంపూర్ణముగ హృదయంగమమయ్యెను" అని పలికెను. ఆపలు కులనాలించి మహర్షి కహోడుఁడాబాలుఁడు తన్నవమానించుచున్నవాఁడని తలంచి, కుపితుఁడై "గర్భమునుండి వెలువడక మున్నే నన్నవమానితునిగఁ జేయుచున్నవాఁడవు. కాఁబట్టి నీశరీరమష్టవంకరలు గలదియగుఁగాత"మని యాగర్భస్థబాలకుని శాపగ్రస్తునిఁ గావించెను.

సుజాతకు నవమాసములు నిండినవయ్యెను. పదియవ మాసముఁ జొరఁబడియెను. అంతనామె యేకాంతమున బతిఁజేరి, "ప్రియతమా! హృదయేశ్వరా! నాకుఁ బదియవమాసముపస్థితమయ్యెను. ప్రసవదినములు సమీపించుచున్నవి. తాము నిర్ధనులు. ఈసమయము ధనమువినా నిర్వర్తిల్లునదిగాదు. ఈ విపత్సముద్రమునెట్లు పారమొందింపఁగలము?" అని పలికెను. సుజాతపలుకుల నాలించి కహోడుఁడు ధనసంగ్రహాభిలాషియై మిథిలాపతి జనకమహారాజుకడ కరిగెను. జనకునికడ వేదవిదుఁడును, అసాధారణబుద్ధిసంపన్నుఁడును నగువందియను పండితుఁడొకఁడు గలఁడు. ఆపండితునితో జనకసభయందు కహోడునకు శాస్త్రార్థము ప్రవర్తిల్లెను. అందాతఁడు పరాజితుఁడయ్యెను. వంది యాతనిని జలమధ్యమునఁ గూలఁద్రోయించెను. ఈశోచనీయసంఘటనము క్రమక్రమముగ, కర్ణాకర్ణికగ నుద్దాలకునకుఁ జ్ఞాతమయ్యెను. అంతట నాతఁడు సుజాతఁ జేరి, "బిడ్డా! గర్భమందున్న నీపుత్త్రున కీశోకోదంతమును నేవిధముగనైనను నవగతము కానీయకుము. అవగతమైనచో ప్రమాదమువాటిల్లు. జాగ్రత" యని హెచ్చరించెను. అందులకామె వల్లెయనియెను. పతిశోకకాతర యగుసుజాత కాలాంతరమున నొకపుత్త్రునిఁ బ్రసవించెను. ఆపుత్త్రుఁడు పితృశాపానుసరణముగ అష్టవంకరలు

గలవాఁడుగ నొప్పుచుండెను. ఆకారణమున నాతఁడు 'అష్టావక్రుఁ'డని పేరొందెను. అష్టావక్రుఁడు తల్లి సంరక్షణమువలనను తాతపోషణమువలనను, ఋష్యాశ్రమమునందు పాలితుఁడై సమయోచితసంస్కారములను బడసి పరివర్ధనుఁ డగుచుండెను. ఆబాలుఁడు తండ్రిఁగూర్చిన యుదంతము నిసుమంతయు నెఱుఁగ కుండినకతమున నుద్దాలకుని దండ్రిగను ఆతనిపుత్రుని శ్వేత కేతుని జ్యేష్ఠభ్రాతగను దలంచుకొనుచుండెను. అట్లు పదిరెండు వత్సరముల ప్రాయమువాఁ డయ్యెను. అంతట నొకదినమున నాతఁ డుద్దాలకుని తొడపైనఁ గూర్చుండి యుండుతఱి నచ్చటికి శ్వేతకేతు వరుదెంచెను. తనతండ్రి తొడపైని కూర్చునియున్న యష్టావక్రునిఁజూచి, యీర్ష్యాపరవశుఁడై కన్నులెఱ్ఱఁజేయుచు, "ఇది నీతండ్రి తొడగాదు కూర్చుండుటకు. నాతండ్రి తొడ. అందు నీవు కూర్చుండఁదగవు దిగుము." అని పలుకుచు నాతని చేయిపట్టి లాగెను. శ్వేతకేతు వాచరణమునుగని, పలుకులను విని అష్టావక్రుఁడు కడుమనఃఖితుఁడై రోదనముచేయుచు తల్లి కడ కరిగి, ఉదాసీనపూర్వకముగ "తల్లీ! నాతండ్రి యెవఁడు. యెక్కడ నున్నాఁడు? కరుణించి నాకెఱిగింపుము" అని యడిగెను. పుత్రుని ప్రశ్న మాలించినంతనె సుజాతకు హృదయస్థమగు శోక ముప్పొంగి కంఠపూరితమయ్యెను. పతికలవడినదుర్దశ తలంపు నకుఁ బాఱెను. అంత నామె యశ్రువిసర్జన మొనర్చుచు, ప్రాణాధికుఁ డగుపుత్రుని యొడిలోనికిఁ జేర్చుకొని, గద్గదకంఠమున "పుత్రా! నీతండ్రి నీవు గర్భమందుండినకాలమందు ధనార్థియై విదేహరాజు జనకునికడ కరిగెను. పిమ్మట నాతనివృత్తి విషయ మంతయుఁ దెలిసినది కాదు. కాని, కాలాంతరమున జనకసభ యందు, తత్సభాపండితుఁడు వందికిని నీతండ్రికిని శాస్త్రవాదము

జరిగినదనియు, అందు నీతండ్రి యోడెననియు, అందువలన నా రాజపండితుఁడు వంది నీతండ్రిని నీటఁద్రోయించెననియును వినవచ్చినయది. ఈవంది నీతండ్రినే గాదు. పలువురను నీటఁద్రోయించి యుండినవాఁడని వినికిలి"అని పలికెను. తల్లి పలికిన పలుకుల నాలించి యష్టావక్రుఁడు తల్లికడనుండి జని శ్వేతకేతుఁజేరి యాతనితో, "నేను రేపు జనకయజ్ఞవాటిక కరిగెదను. అందరిగి పలువురు శాస్త్రజ్ఞులు వేదజ్ఞులు సలుపు శాస్త్రాలాపమును బ్రహ్మఘోషమునునాలించిపరితృప్తిని బొందెదను"అనియెను అయ్యది విని శ్వేతకేతు, "నేనును నీతోఁగూడ జనకునియజ్ఞవాటికకు వచ్చెదను" అని బదులొసంగెను. మఱునాఁడు వఱువాత మేనల్లుఁడు అష్టావక్రుఁడును, మేనమామ శ్వేతకేతును, ఉద్దాలకుని యనుమతి వడసి జనకయజ్ఞవాటిక కరుదెంచిరి. వారలకు తద్వారముకడ జనకరాజదర్శన మయ్యెను. జనకునిఁ జూచి యష్టావక్రుఁడు "జనకరాజేంద్రా! మేము నీయొనర్చు యజ్ఞమును జూడ వేడుకబొడమ నిం దరుదెంచితిమి. ద్వారపాలురు మమ్ము లోనికిఁ జొరనీకుండిరి. కాఁబట్టి మమ్ములను లోనికిఁ జననిచ్చుటకు వారలకాదేశింపు"మని పలికెను. ఆపలుకుల నాలించి ద్వారపాలురు"ఋషికుమారా! రాజపండితుఁడు మహామతివంది యాదేశానుసరణముగ శాస్త్రజ్ఞులు వర్షీయసులు నగుబ్రాహ్మణులనుమాత్రము లోనికిఁ జొరుటకర్హులు. బాలురు అనర్హులు అని బదు లొసంగిరి. అంత నష్టావక్రుఁడు "బ్రాహ్మణులలో వేదశాస్త్రవిశారదులు, స్వాధ్యాయనిరతులు తపోరతులు యేరో వారు వృద్ధులు.క్షత్రియులలో బాహుబలులేరో వారు వృద్ధులు. వైశ్యులలో ధనధాన్యప్రాచుర్యలేరో వారు వృద్ధులు శూద్రులలో వయోధికులేరో వారువృద్ధులు. అని శాస్త్రములు నిర్ణ

యించియున్నవి. నేను పిన్నవాఁడనైనను నాయందు శాస్త్రజ్ఞానమును, స్వాధ్యాయమును తపస్సును విద్యమానములై యున్నవి. అందువలన నేను వృద్ధులలో పరిగణింపఁబడదగిన వాఁడను; గాని బాలురలో గణియింపఁబడువాఁడ నెట్లగుదును?" అని నుడివెను. ఆమృదువుల నాలించి జనకుఁ డష్టావక్రుని యథావిధిఁ బూజించెను. అనంతర మష్టావక్రుఁడు జనకునితో, "మహారాజా! నీయాస్థానమున వందియను పండితుఁ డొకఁడున్నాఁడఁట. ఆతఁడు పలువురను శాస్త్రార్థమందు పరాజితులఁజేసి వారలను జలనిమగ్నులఁ గావించుచున్నవాఁడఁట. ఆతఁ డెంతటిమహాపండితుఁడో! ఆతనితో శాస్త్రార్థముసేయవలయు నను కౌతుకమున వచ్చినవాఁడను" అని యనియెను. అందులకు జనకుఁడు "తాపసకుమారా! నీవు వందె నెన్నఁడును జూచియున్నవాఁడవు గావు ఆతని వైదుష్యప్రకర్షతను గ్రహియించినవాఁడవు గావు. అందువలన నాతనితో శాస్త్రవాదమును సలుప నుద్యుక్తుఁడవగుచున్నాఁడవు. నీ వాతనిని శాస్త్రవివాదమున నెన్నఁడును పరాజితుని గావింపనేరవు" అని బదులొసంగెను. అంతట నష్టావక్రుఁడు "జనకభూపాలా! నన్ను బాలునిగ దలంచి యవజ్ఞనిగఁ జేయకుము. కార్యముయొక్క ఫలాఫలమును గనకుండగనే నిశ్చితసిద్ధాంత మొనరించుట బుద్ధిశాలులకు నియతి గాదు" అని జనకునితో ననియెను. అష్టావక్రుని యుక్తియుక్తములును, తేజోమండితములును నగుపలుకుల నాలించి, జనకుఁ డాబాల యుగళమును లోనికి విడిచిపుచ్చుటకు ద్వారపాలుర కాజ్ఞ నొసంగెను. అంతట నష్టావక్రుఁడు శ్వేతకేతుసహితముగ యాగస్థలము నుపస్థితుఁ డయ్యెను.

అష్టావక్రుఁడు, పలువురుపండితులు పరివేష్టించియుండ వందితో శాస్త్రవాద మొనరించెను. ఆతనికి సంపూర్ణపరాజయమును సమకూర్చెను. వంది అష్టావక్రునివలనఁ బరాజితుఁడగుటఁ గని రాజర్షి జనకుఁడు, అష్టావక్రునిఁ జేరి, "ఓద్విజకుమారా! నేను నీపాండిత్యప్రకర్షతకు అత్యంతము సంతుష్టుఁడనైతిని. నీవు వయసున పిన్నవయ్యును బుద్ధిని పెద్దవైతివి. నావలన నీకు వలయున దేదియో యెఱిఁగింపు"మని యడిగెను. అందులకు అష్టావక్రుఁడు "మహారాజా! వంది పలువురపండితులను పరాస్తులఁ జేసి వారలను నీటఁద్రోయించియుండెనుగదా! అందువలన నేను నాతనిని జలనిమగ్నునిగఁ జేయవలయునని కోరుచున్నాఁడను" అని జనకునకు బదులొసంగెను. అష్టావక్రుని కోరికచొప్పున జనకుఁడు వందిని నీటఁద్రోయించెను.

ఆకాలమున జలాధిపతి, వరుణుఁ డొకబృహద్యాగమును సలుప నుపక్రమించెను ఆసమయమున నాతఁడు వందివలన జలనిమగ్నులైయున్న పండితులను యజ్ఞమందు నియుక్తులఁ గావించెను. యజ్ఞము నిర్విఘ్నముగ పరిసమాప్తమయినంతనె వరుణుఁ డాపండితులను, బహుళ ధనరాసుల నొసంగి సంతుష్టులఁ గావించి నిరుపద్రవముగ జనకరాజుకడ కనిచెను. అట్లు వరుణసత్కారములఁబడసి జలరాశినుండి వెలువడినవారలలో కహోడుఁ డొకఁడు. కహోడునిఁ జూచినంతనె, యష్టావక్రుఁ డాతని తనజనకునిగా నెఱింగి, యపరిమితానందమును బొందుచు నాతనికిఁ బ్రణుతులొసంగెను. పుత్రుని పరిచయమును బడసి కహోడుఁడు ప్రహర్షచిత్తుఁడయ్యెను. ఆతని హృదయమునఁ జేర్చెను. మూర్ధమును ముద్దుగొనియెను. అనంతరము రాజర్షి జనకునిఁ జేరి "మహారాజా! లోకులు పుత్రులఁ బడయఁ

గోరుటకు కారణ మిదియేగద! చూడుము. నేను సాధింపనే... కార్యమును నాపుత్త్రుఁ డవలీలగ సాధింపఁగలిగెను" అని యని యెను. జనకుఁడు ప్రసన్నుఁడై కహోడుని, అమితధనమొసంగి సత్కరించెను. అనంతరము విజయగర్వమునఁ గర్వితుఁడై, యష్టావక్రుఁడు జనకునియనుమతిని బడసి నిజజనకునితో, మేనమామతో జననికడ కరుదెంచెను. అట్లరుదెంచిన పతి పుత్త్రులఁ గని సుజాత సంతోషవారిధి నోలలాడఁజొచ్చెను. పుత్త్రుని కార్యసాధనమునకు కహోడుఁడు కడుప్రసన్నుఁడై, "పుత్త్రా! నేను నీయెడలఁ బ్రసన్నుఁడ నైతిని. నాయొసంగిన శాపమువలననే నీశరీరము అష్టవంకరలకు లోనయ్యెను. నీవీ నదీజలముల స్నానమాడుము. ఋజుగాత్రుఁడ వగుదువు" అని యష్టావక్రున కాదేశించెను. పిత్రాదేశముచొప్పున నష్టావక్రుఁడు నదీజలముల స్నానమాడి, వక్రశరీరమును వీడి సుందర తనుధారి యయ్యెను. అష్టావక్రుని వక్రతను దూరమొనర్చిన యానది యదిమొదలుగ 'సమంగ' యను నామమును బడసి ప్రఖ్యాతము గాఁజొచ్చెను.

అనంతర మొక్కింతకాలమున కష్టావక్రుఁడు, మహర్షి వదాన్యునిచెంత కరిగి, యాతనికన్యను త్రిలోకసుందరిని, సుప్రభానామ్నిని వివాహమాడ నెంచి, యాతనియెదుట తన యీప్సితమును బ్రకటించెను. అందులకు వదాన్యుఁడు నీవు నాకన్యఁ బరిణయమాడ నెంచితివేని, నీవొకపరి కైలాసపర్వతమున కరుగవలయు. అందు నీలవనమనుపేరుగల వనమొకటి గలదు. ఆవనములోని కేగితివేని అందొకవృద్ధతపస్వినిఁ గనఁగలవు. ఆవృద్ధతపస్వినిఁ దర్శించివచ్చితివేని నీమనోకామనము పూర్తికాఁగలదు". అని బదులొసంగెను. వదాన్యునిమాటల

నాలించి, యష్టావక్రుఁ డాతనికి నభివాదనమొనర్చి, యాతని యాశీస్సులఁ బడసి కైలాసపర్వతమున కరిగెను. అందలి 'బాహూదా' నదియందలి పవిత్రోదకముల స్నానమాడి యలకాపురిఁజేరి యక్షరాజు కుబేరునివలన సత్కృతులఁబడసెను.పిమ్మట నాతని యనుమతినిబడసి నీలవనమునకుఁ బయలువెడలెను. ఒక్కొంతదూర మరిగి యొకమనోహరమగు నుద్యానవనమును, ఆవనమం దొకయాశ్రమమును గనియెను. ఆయాశ్రమము లోని కేగినంతనె యాతని కొక దివ్యభవనము చూపట్టెను. ఆతఁ డాభవనద్వారమును డగ్గఱిలి యుచ్చైస్స్వనమున "ద్వారముకడ నతిథియొకఁడు నిలిచియున్నవాఁడు. లోపల నేవైన నుండి రేని యరుదెంచి యాతనిసత్కరింపుడు" అనిపలికెను.ఆతఁ డట్లుపలుకుటయెతడవుగ నాసుందరభవనమునుండి యేడుగురు సర్వాంగసుందరులగు తరుణీమణు లరుదెంచి యాతని నాదర సత్కారములతో నొకసుసజ్జితమగుగదిలో మృదుతరశయ్యపై కూర్చునియున్న శుక్లాంబరధారిణి, సర్వాభరణభూషిణి యగు నొకవృద్ధాంగన యెదుటకుఁ దోడ్కొని పోయిరి. వృద్ధాంగనయు మహర్షిఁ జూచినంతనె యాతని సుస్వాగతునిఁ గావించి సుఖాసనమునఁ గూర్చుండఁజేసెను మహర్షి యాసనోపవిష్టుఁడై యావృద్ధాంగన కాశీర్వాదమొసంగెను. ఆతఁ డాభవనమందు నిలిచి యాపెయొసంగు పరిచర్యలఁగొనుచు విశ్రాంతినిగనఁజొచ్చెను. రాత్రియగుడు నాతఁ డొక సుకోమల శయ్యపై శయనింపఁబోవుచు, నావృద్ధాంగనతో, "రాత్రి యెక్కుడయ్యెను ఇఁక నీవు శయనింపనేగుము" అని చెప్పెను. అంత నావృద్ధ యందుండి చని వేఱొకశయ్యపై మేనువాల్చెను. అనంతర మొక్కొంతతడవగుడు నాపె శీతబాధకు లోనై గడ

గడ వడఁకుచు లేచిచని మహర్షి ప్రక్కఁ జేరి యాతని గాఢాలిం
గన మొనర్చి పరుండఁ జొచ్చెను. అంత నాముదుసలి యాయవస్థఁ
జూచి చింతిలుచు నామహర్షి తనశరీరమును బిగ్గగ బిగఁబట్టి
శయ్యనంటుకొని పరుండసాగెను. అట్లు పరుండి యాలింగనమున
కవశుఁడై యున్న యామహర్షిఁ జూచి, యాముదుసలి, కామా
సక్తయై, తనమనోవాంఛను పూర్ణముగావింపుమని పదేపదే
ప్రార్థింపఁ జొచ్చెను. ఆమె యెంత ప్రార్థించినను, ఆమహర్షి "ఇట్టి
పాపకర్మమునకు నే నొడఁబడనేరను." అని తనయసమ్మతమును
స్పష్టముగ నామె కెరిగించెను. అందుపై నాయవ్వ "నేను ముదు
సలిని గాను. తరుణిని. ఒకరిరక్షణము లోనిదానను గాను.
స్వతంత్రను. కాఁబట్టి నాపాణిఁ గ్రహియించి నాకోర్కెఁ దీర్పుము.
దాన పాప మొనఁగూడనేరదు" అని యాతని బలాత్కరింపఁ
జొచ్చెను. ఆమె యెంత బలాత్కరించినను ఆమహర్షి చలుఁడు
గాక దృఢమనస్కుఁడై, యింద్రియనిగ్రహుఁడై యాతరుణీ
మణితో, "ఓసుశీలా! నీవు వేయిమాటలు చెప్పుము వేయిచేష్ట
లొనరింపుము కాని, నాహృదయము ధర్మపథమునుండి పతి
తము కానేరదు. నన్ను మన్నింపుము" అని సకల తన యిష్టము
లేమిని వెల్లడిచేసెను. ఆవృద్ధతపస్విని యెవ్విధముననైన నామ
హర్షిని పథభ్రష్టుని గావింపనేరనిదయ్యెను. అంత నావృద్ధరమణి,
"హే తపోధనా! నేను నీవంటి ధైర్యశాలిని, నీవంటి జితేంద్రి
యుని వేఱొకనిఁ జూచియుండలేదు. నిన్నుఁ బరీక్షింపఁ గుతుకినై
యిట్లొనర్చినదానను. నేను సామాన్యస్త్రీనిగాను. ఉత్తరదిశ
కధిష్ఠాత్రి నగు దేవిని. మహర్షి వదాన్యుఁడు నిన్నొకతో
నిందు పంపెనో యాకోరిక సంపూర్ణరూపమున సఫలము గని
యెను. ఇఁక నీవామహర్షి కడ కరిగి యాతనికన్యను సుప్రభను

పాణిగ్రహణ మొనర్చుకొని సంతానోత్పత్తిపూర్వకముగ పితృ ణపరిశోధకుఁడవు గమ్ము పొమ్ము." అని పలుకుచు, నాతనికి స్వగృహమునకు మరలుట కనుమతినొసంగెను. అష్టావక్రుఁడు మరలివచ్చినంతనె, వదాన్యుఁడు నీలవనవృత్తమునుగూర్చి యా తనిఁ బ్రశ్నించెను. ఆతఁడామహర్షితో, తాను చూచినది చూచినటుల, జరిగినది జరిగినటుల వివరించి చెప్పెను. అయ్యది యాలించి వదాన్యుఁడు ప్రహర్షచిత్తుఁ డయ్యెను. అనంతరము ప్రసన్నతాపూర్వకముగ సుప్రభను యాతని కొసంగి, విధ్యుక్తముగఁ బరిణయ మొనర్చెను. అష్టావక్రుఁడు సుప్రభగర్భము నుండి యొకపుత్రునిఁబడసి పితౄణముక్తుఁ డయ్యెను.

అష్టావక్రుచరిత్రమును బ్రహ్మవైవర్తపురాణ మీవిధ ముగఁ జెప్పుచున్నది. అసితమహర్షి తనయుఁడు దేవలుఁడు గంధమాదనపర్వతమునందు తపస్సు చేయుచుండుతరి, సంయో గవశమున నం దరుదెంచిన యప్సరాంగనరంభ, కంతువసంత జయంతులఁబోలె సుందరాకారుఁడై వెలుఁగుచున్న యాతనిఁ జూచి, మోహపరవశయై, తనమనోవాంఛను ఆతని కెరింగిం చెను. ఆతనిఁ బలాత్కరించెను. పలువిధములఁ బ్రార్థించెను. ఆతఁ డందుల కంగీకరింపక, యామెప్రార్థనమును తృణీకరించెను. అందుపైని రంభ కుపితయై, "హేవక్రవిప్రా! నీశరీరము వక్రత గలదిగను, కాలాంజనసదృశమగు కృష్ణవర్ణము గలదిగను యగుఁగాత! నీరూపయౌవనములు వినష్టములగుగాత! నీవు జగత్తునందు అద్భుతవికటాకారుఁడ వగుదువుగాత! నీతపస్సం తయుఁ నష్టమగుఁగాత," యని దేవలునకు శాపమొసంగి యం దుండి వెడలిపోయెను. రంభశాపమునకు గుఱియైన దేవలునకు హరిపాదపద్మసందర్శనము దుర్లభమయ్యెను. అందువలన నాతఁ

దుఃద్విగ్నుఁడై, తనశరీరము పూర్వపుణ్యావర్జితమై వికృతరూపముఁ గలదై యుండుటను జూచి సహింపనేరక, శోకసంతప్త హృదయుఁడై, యగ్నికుండమునఁబడి ప్రాణవిసర్జన మొనర్చుట కుద్యుక్తుఁడయ్యెను. ఆతఁ డీవిధముగ నుద్విగ్నుఁడగుటఁజూచి, శ్రీహరి కరుణార్ద్రహృదయుఁడై యాతనికడ కరుదెంచి యాతనికి దివ్యోపదేశ మొసంగి ధైర్యముఁ గరపెను. దేవలుని శరీరమం దష్టవంకర లుండుటఁగని శ్రీహరి యాతనికి అష్టావక్రుఁడని పే రిడియెను.

అష్టావక్రమహర్షి జనకమహారాజునకు ప్రశ్నోత్తర రూపముగ జ్ఞానోపదేశ మొసంగెను. ఆయుపదేశము గ్రంథబద్ధమై "అష్టావక్రసంహిత" యను నామమునఁ బ్రసిద్ధిఁ గనుచున్నయది. అయ్యది యుత్తమోత్తమ గ్రంథరాజము.

12. సంవర్తమహర్షి

అంగిరమహర్షి బ్రహ్మమానసపుత్రులలో నొకఁడు. ఆతఁడు కర్దమపుత్రికను, ధర్మశీలను, శ్రద్ధను పరిణయమయ్యెను. ఆతనికి శ్రద్ధాదేవిగర్భమునుండి, యుతథ్యుఁడు, బృహస్పతి. సంవర్తుఁడు నను మువ్వురు కొమరు లుదయించిరి. వారు మువ్వురును కాలానుగుణముగ వేదవిదులును, శాస్త్రజ్ఞులును, తపస్వులును నైరి. ఆసోదరులు మువ్వురిలో బృహస్పతి సంవర్తులన్యోన్యము స్పర్ధాళువులై యొప్పుచుండిరి. ఆయిరువురు నీర్ష్యాపరవశులై యొకరినొకరు ద్వేషించుకొనుచుండిరి. జ్యేష్ఠుఁడగు బృహస్పతి కనిష్ఠుఁడగు సంవర్తున కత్యంతకష్ట మొదఁగూర్చు

చుండెను. ఆతనివలన కలుగుచున్న కష్టము దుస్సహమగుచుండిన కతమున సంవర్తుఁడు వివస్త్రుఁడై వనవీథులఁ దిరుగాడఁజొచ్చెను. ఆకాలమందే దేవేంద్రుఁడు దైత్యుల జయించి మహామతి బృహస్పతిని దేవతలకుఁ బురోహితునిగ నియుక్తునిఁగావించెను. అంగిరమహర్షి కరంధమ మహారాజునకుఁ గుల పురోహితుఁడు కరంధమునకు మరుత్తు పౌత్త్రుఁడు మరుత్తు పితామహా పితరులయనంతరము సింహాసనారూఢుఁడై ప్రజలను నిజప్రజలంబోలె పరిపాలింపఁజొచ్చెను. దేవేంద్రుఁడు మరుత్తుని యందేలకో ద్వేషమూని యున్నవాఁడు అకారణముననాతని నవమానితునిఁ గావింపవలయునని మదినెంచి నిరంతరము తత్ప్రయత్నమొనరింపఁజొచ్చెను; కాని, సఫలమనోరథుఁడు కాఁజాలకుండెను. అంతనొకనాఁ డాతఁడు నిండోలగముననుండి బృహస్పతిఁజీరి, "దేవగురూ! నేను ముల్లోకముల కధిపుఁడను, మరుత్తు కేవలము భూలోకమునకు మాత్ర మధిపుఁడు, నీవు మృత్యుపహీను లగుసురులకు పురోహితుఁడవై యుండియు, మృత్యువశవర్తి యగునరునకు మరుత్తునకు పౌరోహిత్య మొనర్చుచుండుట యుచితవర్తనము గానేరదు. కాబట్టి యయ్యది యొనరింపవలదు. మరుత్తుని పౌరోహిత్యము వదలుకొనుట కియ్యకొనఁజాలవేని, నిన్ను పురోహితునిగ నునిచికొనుటకు నే నియ్యకొననేరను." అని చెప్పెను. ఇంద్రుని మాటల నాలించి యాతనికి బృహస్పతి, "స్వర్లోకాధిపా! దేవేంద్రా! నేను మరుత్తునకు పౌరోహిత్యము సేయఁబోల్లను. అంతియకాక నీకమ్ముం దెన్నఁడును మనుష్యులు చేయు యజ్ఞమందు హవిర్గ్రహణ మొనర్చువాఁడను గాను" అని యిదెకృత ప్రతిజ్ఞుఁడ నగుచున్నాఁడను. నా ప్రతిజ్ఞ యెన్నఁటికిని భంగము

కానేరదు అని సమస్తదేవతలయెదుట ప్రత్యుత్తర మొసంగెను. బృహస్పతి ప్రతిననాలించి స్వర్గాధిపతి సంతుష్టచిత్తుం డయ్యెను.

ఇంద్రసమ్ముఖమున బృహస్పతి యొనర్చినప్రతిన మరుత్తునకు కర్ణగతమగుడు, అతం డొక బృహద్యాగ మొనర్చుట కాయోజనము చేయుచు,బృహస్పతి చెంత కరిగి,"గురూత్తమా! మీరు నాకు కులపురోహితులరు. నే నొక యజ్ఞమును సలుప మనసం దలంచితిని. కాంబట్టి నాయందు కృపంజేసి యరుదెంచి నాయొనర్చుయజ్ఞమును సుసంపన్నమగుదానిగం జేయుం"డని యాతని సవినయభయభక్తులతోం బ్రార్థించెను మరుత్తుని ప్రార్థన మాలించి బృహస్పతి, "వత్సా! నేను దేవేంద్రుని పౌరోహిత్యమును గ్రహియించినవాండ నగుటచే, దేవతలయెదుట, మనుష్యులకుం బౌరోహిత్య మొనర్పనని బాసంజేసియున్నాండను. కాంబట్టి ఆబాస కిపుడు ప్రతికూలుండనై నీచే యజ్ఞమును జేయింపనేరను" అని బదులొసంగెను. అందులకు మరుత్తు మిగుల చింతిలుచు "దేవా! మీరు నాకు వంశపరంపరాగత పురోహితులరుగాని నేంటివారు గారు. అట్టిసమయమున నా పురోహితమును బోనాడి నన్ను నిరుత్సాహునిగం జేయుట ధర్మముగాదు.నన్ను కరుణింపుండు.నాచె యజ్ఞమును జేయింపుండు" అని బృహస్పతిని బలువిధములుగం బ్రార్థించెను. మరుత్తు ఎంత ప్రార్థించినను బృహస్పతి యాతనిచేత యజ్ఞమును జేయించుట కియ్యకొనండయ్యెను. అంత మరుత్తు కడుదుఃఖితుండై, యుదాసచిత్తుండై స్వగృహమునకు మరలుచు, మార్గమధ్యమున దైవికముగ నారదుని సందర్శించెను నారదుండు మరుత్తుని సాంత్వన వచనముల ననునయించి యాతనియుదాసీనతకు కారణ మేటిదని యడిగెను. దేవర్షి పలికిన సాంత్వనావచనముల నాలించి మరుత్తు,

కులపురోహితుఁడు ఆంగిరసుఁడు పలికిన నిరాదరణపుపలుకు నాతనికి వినిచెను. ఆపలుకుల నాలించి దేవర్షి, "రాజా! ఉదాసీనుఁడవు గాకుము. అంగిరునకు కనిష్ఠపుత్త్రుఁడును,బృహస్పతికి కనిష్ఠభ్రాతయు నగుసంవర్త్తమహర్షిని దోడ్తెచ్చి యజ్ఞనేతృకుఁడవు గమ్ము. ఆతఁడు నీయొనర్చుయజ్ఞమును విధిపూర్వకముగఁ జేయింపఁగలఁడు." అని మరుత్తునితోఁ జెప్పెను. దేవర్షి చెప్పిన మాటనాలించి మరుత్తు సంతోషతరంగితాంతరంగుఁడై, "యో తపోధనా! నే నాకులపూజ్యుఁడగు అంగిరోనందనుని సంవర్త్తుని యెందుఁ గనఁగలను? ఆమహనీయునిసందర్శన మెట్లుఁ బొందఁగలను." అని యాతని నడిగెను. అందులకు నారదుఁడు, "ఓ! రాజా! సంవర్త్తమహర్షి చిత్తవిభ్రమునిఁ బోలె దిగంబరుఁడై ప్రకృతము విశ్వనాథసందర్శనార్థము కాశీపురమందు పరిభ్రమించుచున్నవాఁడు. నీవందేగి విశ్వనాథమందిరద్వారముకడ నొకశవమును నిలువరించి యుంచవేచి యుండుము ప్రాతఃకాలమున విశ్వేశ్వరసందర్శనమునకు వచ్చువారలలో తన్మందిర ద్వారమందొప్పియున్న శవమును జూచి యేమహనీయుఁడు వెనుకకు మరలునో, యామహనీయుఁడే సంవర్త్తుఁడని గ్రహింపుము. ఆతఁ డేదిక్కునకు మరలునో నీవాదిక్కున కాతని వెనువెంటనే యరుగుము. ఆతఁడు నిర్జనప్రదేశమున కరిగినప్పుడు నీ వాతనికి సమ్ముఖుఁడవై, నీమనోవాసనను బ్రకటింపుము. నాయుదంతమును ఎట్లు తెలియఁగలిగితివని యాతఁడు నిన్నడిగినప్పుడు, నారదునివలనఁ దెలియఁగలిగితినని చెప్పు"మని మరుత్తునితోఁ జెప్పి తా నెందేని చనియెను.

మరుత్తు నారద నిర్దేశానుసరణముగ వారాణసీపురి కరిగెను. ఆతని యుపదేశము చొప్పున ప్రవర్తిల్లి సంవర్త్తమహర్షి

సందర్శనమును బడసెను. సంవర్తమహర్షి మరుత్తుని బొడ
గాంచినంతనె యాతనిపై రాళ్లను రువ్వఁజొచ్చెను. ఆతనిపై
నశుద్ధపదార్థములు వైవఁదొడంగెను. ఆతనిముఖముపై నుమియఁ
జొచ్చెను. ఆతనిఁ బలువిధముల నవమానితునిగఁ జేసెను.
మహర్షి యెంత నిందించినను, ఎంత యవమానించినను మరుత్తు
విముఖుఁడుగాక యాతనివెనువెంటఁ జనఁజొచ్చెను. మహర్షి
యత్యంత దూరమరుగుట కారణముగ మిక్కిలిగ బడలికఁ
గొనినవాఁడై యొక వటవృక్షచ్ఛాయయం దాసీనుఁడై విశ్రాం
తిని గొనఁజొచ్చెను. ఆసమయమున మరుత్తు ముకుళితకర
కమలుఁడై మునియెదుటికిఁ జని నిలిచెను అట్లు వినమ్రుఁడై
యెదుట నిలిచిన రాజుఁ జూచి యామహర్షి, "హే! రాజన్!
నాయునంత మెట్లు గ్రహింపఁగలిగితివి? నావలన నేమి యాశిం
చితివి?" అని యడిగెను అంత రాజు, "ఓమహర్షిశేఖరా! మీ
సంగతి నారదునివలనఁ దెలియఁగలిగితిని నే నొకయజ్ఞమును
జేయసమకట్టితిని. తామదు వెంచి యాయజ్ఞమును సుసంపన్నముగ
దానిగఁ గావింప తమ్ముఁ బ్రార్థించుచున్నాను. ఇదియె నామనో
వాంఛితము. నన్నుఁ గరుణింపుఁడు" అని యామహర్షికి స
వినయముగ విన్నవించెను. మరుత్తునివాంఛిత మెరింగి మహర్షి
రుష్టుఁడై కర్కశస్వరమున, "రాజా! నేను వెఱ్ఱివాఁడను.
వికలచిత్తుఁడను. నావలన నీయజ్ఞము యథోచితరీతిని సంపాది
తము కానేరదు. నాసోదరుఁడు బృహస్పతిఁ గొనితెచ్చి యాగ
సంపాదితము గావింపుము. ఆతఁడు యజ్ఞవతుఁడు. అట్లు
కాక, నీవు నావలననే యజ్ఞసంపాదనమును గావింపనెంచితివేని
యాతని యనుమతిని బడసిరమ్ము" అని పలికెను. అంత మరుత్తు,
సురగురునకును తనకును పూర్వప్రవర్తిత మగుసంభాషణము

నంతయును సమగ్రముగ వినిచి, "మహర్షివర్యా! బృహస్పతి దేవపురోహితుఁ డయ్యెను. అందువలన నాపౌరోహిత్యమును జేయుట తన కవమానదమని తలంచినవాఁడు. అంతియకాదు. ఇంద్రుఁ డాపౌరోహిత్యమును జేయవలదని యాతని నిర్బంధించియుండెను" అని మహర్షి కెఱిఁగించెను. అయ్యది విని సంవర్తుఁడు, "రాజేంద్రా! నేను నీచేత యజ్ఞమును జేయించుటకు ప్రారంభ మొనరించితినేని, ఇంద్రుఁడును బృహస్పతియు నాయెడ క్రుద్ధు లయ్యెదరు. నాకనిష్ట మొనఁగూర్పఁ దొడంగెదరు. అపుడు నీకు నాయందుఁ గలభక్తి సుస్థిరముగ నిలిచి యుండునది యగునో కాదో యనుసందియమున నాహృదయ మూఁగులాడుచున్నయది. నీవు నాయెడ దృఢభక్తుఁడ వగుదువేని, నేను నీకోరికను బూర్తి యొనరింపఁ గలను." అని మరుత్తునితో ననియెను. అందులకు మరుత్తు, "ఋషిచంద్రమా! అట్లెన్నఁడును సందియ మొందకుఁడు మీయందలి భక్తిసుదృఢమైనది. త్రికరణశుద్ధిగఁ బలుకుచుంటిని. అయ్యది యెన్నఁడు నెవ్విధముననను కొఱవడ నేరదు." అని సుస్పష్టముగఁ బలికెను. ఆపలుకుల నాలించి, మహర్షి "రాజేంద్రా! నాకు ధనధాన్యములయం దిసుమంతయు నాసలేదు. కేవలము, ఇంద్రసదృశుఁడ వగుటకునై నీచే యజ్ఞమును జేయించుట కియ్యకొనుచున్నాఁడను. కాఁబట్టి నీకొక యుపదేశ మొసంగుచున్నాఁడను. గ్రహింపుము. నీవు మునుముందు హిమాలయమున కరిగి దేవాధిదేవుని మహాదేవుని తపంబొనర్చి మెప్పింపుము. హిమాలయప్రాంతమునందలి ముంజవత్పర్వతమందు సువర్ణఖని యొండు గలదు. ఆగనిని ఈశ్వరకటాక్షమునకుఁ బాత్రుఁడవై, గ్రహియించి యందలి సువర్ణమును గొనితెచ్చి యద్దానివలన యజ్ఞ

సామగ్రిని సంగ్రహింపుము. దాన నీయొనర్చుయజ్ఞ మమోఘముగఁ బ్రవర్తిలఁగలయగు” నని చెప్పెను. సంవర్తోపదేశమును శిరోధార్యమొనరించి, కృతకృత్యుఁడై యాగదీక్షఁ గైకొనియెను.ఆవల సురగురువు,తనసోదరుఁడు మరుత్తునిచేత నొకమహాయజ్ఞమును చేయించి తన్మూలమున మహాధనికుఁడు గానున్నవాఁడని యెఱింగి వికలచిత్తుఁ డయ్యెను. ఆచార్యుఁ డస్వస్థచిత్తుఁ డగుటఁ జూచి యింద్రుఁడు చింతిలుచు,తత్కారణమును వివరింపుఁడని యాతనిఁ బ్రార్థించెను. అంత బృహస్పతి యింద్రునకు యావద్వృత్తమును వినిచి, “పురందరా! నాకు సంవర్తుఁడు ఘోరశత్రుఁడు. దైత్యోన్నతి యాదిత్యులకు హృదయకంటక మగుతెఱంగున సంవర్తుని యౌన్నత్యము నాకు హృదయకంటకమగు. అద్దానికి నేను సహింపఁజాలను. కాఁబట్టి, యింద్రా! మీర లేవిధముగనైనను మరుత్తసంవర్తలను యజ్ఞనివృత్తులఁ జేయుఁడు. దాన నాకు మనస్స్వాస్థ్యమలవడు”నని చెప్పెను. అంత నింద్రుఁడు హుతాశనుని రావించి, “అనలా! నీ వీసురగురుని వెంటఁగొని మరుత్తునికడకరుగుము.ఆతనితో,సంవర్తుని విడనాడి యీసురగురుని యాజ్ఞికునిగఁ జేకొనుము. ఈతఁడు నీ కమరత్వ మొడఁగూర్చునని చెప్పుము.” అని యాతని కాదేశించెను. అనలుఁడు దేవేంద్రుని యాదేశముచొప్పున మరుత్తునికడకేగి యాతనికి నింద్రసందేశమును వినిచెను. ఇంద్రసందేశ మాలించి మరుత్తు అనలబృహ...ను భక్తియుక్తముగఁ బూజించి, వారలతో, “దివ్య... నేను సంవర్తమహర్షిని యాజకునిగ నియుక్తునిఁ ...ంటిని. ఇక నిపుడు బృహస్పతిని పురోహితునిగఁ జేసి

కొన నేరను." అని సవినయముగఁ జెప్పెను. అయ్యది యాలించి యగ్నిదేవుఁడు, సంవర్తునియెడ మరుత్తునకు గలభక్తిని కొఱ వడుదానిగఁ జేయనెంచి, యాతని ననేకవిధముల ప్రలోభునిగఁ జేయనెంచి తత్ప్రయత్న మొనరింపఁజొచ్చెను. అగ్నిదేవుని వర్తనమును జూచి సంవర్తుఁడు కుపితుఁడై యాతనిఁ జీరి, "అనలా! యీక్షణమున నిందుండి వెడలిపొమ్ము. తడయకుము" అని శాసించుచు, "ఇఁకముం దెన్నఁడైన బృహస్పతివెంట మరల నరుదెంచితివేని నిన్ను శపియించెదను." అని పలికెను. అనలుఁడు భయకంపితుఁడై బృహస్పతిఁ దోడ్కొని యింద్రుని చెంతకేగి యావద్వృత్తమును వినిచెను. అగ్నిదేవుఁడు చెప్పి నది వినియును ఇంద్రుఁ డూరకొనక మరల నగ్నితో, నీవింకొక సారి బృహస్పతితో మరుత్తునికడ కరుగుము. ఆతనితో నామాటగ నామాట మన్నింపవేని నిన్ను వజ్రప్రహారము నకుఁ బాలుగావించెద నని చెప్పు"మని చెప్పెను. ఆమాట నాలించి యనలుఁడు, "ఆతనికడకు నే నరుగఁజాలను. అరిగితినేని నన్ను సంవర్తుఁడు శాపదగ్ధునిగఁ జేయును ధృతరాష్ట్రునిఁ బని చిన నీకార్యము సాధితమగు" నని యింద్రునకు విన్నవించెను. అనలుఁడు బ్రాహ్మణశాపమునకు వెఱఁగొందుచున్నవాఁడని తలంచి యింద్రుఁడు ధృతరాష్ట్రుని సందేశహారిగ నియుక్తునిఁ గావించి మరుత్తునికడ కనిపెను. ధృతరాష్ట్రుఁడు మరుత్తునిఁ జేరి యింద్రసందేశ మెఱిగించుఁడు, ఆతఁడు, "నేఁ జేయవలయునది యిదివరకే చేసియుంటిని. ఇఁక నిపుడు వేఱొండు చేయఁగుందు సంవర్తుని పరిత్యజించి బృహస్పతిని పరిగ్రహించి నేనై, గ్రహి నియుక్తుఁ జేసితినేని అయ్యది యధర్మవర్తనమువలన యజ్ఞ

గనక సంవర్తుఁడు నన్ను శపియించు అందులకు నే నియ్యకొన నేరను" అని బదు లొసంగెను అందులకు ధృతరాష్ట్రుఁడు గినిసి, "నీవు ఇంద్రసందేశమును మన్నింపకున్నాఁడవు. అదుగో, వజ్రాయుధమునుగొని యింద్రుఁ డంతరిక్షమున నెట్టుల సింహనాద మొనర్చుచున్నవాఁడో! చూడుము" అని పలుకుచు మరుత్తునకు భయముఁగొలుపఁ జొచ్చెను. మరుత్తు కన్నులెత్తి యాకాశమునంకఁ జూచి వజ్రహస్తుఁ డగుపురందరునిఁ గని భయకంపితుఁడై, తపోనిధియుఁ మహాత్ముఁడును నగుసంవర్తునకు వృత్తాంతమును వివరించి చెప్పి, యాతనితో "మహాత్మా! మన యుభయులము నింద్రుని వజ్రమున కెఱ గాకుండు నుపాయ మొండు పరికింపుఁడు" అని యనియెను. అంత నామహర్షి యారాజుతో, "నీ విసుమంతయు జింతిల కుము. కని వె ను స్తంభనీవిద్యచే నాతని చేతులను స్తంభీభూత ములుగఁ గావించి నీ భయమును దూర మొనర్చుచున్నాఁడ" నని చెప్పుచు నింద్రుని చేతులను స్తంభీకృతములుగ గావించెను. అనంతరము మంత్రోచ్చారణ మొనర్చుచు సమస్త దేవతా సహితముగ నాతని నాహ్వానితుని గావించి, "రాజా, అదుగో, నామంత్రబలమున కెదురునిలువనేరక దేవేంద్రుఁడు దేవతాసహితముగ నెట్టుల తత్తరమొందుచు యజ్ఞవాటిక కరుదెంచుచున్నవాఁడో చూడు"మని యనియెను. అంత నింద్రుఁ డరుదెంచి సంవర్తునకు శరణాగతుఁ డయ్యెను.
డాతనికి చైతన్య మొసఁగెను. స్వాగత మిచ్చెను అతని
ర్ఘ్యాదివిధులఁ బూజించెను. ఇంద్రుఁడు మరుత్తు
న్న వలబడసి యజ్ఞములయందు దేవతాసహితముగ

సమన్వితుండై యుండుటయేగాక యజ్ఞమందు యథాయోగ్యముగు భారమునుగూడ గ్రహించెను మరుత్తుని యజ్ఞము నిర్విఘ్నపరిసమాప్తిఁ గనియెను శచీధవుఁడు మరుత్తునియెడఁ బ్రసన్నుఁడై యాతనితో, "మహారాజా! నీయెడ సంతుష్టుండనైతిని. వారలఁగో చూడుము అమరులును నీపూర్వపురుషులును నీయెడఁ బ్రసన్నులై దివంబున విరాజిలుచు నీకాశీస్సులనొసంగుచున్నవారలు. భక్తిపూర్వకముగఁ జేకొనుము" అని చెప్పుచు తాను సురలోకమునకుఁ బ్రస్థానుఁడయ్యెను సంవర్తుఁడు మరుత్తునిచేఁ బూజితుండై తపంబొనర్ప నరణ్యమున కేగెను.

[illegible] 'వావిళ్ల' [illegible] 19 యజ్ఞ